ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 3
జిల్లా వార్తలు
గురువారం 20, జూన్ 2024

- ప్రజలను మభ్యపెట్టేందుకే వెలిగొండ ప్రారంభం
- గుండ్లకమ్మను జీవోలతోనే సరిపెట్టిన జగన్‌రెడ్డి సర్కారు
- తాగునీటి సరఫరాలోనూ అవినీతి, అక్రమాలు
- అధికారులతో సమీక్షలో మంత్రి స్వామి ధ్వజం
- స్నేహపూరితంగా పనిచేద్దాం.. బాబు లక్ష్యాలకు అనుగుణంగా ముందుకెళ్దామని పిలుపు
- బయటపడిన వివిధ శాఖల్లోని డొల్లతనం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, వేదికపై ఎంపీ మాగుంట, ఇతర ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీ

రబీ సీజన్ పూర్తయి మూడు నెలలు దాటింది. వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు అరకొర పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకున్నారు. వచ్చినకాడికి అమ్ముకున్నారు. తీరా ఇప్పుడు అధికారులకు కరువు గుర్తొచ్చింది. మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ తీరికగా పరిశీలనకు బయలుదేరారు. నిజానికి కరువు బృందాలు తొలి ప్రాధాన్యతగా పంట నష్టాలను పరిశీలించాలి. అయితే కరువు జాబితా ప్రకటించడంలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఖరీఫ్ సాగు సమయంలో ఒక్కచోట కూడా పంట లేని రబీ నష్టాల పరిశీలనకు కేంద్ర బృందం రావాల్సి వచ్చింది. మరి వారు ఏం చూస్తారో.. ఏ మేరకు సాయం చేస్తారో అని రైతులు ఎదురుచూస్తున్నారు.



మార్కాపురం మండలం కొలభీమునిపాడులో కరువుతో ఎండిపోయిన పత్తి పైరు (ఫైల్)

ఇప్పటికి తీరిందా!

- పంటలు లేని సమయంలో పరిశీలన
- నేడు కేంద్ర బృందం పర్యటన
- ఖరీఫ్ ప్రారంభమయ్యాక గత రబీ నష్టాలు చూసేందుకు అధికారులు
- ఎన్నికల హడావుడిలో కరువు గోడు పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- అపార నష్టం జరిగినా జాబితా ప్రకటనలో అప్పటి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- నివేదికలతోపాటు ముఖాముఖికి యంత్రాంగం ఏర్పాట్లు

ఒంగోలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరువు కోరల్లో చిక్కుకొని పంటలు పండక, తాగేందుకు నీరు లేక ప్రజలు గగ్గోలుపెట్టగా తక్షణ చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. గత రబీ సీజన్ కరువు కష్టాలు, నష్టాల పరిశీలనకు ఇప్పుడు కేంద్ర అధికారుల బృందం జిల్లాకు వచ్చింది. కేంద్ర పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌హెచ్ సందీప్‌శర్మ నేతృత్వంలోని నలుగురు సభ్యులతో కూడిన బృందం బుధవారం రాత్రికి ఒంగోలుకు చేరు కుంది. గురువారం ఉదయం ప్రకాశం భవన్‌లో కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి కరువు తీవ్రతను తెలియజేస్తూ ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తుంది. అనంతరం పశ్చిమప్రాంతానికి వెళ్తుంది. తర్లుపాడు, మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి గత రబీ సమయంలో వారు పడిన ఇక్కట్లను తెలుసుకుంటుంది.

సీజనంతా లోటు వర్షపాతం

వాస్తవానికి గతేడాది (2023-24) ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ సకాలంలో వర్షాలు కురవక పంటల సాగు ముందుకు సాగలేదు. ప్రత్యేకించి రబీ సీజన్ పూర్తి ప్రతి కూలంగా సాగింది. పంటలు సాధారణంగా అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వేస్తారు. జిల్లాలో సాధారణ వార్షిక వర్షపాతం 751.50 మి.మీ కాగా రబీ సీజన్ ఉండే మూడు నెలల్లో 384.8 మి.మీ కురుస్తుంది. అయితే గత రబీ సీజన్‌లో 44.36శాతం లోటుతో కేవలం 214.10 మి.మీ మాత్రమే పడింది. ప్రత్యేకించి ఏడాది మొత్తం మీద అత్యధికంగా వర్షం కురిసే అక్టోబరులో 94శాతం లోటు ఏర్పడింది. ఫలితంగా జిల్లాలో ఎక్కడా ఒక్క చెరువుల్లోకి కూడా నీరు చేరకపోగా చాలాచోట్ల భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయి. మరోవైపు సాగర్ నీరు కూడా రాలేదు. దీంతో ముమ్మరంగా పంటలు సాగు కావాల్సిన సమయంలో వర్షాలు లేక, సాగర్ జలాలు రాక, చెరువుల్లో నీరు లేక సాగు ముందుకు సాగలేదు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..

నిండు వర్షాకాలమైన రబీ సీజన్‌లో 70 ఆవాసాలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సి రాగా ప్రస్తుతం కూడా పశ్చిమప్రాంతంలోని 92 హ్యాబిటేషన్లకు నీటిని తోలుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో రబీ సీజన్ కరువు పరిస్థితుల పరిశీలన పేరుతో కేంద్రప్రభుత్వ అధికారుల బృందం జిల్లాకు బుధవారం రాత్రి చేరుకుంది. నిజానికి ఈ బృందం మార్చిలోనే రావాలి. అలా రావాలంటే ఫిబ్రవరిలోనే రాష్ట్రప్రభుత్వం కరువు స్థితిని కేంద్రానికి నివేదించాలి. అయితే నాటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎన్నికలకు ముందు మార్చి 7న కరువు మండలాలను ప్రకటించింది. ఆతర్వాత ఎన్నికల హడావుడిలో కేంద్రం నుంచి బృందాలు రాష్ట్రానికి రాలేదు. ఆ ప్రక్రియ ముగిశాక ప్రస్తుతం వచ్చింది. కాగా మార్చి 7న జిల్లాలోని 38కిగాను 31 కరువు మండలాలుగా ప్రకటించారు. వాటిలో 22 మండలాల్లో 36,147 మంది రైతులకు చెందిన 29,713 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదించారు. అలాగే ఇరిగేషన్, తాగునీరు, ఉపాధి పనుల కల్పన తదితర అంశాలను కేంద్ర బృందానికి నివేదించను న్నారు. వాటిని పరిశీలించడంతోపాటు క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలతో బృందం అధికారులు ముఖాముఖి మాట్లాడేలా అధికారులు కార్యక్రమాన్ని రూపొందించారు.



కరువు బృందానికి స్వాగతం పలుకుతున్న అధికారులు

రూ.350 కోట్ల మేర రాబడి పోయింది!

రబీ సాగు విస్తీర్ణం లక్షా 72వేల హెక్టార్లు కాగా, గత సీజన్‌లో లక్షా 23వేల హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. ప్రధాన పంటల్లో ఒక్క పొగాకు మాత్రం కాస్తంత అధికంగా వేయగలిగినా కీలకమైన శనగ, మినుము, వరి, మిర్చి వంటి పంటలను సగం విస్తీర్ణంలో కూడా సాగు చేయలేకపోయారు. వేసిన పంటలు కూడా వర్షాలు లేక దిగుబడులు తగ్గాయి. అలా వేలాది హెక్టార్లలో పంటలు సాగు కాక, సాగైన పంటలు దిగుబడులు సరిలేక జిల్లా రైతులు రబీ సీజన్‌లో దాదాపు రూ.350 కోట్ల మేర రాబడిని కోల్పోయారు. ఇక నీటి వనరుల పరిస్థితిని పరిశీలిస్తే జిల్లాలో ప్రధాన సాగు, తాగునీటి వనరైన సాగర్ కాలువలో సాగుకు ఒక్క చుక్క నీరు రాలేదు. ఇక మధ్యతరహా వనరులుగా ఉన్న మోపాడు, కంభం చెరువుల నీటి సామర్థ్యం 5.10 టీఎంసీలు కాగా, కేవలం 0.60 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక సుమారు 9.30 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న 799 చెరువులు ఉండగా వాటిలో పట్టుమని పదిశాతం చెరువుల్లో కూడా నీరు లేదు. అలా వర్షాలు లేక, చెరువుల్లో నీరు లేక, సాగర్ కాలువలు రాక భూగర్భజలాలు అడుగంటి తాగునీటికే కాక సాధారణ వాడకానికి కూడా నీరు లేక ప్రజానీకం అల్లాడిపోయారు.

కదిలిన పొగాకు మార్కెట్

- కిలో రూ.343 పలికిన గరిష్ఠ ధర
- మళ్లీ పోటీపడుతున్న బయ్యర్లు
- మీడియం, మేలురకం తేడా లేకుండా కొనుగోలు... బ్రౌన్‌కు డిమాండ్

ఒంగోలు, జూన 19(ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్లో మరోసారి కదలిక వచ్చింది. గరిష్ఠ ధర బుధవారం కిలో రూ.343 పలికింది. ఒంగోలు-1 కేంద్రంలో ఈ ధర దక్కగా.. ఇతర కేంద్రాల్లోనూ రూ.340కి అటుఇటుగా లభించాయి. పక్షంరోజుల క్రితం ఏకంగా కిలో రూ.360కిపైగా పలికింది. అనంతరం కీలకమైన వ్యాపారులు అప్రమత్తమై కూటమి కట్టి ధరలు తగ్గించి వేశారు. అలా గడిచిన పక్షంరోజులుగా కిలో గరిష్ఠ ధర రూ.330గా ఉంటూ వస్తోంది. ఒకటి, రెండు బేళ్లకు ఎక్కడైనా రూ.332 పడుతున్నప్పటికీ సీలింగ్ పెట్టినట్లు అధిక బేళ్లను రూ.330కే కొనుగోలు చేస్తున్నారు. అయితే బుధవారం నాటి మార్కెట్లో వ్యాపారుల సిండికేట్ సడలింది. పలు గ్రేడ్‌ల బేళ్ల కోసం వివిధ కంపెనీల బయ్యర్లు పోటీపడ్డారు. ఈ క్రమంలో గరిష్ఠ ధర తొలుత కిలో రూ.335, తర్వాత రూ.340 పలికి చివరకు రూ.343కు చేరింది. పలువురు డీలర్లు, ఒకటి రెండు ఎగుమతి కంపెనీలు ఇలా ధరలు పెంచగా మార్కెట్‌ను శాసించే ఐటీసీ కూడా వారిని అనుసరించక తప్పలేదు. ఆ కంపెనీ కూడా కిలో రూ.340 వరకూ ధర ఇచ్చింది. మేలు రకంతోపాటు మీడియం బేళ్లను అదే ధరలకు పలువురు వ్యాపారులు కొనుగోలు చేశారు. అలాగే లోగ్రేడ్‌లో నాణ్యతగా భావించే బ్రౌన్ రకానికి మంచి డిమాండ్ కనిపిస్తోంది. నాలుగైదు రోజుల క్రితం ఆ రకం కిలో రూ.285 నుంచి రూ.290 వరకూ కొన్నారు. కాగా ఇప్పటివరకు దక్షిణాదిలోని 11 వేలంకేంద్రాల్లో సుమారు 70 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.254 ధర లభించింది. ప్రస్తుతం మార్కెట్ తీరు చూస్తే సగటు ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.



రేపు ఒంగోలు-2లో ఏరువాక

ఏటా సంప్రదాయంగా పొగాకు రైతులు నిర్వహించే ఏరువాక కార్యక్రమం ఈనెల 21న జరగనుంది. ఆ రోజున ఉదయం 9 గంటలకు ఒంగోలు-2 వేలం కేంద్రం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్, వైస్ ఛైర్మన్ గుత్తా వాసుబాబు, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు పాల్గొననున్నారు.

వృద్ధురాలి హత్య... ఆపై దోపిడీ

- రూ.4.5 లక్షల విలువైన బంగారం అపహరణ



సీతమ్మ మృతదేహం

ఒంగోలు(క్రైం), జూన్ 19 : ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్లారు. ఈ సంఘటన ఒంగోలు రూరల్ మండలం ఉలిచిలో సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఏర్నేని సీతమ్మ (80)కు ఇద్దరు కుమారులు. వారంతా వేరు పడటంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. కుమారులు గ్రామంలోనే పక్క వీధిలో ఉంటున్నారు. సోమవారం రాత్రి 9.30గంటల వరకు ఎదురింటిలో టీవీ చూసిన సీతమ్మ మంగళవారం తెల్లవారిన తరువాత నిద్ర లేవలేదు. దీంతో ఇరుగుపొరుగు వారు వచ్చి వరండాలో పడుకున్న సీతమ్మను చూసి నిద్రలేపితే లేవలేదు. ఆమె ముక్కుపై చిన్న గాయం ఉంది. గొంతు నులిమినట్లు కనిపించింది. ఆమె మెడలోని బంగారం గొలుసు, చేతులకు వేసుకున్న నాలుగు గాజులు కనిపించలేదు. దీంతో దోపిడీ జరిగినట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు, టూటౌన్ సీఐ జగదీష్ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ

సర్వనాశనం

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 19 : గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేయడంతోపాటు ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలోనూ పూర్తిగా విఫలమైందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ధ్వజమెత్తారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన హాలులో బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో మంత్రి, ఎమ్మెల్యేలకు జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వైద్య, విద్య, వ్యవసాయశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గత ప్రభుత్వ హయంలో చేపట్టిన వివిధ రకాల పనుల్లో డొల్లతనాన్ని సంబంధిత అధికారులే ప్రస్తావించడంతో మంత్రి స్వామితోపాటు ఎమ్మెల్యేలు కూడా అవాక్కయ్యారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జిల్లా ప్రజలను మభ్యపెట్టేందుకు హడావుడిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభోత్సవం చేశారని మండిపడ్డారు. ఒకవైపు లైనింగ్ పనులు జరుగుతుండగా, ఇంకోవైపు పునరావాసానికి అవసరమైన నిధులు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. 2020లో మల్లవరం ఒక గేటు విరిగిపోగా, ఆ పనిని చేపట్టకముందే మరోగేటు కూడా కొట్టుకుపోయిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సాగు, తాగునీటికి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాజెక్టుకు గేట్ల బాగుతోపాటు నిర్వహణ కోసం రూ.15కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయలేదన్నారు. సత్వరమే ఆ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదటి ప్రాధాన్యతగాను, రెండోదిగా వెలిగొండ ప్రాజెక్టుకు తీసుకున్నారన్నారు. త్వరలోనే సీఎం సమీక్ష నిర్వహిస్తారని ఆలోపు సమగ్ర నివేదికను తయారుచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉన్నందున ప్రజలకు అవసరమైన మేరకు నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చంద్రబాబు ప్రభుత్వంలో జరిగే అభివృద్ధి, సంక్షేమం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. మరోవైపు వైద్యశాఖ సమీక్షలో కూడా డొల్లతనం బయటపడింది. సీజనల్ వ్యాధులపై జరుగుతున్న సర్వే ఎక్కడ నిర్వహిస్తున్నారని మంత్రి ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులు, వైద్యశాఖల మధ్య సమన్వయం లేకపోతే ఎలా అని నిలదీశారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఆయా అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ జిల్లాలో పోలీస్‌శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఈ ఏడాది మెడికల్ కాలేజీ ప్రారంభించాలి : మాగుంట

ఈ ఏడాది మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అధికారులకు సూచించారు. లేకపోతే వంద మెడికల్ సీట్లు కోల్పోవాల్సి వస్తుందన్నారు.. మరోవైపు గిద్దలూరు, సూరారెడ్డిపాలెం, టంగుటూరులలో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలతోపాటు ఒంగోలులో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రిపుల్ ఐటీ ఏర్పాటు విషయంలోనూ తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

15 రోజుల నుంచి తాగునీరు ఇవ్వకపోతే ఎలా? : దామచర్ల

ఒంగోలు రూరల్ మండలంలోని గ్రామాల్లో మోటార్లు పాడై 15రోజుల నుంచి నీరు రాకపోవడంతో ప్రజానీకం అల్లాడిపోతున్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమావేశం దృష్టికి తెచ్చారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీరు సరఫరా చేయాల్సిన బాధ్యత లేదా? అని అధికారులను ప్రశ్నించారు. మరోవైపు ఒంగోలులో గుడిసెవాసులు నివాసముంటున్న రైల్వే స్థలాల సమస్యను పరిష్కరించాలన్నారు. కార్మికశాఖలో పనిచేసే ఒక ఉద్యోగిపై చనిపోయిన వ్యక్తి ఫిర్యాదు చేస్తే ఏవిధంగా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు ఎన్నికల సమయంలో సస్పెండ్ చేసే అధికారం ఉందా? అని నిలదీశారు. ఆ ఉద్యోగిని అద్దంకిలో నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ అధికారికి సూచించారు.

పునరావాస ప్యాకేజీలో భారీ అక్రమాలు : కందుల

వెలిగొండ ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీలో భారీ అక్రమాలు జరిగాయని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆరోపించారు. వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ట్యాంకర్ల ద్వారా నీటి రవాణాలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. నీటిని తోలకుండానే బిల్లులు మంజూరు చేశారన్నారు. వీటన్నింటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిర్వహణ బిల్లులకే ప్రాధాన్యం : డాక్టర్ ఉగ్ర

ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైను లేకపోయినా నిర్వహణ బిల్లులు మంజూరుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మండిపడ్డారు. పైపులైన్ ద్వారా ఏ గ్రామానికైనా తాగునీరు ఇచ్చారా? అని ప్రశ్నించారు. నీటి పథకం నిర్మాణం పూర్తయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీని సంతనూతలపాడులో కొనసాగించాలి : విజయ్‌కుమార్

ట్రిపుల్ ఐటీని ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కోరారు. మార్కాపురం జిల్లా ఏర్పాటైతే ఆ జిల్లాలో విద్యాసంస్థలతోపాటు వెలిగొండ, మెడికల్ కాలేజీ ఉంటుంది. ప్రకాశం జిల్లాలో ఏమీ ఉండదని, అందువల్ల ట్రిపుల్ ఐటీని ఇక్కడే కొనసాగించాలన్నారు.

దొంగ సర్టిఫికెట్లతో మూడువేల మందికి పింఛన్లు : ముత్తుముల

గిద్దలూరు నియోజకవర్గంలో దొంగ సర్టిఫికెట్లు తెచ్చుకొని పింఛన్లు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఒక్కొక్కరు రూ.50వేలు ఖర్చుపెట్టి దివ్యాంగ ధ్రువీకరణపత్రం తెచ్చుకుంటున్నారని వివరించారు. అలా తన నియోజకవర్గంలో 3వేల సర్టిఫికెట్లు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి తొలగించాలని కోరారు. అనంతరం పలు అంశాలను ప్రస్తావించారు.దర్శి, వైపాలెం ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబులు వారి నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతోనే రాజీనామా..

- మాకు న్యాయం చేసి ఆదుకోండి
- మంత్రి స్వామిని వేడుకున్న వలంటీర్లు

ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 19 : గత ఐదేళ్ల నుంచి వలంటీర్లుగా ప్రజలకు సేవ చేసిన తాము సార్వత్రిక ఎన్నికల సమయంలో అప్పటి అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లతో రాజీనామా చేశామని, తమకు న్యాయం చేసి ఆదుకోవాలని ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన వలంటీర్లు మంత్రిని వేడుకున్నారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయం వద్ద బుధవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మంత్రి డాక్టర్ స్వామి వద్ద తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రెండు నెలలు విధుల నుంచి వలంటీర్లను పక్కన పెట్టారని, ఆ సమయంలో తమపై ఒత్తిడి రావడంతో అయిష్టంగానే రాజీనామా చేశామన్నారు. తమను వలంటీర్లుగా కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌తో హాంఫట్

- రూ.15 కోట్ల ఆస్తిని కొట్టేసిన వైసీపీ నాయకులు
- దొంగ పత్రాలు సృష్టించి అనధికార వారసుడితో తతంగం

వివరాలు లోపలి పేజీల్లో..

వారిని పంపేద్దాం..

జిల్లా స్థాయిలో టీడీపీ ఎమ్మెల్యేలు, నేతల నిర్ణయం

- నియోజకవర్గంలో ఎవరి ఇష్టం వారిదే
- కొందరు పోలీసు, రెవెన్యూ అధికారులపై ప్రత్యేక చర్చ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'గత ప్రభుత్వంలో వైసీపీ వారితో అంటకాగి ఇటు పార్టీశ్రేణులను అటు ప్రజలను ఇబ్బంది పెట్టిన ఉద్యోగులు ఏస్థాయి వారైనా ఉపేక్షించకూడదు. అలాంటివారిని జిల్లా నుంచే పంపేద్దాం. ఒకచోట ఇబ్బందిపెట్టిన వారిని మరో నియోజకవర్గంలో తీసుకోకూడదు. జిల్లా అధికారుల బదిలీలు, నియామకంలో ఆలోచించి సమష్టి నిర్ణయం తీసుకుందాం. నియోజకవర్గ స్థాయిలో అధికారులు, ఉద్యోగుల బదిలీలలో ఆ ఎమ్మెల్యే లేక ఇన్‌చార్జిలదే బాధ్యత. ఒకరి విషయంలో మరొకరం జోక్యం చేసుకోకుండా ముందుకు సాగుదాం.' ఇదీ మంత్రి స్వామి సమక్షంలో జిల్లాలోని అధికార టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు తీసుకున్న నిర్ణయం. బుధవారం వీరంతా సమావేశమై సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మేరకు తీర్మానించుకున్నారు. తొలుత ఒంగోలు ఎంపీ మాగుంట ఆహ్వానం మేరకు అల్పాహార విందు సందర్భంగా కలిశారు. అనంతరం అధికారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొని తక్షణ సమస్యలపై సమీక్ష చేశారు. ఆ తర్వాత ఎన్‌ఎస్‌పీ అతిథిగృహంలో కలెక్టరు, ఎస్పీలతో కాసేపు మాట్లాడి వారు వెళ్లిన తర్వాత ప్రత్యేకంగా భేటీ అయ్యారు. స్వామి సమక్షంలో ఐదేళ్లలో జిల్లాలో అధికారులు, ఉద్యోగుల పనితీరుపై సమీక్ష చేశారు. కొంతమంది పోలీసు, రెవెన్యూ అధికారులు వైసీపీ ఎమ్మెల్యేలు, నేతల మాటే వేదవాక్కు అన్నట్లు వ్యవహరించిన తీరును చర్చించారు. ఆయా అధికారులకు ఈ జిల్లాలో ఎక్కడా ఎవరూ పోస్టింగ్‌లకు సహకరించకూడదన్న నిర్ణయం తీసుకున్నారు. అలాంటివారు జిల్లాదాటి బయటకు వెళ్లేలా చూడాలని కూడా నిర్ణయించుకున్నట్లు తెలిసింది. కలెక్టరు, ఎస్పీల విషయంలో సీఎం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

పామూరు తహసీల్దార్‌పై ఆగ్రహం

పామూరు తహసీల్దార్ ఇటీవల తన వద్దకు పనుల కోసం వెళ్లిన వారితో అంతా టీడీపీ వారే వస్తున్నారు.. నేను ఉండే కొద్దిరోజులు వైసీపీ వారికే పనులు చేసి వెళ్తా అని బహిరంగంగా వ్యాఖ్యానించిన విషయాన్ని కనిగిరి ఎమ్మెల్యే డాక్టరు ఉగ్రనరసింహారెడ్డి ప్రస్తావించినట్లు తెలిసింది. అలాంటి వారిని ఉపేక్షిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని, అతనిపై తక్షణం చర్యలు తీసుకునే విధంగా ఇటు కలెక్టర్, అటు రాష్ట్ర అధికారులపై ఒత్తిడి తెస్తానని ఉగ్ర చెప్పినట్లు సమాచారం. సమావేశంలో మంత్రితోపాటు ఎమ్మెల్యేలు జనార్దన్, విజయ్‌కుమార్, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, నారాయణరెడ్డి, దర్శి, వైపాలెం ఇన్‌చార్జిలు డాక్టరు లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, టీడీపీ రాష్ట్ర నాయకులు దామచర్ల సత్య పాల్గొన్నారు.

దర్శి డీఎస్పీ, సీఐలకు నో చెప్పా

నియోజకవర్గస్థాయిలో అధికారులు, ఉద్యోగుల బదిలీల విషయంలో ఎమ్మెల్యేలతోపాటు దర్శి, వైపాలెంలలో ఓడిపోయిన అభ్యర్థులు తీసుకునే నిర్ణయాలకూ ప్రాధాన్యమివ్వాలని, వారి సిఫార్సులకు అనుగుణంగానే నియామకాలు జరగాలని స్వామికి టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు సూచించారు. ఆ విషయంలో తాను కూడా అదే అభిప్రాయంతో ఉన్నానని మంత్రి చెబుతూ దర్శి సీఐ తన వద్దకు వస్తే కుదరదని చెప్పానని అన్నట్లు తెలిసింది. అంతకుముందు డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ దర్శిలో డీఎస్పీ, సీఐల సాక్షిగా వైసీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని చెప్పినట్లు తెలిసింది. వైసీపీ దౌర్జన్యాలకు పాల్పడిన పోలింగ్ కేంద్రాలలో సీఐ, డీఎస్పీలు ఎలా సహకరించిందీ సమయాలతో సహా వివరించినట్లు తెలిసింది. అలాగే ఇద్దరు ఎస్‌ఐలు పూర్తిగా వైసీపీ పక్షాన పనిచేసి ఇబ్బందిపెట్టారని కూడా చెప్పినట్లు తెలిసింది. ఆ సమయంలోనే మరో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఆ డీఎస్పీ తనను కలవాలని సమాచారం పంపారని, విషయం తెలుసుకాబట్టి అవకాశం ఇవ్వలేదని అన్నట్లు సమాచారం. అదేసమయంలో కొనకనమిట్ల ఎస్‌ఐ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన తీరును ఎమ్మెల్యే నారాయణరెడ్డితోపాటు మాగుంట కూడా ప్రస్తావించినట్లు తెలిసింది. దీంతో నాయకులందరూ అలాంటి అధికారులు ఏస్థాయి వారైనా ఒక నియోజకవర్గంలో ఇబ్బందిపెట్టిన వారిని మరొకరు తీసుకోకూడదని ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. కాస్తంత ఆలస్యమైనా బదిలీల విషయంలో నిర్దిష్ట నిర్ణయాల అనంతరమే ముందడుగు వేయాలన్న తీర్మానానికి వచ్చారు.



మంత్రి స్వామితో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు

మాగుంట నివాసంలో ప్రజాప్రతినిధులకు అల్పాహారం

• పాల్గొన్న మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 19: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి తన నివాసంలో బుధవారం ఉదయం మంత్రి, శాసనసభ్యులకు అల్పాహార విందు ఇచ్చారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బీఎన్.విజయకుమార్, దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, గుడూరి ఎరిక్షన్‌బాబుతో తెలుగుయువత రాష్ట్ర నేత దామచర్ల సత్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

మంత్రి స్వామికి అధికారుల అభినందన



మంత్రి స్వామికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ సుమిత్‌సునీల్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 19 : రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ.స్వామిని పలుశాఖల అధికారులు బొకేలు ఇచ్చి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో బుధవారం జరిగిన సమీక్షా సమావేశానికి వచ్చిన మంత్రి స్వామితో పాటు నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులను బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. ముందుగా కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణలు మంత్రి, ఇతర ప్రజాప్రతినిధులను సమావేశానికి ఆహ్వానించారు. ముందుగా కలెక్టర్, జిల్లా అధికారులకు మంత్రి, ఎంపీ, శాసనసభ్యులను పరిచయం చేశారు. అనంతరం జిల్లా అధికారులు పరిచయం చేసుకున్నారు. అలాగే ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మంత్రికి బొకేను అందజేసి స్వాగతం పలికారు.

హోంమంత్రిని కలిసిన తెలుగు మహిళలు



హోంమంత్రి అనితతో తెలుగు మహిళలు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 19 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను జిల్లా తెలుగు మహిళలు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో ఆమెను కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా అనితతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని, అలాగే తెలుగు మహిళకు రాష్ట్ర హోంమంత్రిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం, జిల్లా అధ్యక్షురాలు రావుల పద్మజ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాళం నరసమ్మ, అంగన్‌వాడీ, డ్వాక్రా రాష్ట్ర నాయకురాలు పెద్దిశెట్టి వరలక్ష్మి, పలువురు జిల్లాకు చెందిన తెలుగు మహిళలు హోంమంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

ఎస్‌బీఎంసీ నూతన కార్యవర్గం



నూతన కమిటీని అభినందిస్తున్న సభ్యులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 19: ఒంగోలులోని శ్రీబాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ నూతన కమిటీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. కాంప్లెక్స్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని వ్యాపారులు, సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తాతా చెంచయ్యగుప్తా, ప్రధాన కార్యదర్శిగా కొప్పురావూరి సురేష్‌కుమార్, కోశాధికారిగా బచ్చు సురేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా చక్కా రాధాకృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులుగా కూరపాటి ప్రకాష్, పల్లపోతు సురేష్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా గ్రంధే పార్థసారథి, నీలి దత్తాత్రేయ, యక్కల ఆంజనేయులు, పేర్ల బదరీ నారాయణరావు, పోకూరి నవీన్‌కుమార్, గాదంశెట్టి వెంకటసత్యనారాయణ, జాలాది పూర్ణచంద్రరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆశీస్సులతో ఎస్‌బీఎంసీ అభివృద్ధికి, వ్యాపార సంబంధమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఘనంగా గొలగమూడి వెంకయ్యస్వామి, భైనబోయిన స్వామి ఆరాధన



స్వామివార్లకు గ్రామోత్సవం చేస్తున్న భక్తులు

సంతనూతలపాడు, జూన్19: సంతనూతలపాడులోని శ్రీగొలగమూడి వెంకయ్యస్వామి 16వ, భైనబోయినస్వామి 13వ ఆరాధన ఉత్సవాలు గత రెండు రోజులుగా ఘనంగా జరిగాయి. బుధవారం వెంకయ్యస్వామి సతీమణి, భైనబోయిన విజయ, లక్ష్మీస్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో స్వామివార్లకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. సమాధివద్ద అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని నలుమూలలు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మండల వైసీపీ కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందేలు

ప్రథమ స్థానంలో బాపట్ల, రెండోస్థానంలో పాతసింగరాయకొండ జత • ఆసక్తిగా తిలకించిన ప్రజలు



పోటీలో తలపడుతున్న పొట్టేళ్లు



ప్రథమ, ద్వితీయ బహుమతులను అందుకుంటున్న విజేతలు

సింగరాయకొండ, జూన్ 19 : మండలంలోని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పొట్టేళ్ల పోటీలు హోరాహోరీగా జరిగాయి. పలు జిల్లాల నుంచి 11 జతల పొట్టేళ్లు పాల్గొన్నాయి. మొత్తం నాలుగు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. బాపట్ల మండలం మద్దెబోయినవారిపాలెంకు చెందిన రాముకి చెందిన పొట్టేళ్లు, సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ అయ్యప్పనగర్‌కు చెందిన నక్కా బ్రహ్మేశ్వరరావుకి చెందిన పొట్టేళ్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది. బాపట్లకు చెందిన పొట్టేళ్ల జత ప్రథమ స్థానంలో నిలవగా, పాతసింగరాయకొండకు చెందిన పొట్టేళ్ల జత ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. పర్చూరుకి చెందిన శ్రీకృష్ణయాదవ్ యూత్‌ఫోర్స్ పొట్టేళ్ల తృతీయ, మార్టూరుకు చెందిన పొట్టేళ్ల జత నాలుగో స్థానంలో నిలిచింది. సింగరాయకొండ మండలం శానంపూడి పంచాయతీ పరిధిలోని పటికినేనివారిపాలెంకు చెందిన పసుపులేటి మహేష్ యాదవ్ పొట్టేళ్ల జత ఐదోస్థానంలో నిలిచింది. ప్రథమ బహుమతి రూ.25వేలను న్రావారిపాలెంకు చెందిన న్రా రాంబాబు, ద్వితీయ బహుమతి రూ.20వేలను టంగుటూరు మండలం వావిలేటిపాడుకి చెందిన పటాపంజుల కొండలు, తృతీయ బహుమతి రూ.15వేలను న్రావారిపాలెంకు చెందిన కొణికి అమర్నాథ్, నాలుగో బహుమతి రూ.12వేలను సోమరాజుపల్లికి చెందిన మసనం బ్రదర్స్, ఐదో బహుమతి రూ.10వేలను అయ్యప్పనగర్‌కు చెందిన మించల బ్రహ్మయ్య అందజేశారు. వీటితోపాటు జ్ఞాపికలు, కప్పులు ఇచ్చారు. తొలుత పోటీలను టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పాముర్తి మాధవరావు, టీడీపీ నేతలు చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, వేల్పుల వెంకట్రావు, కమిటీ సభ్యులు కొట్టే జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు చేయించాలి

• డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ ఆదేశం



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 19 : గిరిజనులకు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వారసత్వంగా సంక్రమిస్తున్నందున చిన్నపిల్లలు నుంచి 40 ఏళ్లలోపు వారందరూ విధిగా వైద్యపరీక్షలు చేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ కోరారు. వైద్యఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమశాఖల ఆధ్వర్యంలో ఒంగోలులోని గిరిజనభవన్‌లో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వల్ల రక్తకణాల సంఖ్య తగ్గడం, కళ్ళు పసుపురంగులోకి మారడం, కీళ్లనొప్పులు, అవయవాల వైఫల్యం వంటి లక్షణాలను ఉంటాయన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలందరూ విధిగా ఈ పరీక్ష చేయించుకోవాలని కోరారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 16,372 మందికి పరీక్షలు చేయగా, 89,224మందికి పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. పరీక్షించిన వారిలో 12మందికి సికిల్ సెల్ ఎనీమియా ఉండగా, మరో 110 మంది టెస్ట్ క్యారియర్లుగా గుర్తించామన్నారు. జిల్లాలోని 11 గిరిజన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ భగీరథ, ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పద్మజ, పట్టణ వైద్యాధికారులు డి.శ్రీనివాసులు, మాస్ మీడియా అధికారి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కరువు బృందానికి సమగ్ర నివేదికను అందజేయాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 19: జిల్లాలో గురువారం కరువు బృందం పర్యటించనున్న నేపథ్యంలో సమగ్ర నివేదికను అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం సాయంత్రం వ్యవసాయ, దాని అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు బృందం సభ్యులు ముందుగా కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ సమీక్షకు శాఖల వారీగా సమగ్ర నివేదికలను అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు. ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సమగ్రంగా ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కరువు బృందం పర్యటించే గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండపి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య



దామచర్ల సత్యను సన్మానిస్తున్న ముస్లిం యూత్ యువకులు

కొండపి, జూన్ 19 : నియోజకవర్గ కేంద్రమైన కొండపి అభివృద్ధికి మరింత కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మంగళవారం రాత్రి స్థానిక ముస్లిం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సత్య మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో కొండపి గ్రామ పంచాయతీలో టీడీపీకి మునుపెన్నడూ ఏపార్టీకి రానివిధంగా 750పైచిలుకు ఓట్ల మెజారిటీ వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. దీంతో మంత్రి స్వామి, తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. అనంతరం యువకులు సత్యను సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజాషా, షేక్ ఇమ్రాన్, సయ్యద్ సల్మా, సయ్యద్ సాదిక్, షేక్ కరిముల్లా, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై వరాహ లక్ష్మీనరసింహస్వామి

• వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



శేషవాహనంపై విహరిస్తున్న స్వామివారు

సింగరాయకొండ, జూన్ 19: దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నాలుగో రోజైన బుధవారం దేవస్థానంలోని మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు శ్రీదేవి, భూదేవి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. ఉదయం చప్పర వాహనంపై ప్రత్యేక పూలతో అలంకృతుడైన స్వామివారిని మోతకాపులు గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. రాత్రికి స్వామివారు శేష వాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పాముర్తి మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, యాజ్ఞకం సుదర్శనాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో పారిశుధ్యం అధ్వానం



రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్తాచెదారం

మద్దిపాడు, జూన్ 19: మద్దిపాడులోని వెల్లంపల్లి వెళ్లే సర్వీసు రోడ్డు చెత్తాచెదారంతో నిండిపోయింది. రోడ్డుకు సమీపంలో ఉండే కాలనీవాసులు రోడ్డు వెంట చెత్తను పడవేస్తుండడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతున్నది. చెత్తంతా అక్కడ పడవేస్తున్నా పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో డంపింగ్ యార్డులా మారింది. కాగా ప్రజలు ఈ మార్గంలోని సాయిబాబా గుడికి వెళుతుంటారు. దీంతో ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తుందని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వెంట పేరుకున్న చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరువురు దొంగలు అరెస్టు

ఒంగోలు(క్రైం), జూన్19: చిన్న పిల్లాడికి మాయమాటలు చెప్పి బంగారం అపహరించిన కేసులో ఇరువురు దొంగలను అరెస్టు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ ఇన్‌చార్జి సీఐ జగదీష్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 16న ఒంగోలులోని ఎంఎస్‌ఫంక్షన్ హాలులో కొండపి మండలం వెన్నూరుకు చెందిన పోకూరి వంశీకృష్ణ తన కుటుంబ సభ్యులతో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ కుమారుడు జయవర్ధన్ (7) ఫంక్షన్‌లో ఆడుకుంటు ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు బెలూన్‌ను కొనిస్తామని మాయమాటలు చెప్పి తమ వెంట తీసుకెళ్ళారు. ఈక్రమంలో జయవర్ధన్ వద్ద ఉన్న బంగారం గొలుసు, బ్రాస్‌లెట్, ఉంగరం అపహరించుకెళ్ళారు. సుమారుగా వాటి విలువ రూ.2లక్షల ఉంటుందని వంశీకృష్ణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు తాళ్ళూరు మండలం శివరామపురంనకు చెందిన రావిపాటి జగదీష్, తాళ్ళూరు మండలం తూర్పుగంగవరంనకు చెందిన పుట్టా శ్రీనివాసులను మంగళవారం ఒంగోలులోని ఆర్టీసీ డిపో వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

కిడ్నాప్ కేసు నమోదు

చీమకుర్తి, జూన్19 : చీమకుర్తి పట్టణానికి చెందిన పల్లపు పూర్ణ అనే వ్యక్తిని కిడ్నాప్ చేసిన ఘటనపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సీఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పూర్ణ అనే వ్యక్తిని ఈనెల 17వ తేదీన సాయంత్రం తన స్కూటీపై ఒంగోలు వెళ్తుండగా ఎండ్లూరి ప్రేమ్‌కుమార్ అనే వ్యక్తి వెంబడించాడు. కర్రలతో పూర్ణను కొట్టి మత్తు ఇన్‌జంక్షన్ వేసి కిడ్నాప్ చేసి మల్కాపురం అనే గ్రామంలో బంధించాడు. అయితే స్పృహలోకి వచ్చిన తర్వాత చీమకుర్తికి విచ్చేసిన పూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అవీ..ఇవీ..

20 స్కూళ్లలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం : డీఈవో

ఒంగోలు(విద్య), జూన్ 19 : జిల్లాలోని 20 పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్ గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దొనకొండ, మార్కాపురం, జరుగుమల్లి, ఉప్పలపాడు, మర్రిపూడి, కనిగిరి, సీఎస్‌పురం, తర్లుబాడు, బొద్దికూరపాడు, దేవరపాలెం, ఊళ్లపాలెం, సంతనూతలపాడు, కారుమూడివారిపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్ళు, అలాగే కె.బిట్రగుంట, కొత్తపట్నం, కనిగిరి కేజీబీవీలు, రాచర్ల, దర్శి ఏపీ మోడల్ స్కూళ్ళు, ఒంగోలు బాలాజీనగర్ మునిసిపల్ హైస్కూలు, ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమం అమలు చేస్తారు. ఈ పాఠశాలల్లో 8నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థులకు బోధించే టీచర్లకు, హెచ్‌ఎంలకు శిక్షణ ఇస్తారు. ఏపీ సమగ్రశిక్ష, ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో వీరికి శిక్షణ ఇస్తారు. 107 మంది టీచర్లు, 20 మంది హెచ్‌ఎంలకు శిక్షణ ఉంటుంది. మెల్‌బోర్న్ యూనివర్శిటీ నుంచి సారా రిచర్డ్‌సన్, రాఫెల్‌షాఫ్, ఎస్‌సీఈఆర్టీ నుంచి సుధాలక్ష్మి, సమగ్ర శిక్ష పీడీ మంజూనాథ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు.

మలేరియా నియంత్రణకు చర్యలు

మద్దిపాడు, జూన్ 19: మలేరియాను నివారించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మద్దిపాడులోని ప్రభుత్వ బాలుర వసతి గృహాలను వైద్యసిబ్బంది పర్యవేక్షించి ముందస్తు జాగ్రత్తగా డీడీటీ పిచికారి చేశారు. అనంతరం శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ కె.బాలకోటయ్య, వార్డెన్లు సీహెచ్.రాఘవులు, కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు-ఒకరికి గాయాలు

మద్దిపాడు, జూన్ 19: మద్దిపాడు మండలం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రంలో ఆటోను కారు ఢీకొనటంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం జరిగింది. విజయవాడ వైపు నుంచి తిరుపతి వెళుతున్న కారు అతివేగంగా వెళుతూ అదుపుతప్పి ఆటోని ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ విజయవాడకు చెందిన ఆర్.కృష్ణారెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడని చికిత్స నిమిత్తం ఒంగోలులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

మద్దిపాడు, జూన్ 19: నందిపాడులోని శ్రీగంగా పార్వతి కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. ఆలయ ప్రధానఅర్చకులు రాజు పంతులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

జనసేన నాయకుల సంబరాలు



స్వీట్లు పంచుతున్న జనసేన నాయకులు

నాగులుప్పలపాడు, జూన్ 19: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఆ పార్టీ నాయకులు ఉప్పుగుండూరులో బుధవారం సంబరాలు నిర్వహించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద ఉద్యోగులకు, అధికారులకు, పంచాయతీ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి నిడికొండ వెంకటేశ్వర్లు, కొత్ర అనిల్, పెంట్యాల శ్రీనివాసరావు, శివ, కె.సుధాకర్, టీడీపీ నాయకులు కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, బెల్లం శ్రీనివాసరావు, మసిముక్కు భాస్కర్, కుంచాల నాగరాజు, కొండా శ్రీను, బీజేపీ నాయకులు రంగయ్యపంతులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదినం

ఒంగోలు(క్రైం), జూన్19: కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నగరం సంతపేటలోని శివం వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీపతి ప్రకాష్, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ పాల్గొన్నారు. ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బధిరుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.బాలచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ పురుషుల జిల్లా హాకీ జట్టు ఎంపిక

సంతనూతలపాడు, జూన్ 19: మైనంపాడు జెడ్పీహైస్కూల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 10గంటలకు సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపికలు జరగనున్నట్లు జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ.రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జననధృవీకరణ, పదో తరగతి మార్కులిస్టు తీసుకుని రావాలన్నారు. ఎంపికలకు 1995 తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని, ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు పీఈటీ రవికుమార్‌ను 9666067764 సెల్‌నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.341

సంతనూతలపాడు, జూన్ 19: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.341 పలికింది. అమ్మకాలకు మంగమూరు నుంచి 779 పొగాకు బేళ్లు రాగా 728 బేళ్లు అమ్ముడయ్యాయి. 51 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. కనిష్ఠ ధర కిలో రూ.205, సరాసరి ధర రూ.293.41 వచ్చినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

టంగుటూరులో నిలకడగా పొగాకు ధరలు

టంగుటూరు, జూన్ 19 : టంగుటూరు వేలం కేంద్రంలో పొగాకు ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. వీటిపై రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అనంతవరం, ఆలకూరపాడు, రావివారిపాలెం, జయవరం రైతులకు చెందిన 1,032 బేళ్లను వేలానికి అనుమతించారు. వీటిలో 983 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 49 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర కిలో రూ.335, కనిష్ఠ ధర రూ.205 లభించింది. సరాసరి ధర రూ.284.11 దక్కింది. కొనుగోళ్లలో 24 కంపెనీల బయ్యర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సింగరాయకొండ, జూన్ 19 : పాకల గ్రామానికి చెందిన మోరుబోయిన గోపీకృష్ణ (27) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పాకల గేటు సమీపంలో బుధవారం జరిగింది. కుటుంబ కలహాలే అందుకు కారణమని తెలుస్తోంది. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం

ఒంగోలు(కల్చరల్), జూన్ 19: ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీగిరి కళ్యాణ మండపంలో ముందుగా విష్వక్సేన పూజ, మాంగల్య పూజ, మంగళసూత్ర ధారణ, స్వామివారికి అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ మొదలైనవి వైఖానస ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణోత్సవాన్ని తిలకించారు. ఇక బుధవారం సాయంత్రం స్వామి వారి తిరువీధి ఉత్సవం, అనంతరం స్వర్ణ సుబ్బారావు బృందంచే కోలాట ప్రదర్శన జరిగాయి. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ధర్మకర్త ఆలూరు జైశంకర్ తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రసాద్‌కు తెలుగు భాషా విశిష్ట పురస్కారం



కుర్రా ప్రసాద్‌బాబు

ఒంగోలు(కల్చరల్), జూన్ 19: శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు, కవి కుర్రా ప్రసాద్‌బాబును తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారంతో సన్మానించనున్నట్లు పద్మశ్రీ ఘంటసాల కళా పరిషత్ అధ్యక్షులు ఉప్పుతెర్ల కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం 7 గంటలకు స్థానిక సీవీఎన్ రీడింగ్‌రూములో జరిగే సభలో ప్రసాద్‌బాబుకు పురస్కారాన్ని అందజేస్తామన్నారు. తెలుగు భాషా వికాసానికి కుర్రా ప్రసాద్ చేస్తున్న కృషి, రాష్ట్రస్థాయిలో ప్రముఖ కవులకు సాహితీ పురస్కారాలని అందజేయడం, ఉగాది సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కోటేశ్వరరావు తెలిపారు.

శ్రీగిరిలో దామచర్ల దంపతుల పూజలు

ఒంగోలు(కల్చరల్), జూన్ 19: ఒంగోలు నగరం శ్రీగిరిలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నాగసత్యలత దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగిరిలో జరుగుతున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాలను వారు వీక్షించారు. ఈ సందర్భంగా దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ అలూరు ఝాన్సీరాణి, ధర్మకర్త ఆలూరు జైశంకర్‌ల ఆధ్వర్యంలో అర్చకులు దామచర్ల దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతాన్ని పలికారు. అనంతరం ప్రధాన అర్చకులు పరాంకుశం రామకృష్ణాచార్యులు బృందం వారికి స్వామి వారి శేషవస్త్రాలను బహూకరించి వేద ఆశీర్వచనాన్ని అందజేశారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత



విద్యార్థులకు నోట్‌బుక్స్, క్రికెట్ కిట్స్ అందిస్తున్న నిర్వాహకులు

నాగులుప్పలపాడు, జూన్ 19 : విద్యాభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం వినోదరాయునిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్, దాసరివారిపాలెంలోని మండల పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు సుమారు లక్ష విలువ గలిగిన నోట్ బుక్స్, క్రికెట్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు పులకం రామ్మోహన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ గోపీనాయక్, పులకం వెంకటేశ్వర్లు, గొల్లకారం శ్యామ్, నామ కళ్యాణి, హెచ్ఎం నాగరమేష్, కొండపి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరాహ లక్ష్మీనరసింహుడి భూమికి విముక్తి

గూడూరు మండలం చెన్నూరులో ఆలయానికి 98.93 ఎకరాల ఈనాం

128 ఏళ్ల నుంచి అన్యాక్రాంతం

తిరుపతి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దేవదాయ అధికారులు

విచారణ చేపట్టి దేవస్థానానికి చెందిన భూమిగా గజిట్ విడుదల

హద్దులు ఏర్పాటు చేసుకోవాలని ఈవోకి సూచన

వివరాలను వెల్లడించిన ఛైర్మన్, ఈవో



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ మాధవరావు, ఈవో కృష్ణవేణి

సింగరాయకొండ, జూన్ 19 : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన భూమికి ఎట్టకేలకు మోక్షం లభించింది. 128 ఏళ్ల నుంచి అన్యాక్రాంతమైన ఈనాంను దేవస్థానానికి చెందిన భూమిగా తిరుపతి కలెక్టర్ గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దాని చుట్టూ హద్దులు ఏర్పాటు చేసుకోవాలని ఆలయ ఈవోకి సూచించారు. పాతసింగరాయకొండ దేవస్థానంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయ ఛైర్మన్ పామర్తి మాధవరావు, ఈవో పి.కృష్ణవేణి వివరాలను వెల్లడించారు. ఆ ప్రకారం. మండలంలోని కలికివాయి అగ్రహారానికి చెందిన పర్ణశాల తిరువెంగళాచార్యులు 1896లో తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరులోని సర్వే నెంబర్ 1128/3, 1128/5, 1128/8 ఉన్న 98.93 ఎకరాల భూమిని పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వీలునామా రాశారు. 1955లో వారి వారసులు కోర్టును ఆశ్రయించారు. 1974లో ఆభూమి దేవస్థానానికే చెందుతుందని ప్రకాశం జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. వెంగళాచార్యులు వీలునామా రాసినప్పటి నుంచి కూడా 98.93 ఎకరాల భూమి అక్కడి గ్రామస్థుల అన్యాక్రాంతంలో ఉంది. వారు దాదాపు 128 ఏళ్ల నుంచి దేవస్థానానికి ఎటువంటి కౌలు కూడా చెల్లించలేదు. దీంతో 2004 నుంచి ఇప్పటి వరకూ ఆలయంలో పనిచేసిన ఈవోలు ఈభూమిని అక్రమార్కుల చెరనుంచి విడిపించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. అందులోభాగంగా ఏడాది క్రితం ఆలయ ప్రస్తుత ఛైర్మన్, ఈవో తిరుపతి కలెక్టర్‌ని కలిసి చెన్నూరులో అన్యాక్రాంతమైన భూమి గురించి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన విచారణ చేయించారు. అనంతరం ఆ భూమి దేవస్థానానికి చెందుతుందని గజిట్ పబ్లికేషన్ విడుదల చేశారు. భూమి చుట్టూ హద్దురాళ్లు ఏర్పాటు చేసుకోవాలని ఇక్కడి ఆలయ ఈవోకి సూచనలు చేశారు. విలేకరుల సమావేశంలో ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో నష్టపరిహారం

కలెక్టర్ దృష్టికి బైపాస్‌రోడ్డు బాధితుల సమస్య

రూ .3.39కోట్లు విడుదలకు ఆయన సంతకం



ఉగ్ర అందించిన ఫైల్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్

కనిగిరి, జూన్ 19 : అభివృద్ధి పనుల్లో తన దైన మార్కును కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర చూపారు. బైపాస్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేశారు. ఒంగోలులో బుధవారం జరిగిన జిల్లాస్థాయి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యేలతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కూడా పాల్గొన్నారు. కనిగిరి ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అందులో భాగంగా దశాబ్దానికి ముందు డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నగరంలో ట్రాఫిక్ దృష్ట్యా బైపాస్ నిర్మాణానికి పూనుకున్నారు. అందుకు భూమిని గుర్తించి ఆయా రైతులకు నష్టపరిహారం అందించాల్సి ఉంది. ఆ క్రమంలో 2014లో ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత బైపాస్ బాధితులు నష్టపరిహారం చాలదంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఆ కేసులు తేలేటప్పటికీ ఆ తర్వాత 2019 ఎన్నికలు వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బైపాస్ సమస్య మరుగున పడింది. తిరిగి 2024 ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హయాంలోనే బైపాస్ సమస్యకు పరిష్కారం లభించింది. బైపాస్ బాదితులకు నష్టపరిహారం విడుదల చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరిందే తడవుగా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ రూ.13.39 కోట్లు విడుదల చేసేందుకు సంతకం చేశారు. త్వరలో బైపాస్ రోడ్డు నిర్మాణం కానుందని తెలిసి కనిగిరి ప్రాంతవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌తో హాంఫట్..!

రూ.15 కోట్ల ఆస్తిని కొట్టేసిన వైసీపీ నాయకులు

దొంగ పత్రాలు సృష్టించి అనధికార వారసుడితో తతంగం

బయటికి పొక్కడంతో రిజిస్ట్రేషన్ రద్దు చేసుకున్న వైనం

స్థలం మాత్రం వైసీపీ మూకల కబంధ హస్తాల్లోనే..

వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడి పర్యవేక్షణలోనే అక్రమమంతా..



దొంగ రిజిస్ట్రేషన్లు జరిగింది ఈ భూమి కోసమే..

మార్కాపురం, జూన్ 19 : మార్కాపురం ప్రాంతంలో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ మూకలు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా అది పట్టా భూమా, ప్రభుత్వ భూమా, చెరువు తొట్టా, పంట కాలువలా అనే తేడా లేకుండా విలువైన అన్నింటినీ దర్జాగా కబ్జా చేశారు. ఐదేళ్ల రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడటంతో అన్యాయానికి గురైన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాధుడేలేడు. ప్రస్తుతం భూములు కోల్పోయిన బాధితులు అధికార పార్టీ నాయకులకు గోడును వెళ్లబోసుకుంటున్నారు. స్థానిక ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా వైసీపీ నాయకులు వేసిన వెంచర్ అంతా అక్రమాలమయమే. అవి పట్టా భూములే అయినా విలువైనవి కావడంతో యజమానులను నయానో భయానో బెదిరించడం, లేదంటే అక్రమ కేసులు పెట్టడం తదితర చర్యల ద్వారా రూ.100 కోట్ల విలువ గల స్థలాన్ని తక్కువ ధరకే కొట్టేశారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేని వారి భూములను తప్పుడు పత్రాలు సృష్టించి బినామీలతో దొంగ రిజిస్ట్రేషనల్‌కు కూడా తెగబడ్డారు. అంతేకాక ఆ వెంచర్‌కు అడ్డుగా ఉన్నారని ఆర్‌అండ్‌బీ మార్జిన్‌లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని బతుకుతున్న వారిని సైతం వదలకుండా వారి గృహాలను కూల్చేశారు. ఆ వెంచర్‌లో జరిగిన దొంగ రిజిస్ట్రేషన్లు, పలురకాల అక్రమాలపై కొందరు బుధవారం ఒంగోలు వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రికార్డులు మార్చి.. అధికారులను ఏమార్చి దోపిడీ

స్థానిక ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా 889 సర్వే నెంబర్‌లో 6.63 ఎకరాల భూమి ఉంది. మొత్తం పట్టా భూమే. ఆ సర్వే నెంబర్‌లో పలువురికి భూములు ఉన్నా వారసులు ఎవరూ లేకపోవడంతో వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడు మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి అక్రమానికి తెరలేపారు. ఆ భూమికి ముందు ఆర్‌అండ్‌బీ స్థలంలో పేదలు నివస్తుండటాన్ని అడ్డుపెట్టుకుని దారి లేకుండా చేసి బేరానికి దిగారు. పెద్దలతో మనకెందుకులే అని కొందరు సుమారు 2 ఎకరాల మేర అమ్మారు. ఆ క్రమంలోనే సర్వే నెంబర్ 889/బి2/ఎలో 25 సెంట్ల భూమిపై దృష్టి పెట్టారు. వాస్తవానికి ఆ భూమి మద్దెల వెంకటరత్నం అనే వ్యక్తిది. ఆయన 1937వ సంవత్సరంలో ఆ సర్వే నెంబర్‌లో మొత్తం 3.09 ఎకరాలను మద్దెల వెంకటరత్నం, మిట్టపల్లి సుబ్బరాయుడులు ఇద్దరు కలిసి కొన్నారు. 1962వ సంవత్సరంలో ఇరువురు కలిసి 2.59 ఎకరాలను అమ్ముకున్నారు. ఇక ఇరువురికి చెరి 25 సెంట్ల చొప్పున భూమి ఉండేది. కాలక్రమంలో మిట్టపల్లి సుబ్బరాయుడు 25 సెంట్లను అమ్ముకున్నాడు. కానీ వెంకటరత్నం మాత్రం ఆ భూమిని ఎవరికీ విక్రయించలేదు. అంతేకాక ఆయనకు ఎవరూ వారసులు లేరు. భార్య చనిపోయింది. ఆయన కూడా 1984లో మృతిచెందారు. వారసులు ఎవరూ లేకపోవడంతో ఆ స్థలం జోలికి ఎవరూ వెళ్లలేదు. సుమారు రూ.15 కోట్ల విలువైన ఆ భూమిపై కన్నేసిన వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడు తన వ్యాపార భాగస్వామితో మద్దెల వెంకటరత్నం కుమారున్ని సృష్టించారు. పట్టణానికి చెందిన మద్దెల అంపయ్య కుమారుడు ప్రసాద్‌ను వెంకటరత్నం కుమారునిగా మార్చి అధికారం చేతిలో ఉండటంతో రికార్డులన్నీ క్షణాల్లో తయారు చేయించారు. 2020లో వెంకటరత్నం డెత్ సర్టిఫికేట్, ఆయన కుమారుడు ప్రసాద్‌గా ఫ్యామిలీ సర్టిఫికేట్ తయారు చేయించారు. అంతేకాక ఆధార్ కార్డును కూడా దొంగది తయారు చేయించి ముందుగా ఖాతా నెంబర్ 2843ను సృష్టించి ప్రసాద్ పేరున పాస్‌బుక్ పొందారు. మద్దెల ప్రసాద్ ద్వారా తొలుత నాయకుని వ్యాపార భాగస్వామి కుటుంబసభ్యులు ఇరువురిపై 2021 ఫిబ్రవరి 13న డాక్యుమెంటు నెంబర్‌లు 8294/2021, 8295/2021లతో రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం 2023 మార్చి 27న కుటుంబ సభ్యులు ఇరువురితో ముఖ్య నాయకుని సోదరుని వ్యాపార భాగస్వామి గొలమారి లక్ష్మిరెడ్డి డాక్యుమెంట్ నెంబర్ 2364/2023, 360/2023 లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత ఈ విషయం బయటకు పొక్కి మద్దెల వెంకటరత్నం బంధువులకు చేరింది. ఆయనకు ఎలాంటి వారసులు లేరని రెవిన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులకు తెలిపినా బుట్టదాఖలు చేశారు. దొంగ రిజిస్ట్రేషన్ అని ప్రచారం జరగడంతో అక్కడ స్థలాలు కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గొలమారి లక్ష్మిరెడ్డితోపాటు ముగ్గురు బంధువుల పేరున ఉన్న డాక్యుమెంట్లను 2023 డిసెంబర్ 12న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేసుకున్నారు.

రిజిస్ట్రేషన్ రద్దు సరే.. స్థలం మాటేమిటి..

అక్రమంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌లను రద్దుచేయించుకున్న సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి లక్ష్మిరెడ్డి స్థలాన్ని మాత్రం నేటికీ ఆయన ఆధీనంలోనే పెట్టుకున్నారు. ఈ క్రమంలో మరో నూతన అక్రమానికి తెరలేపాడు. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మున్సిపల్ నాయకునికి ఈ సైట్‌లో నుంచి వెళ్తేనే ఆయన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌కు, ఓపెన్ సైట్‌లకు విలువ వచ్చేది. ఈ విషయంలో రెండు పార్టీల నాయకులు ఏకమయ్యారు. మద్దెల వెంకటరత్నం స్థలం మాకు కావాలంటూ ఎవరూ వచ్చే అవకాశాలు లేనందున ఆ స్థలాన్ని టీడీపీ నాయకుని అపార్ట్‌మెంట్‌కు వెళ్లే దారికి మళ్లించారు. దీంతో సదరు టీడీపీ నాయకుడు కూడా ఆరు మాసాల క్రితం సిమెంట్ రహదారి నిర్మించుకున్నారు. ఇంతా చేసినా మద్దెల వెంకటరత్నం స్థలం 25 సెంట్లు ఎవరు తేలుస్తారో ఆ దేవునికే తెలియాలి.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లీలలు ..

889 సర్వే నెంబర్‌లోని వెంచర్‌లో దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నది ఒక ఎత్తయితే. అక్కడ వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడు, వారి అనుయాయులు చేసిన మోసాలు అన్నీ ఇన్నీ కావు. మార్కాపురం చుట్టుపక్కల సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడా వ్యవసాయ పొలం కింద రిజిస్ట్రేషన్‌లు చేయరు. అన్నీ గజాల్లోనే జరుగుతున్నాయి. కానీ పట్టణంలో అత్యంత ఖరీదైన ఎస్‌వీకేపీ కాలేజీ రోడ్డులోని 889 సర్వే నెంబర్‌లో మాత్రం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు అధికారపార్టీ నాయకులకు స్వామిభక్తిని చాటుకొని వ్యవసాయ భూముల కింద రిజిస్ట్రేషన్ చేశారు. ఆ విధంగా కూడా సుమారు రూ.కోటి వరకు రిజిస్ట్రార్ కార్యాలయం ఆదాయం కోల్పోయినట్లు తెలుస్తోంది. అంతేకాక 889 సర్వే నెంబర్‌ను ఆనుకుని ఆర్‌అండ్‌బీ రోడ్డువైపు 207 బి 2, బి 3 సర్వే నెంబర్‌లు ఉన్నాయి. 207లో మొత్తం 60 సెంట్లు ఉండగా ఈ రెండు సబ్ డివిజన్ నెంబర్‌ల ద్వారా మరో 25 సెంట్ల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెవిన్యూ అధికారులు 889, 207 సర్వే నెంబర్‌లలో జరిగిన అక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి వెలికితీసి అక్రమార్కులకు బుద్ధి చెప్పాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

గెలిస్తే తన గొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా..?

జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలి • మంత్రి గొట్టిపాటి



హనుమంతరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి రవికుమార్

సంతమాగులూరు, జూన్ 19 : గెలిస్తే తనగొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా..? దీనిపై జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వరుసగా ఐదుసార్లు విజయం సాధించి మంత్రి పదవి చేపట్టాక మొదటిసారిగా సంతమాగులూరు వచ్చిన రవికుమార్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అడ్డరోడ్డులోని గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పుట్టవారిపాలెంలోని అతిథిగృహంలో టీడీపీ కార్యకర్తలతో సమావేశమైన మంత్రి మాట్లాడారు. నిరుద్యోగ యువత కోసం సీఎం చంద్రబాబు మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేశారని, పెన్షన్ల పెంపు, పోలవరం, రాజధాని నిర్మాణం, అభివృద్ధి విషయంలో ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తారని, అద్దంకి నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని చెప్పారు. బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలన్న జగన్‌రెడ్డిపై గొట్టిపాటి తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల షాక్ నుంచి జగన్‌రెడ్డి అండ్ కో కోలుకోలేదన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ గెలిచినప్పుడు ఈవీఎంల గురించి తనేమి మాట్లాడాడో ఓసారి గుర్తు చేసుకోవాలని, పరనింద, ఆత్మస్తుతి మాని ఆత్మవిమర్శ చేసుకోవాలని గొట్టిపాటి హితవు పలికారు.

జోరుగా వైట్ బర్లీ పొగాకు విక్రయాలు



పర్చూరు, జూన్ 19 : వైట్ బర్లీ పొగాకు విక్రయాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నం కావడం, తిరిగి ఈఏడాది సాగుచేసుకునేందుకు పెట్టుబడుల నేపథ్యంలో రైతులు తమ వద్ద నిల్వ చేసుకున్న వైట్ బర్లీని విక్రయాలు నిర్వహిస్తున్నారు. పంట చేతికి అందివస్తున్న తరుణంలో నానాశి రకం పొగాకు క్వింటా రూ.14వేల పైచిలుకు ధరతో విక్రయాలు నిర్వహించుకున్నారు. నాణ్యమైన మేలుకరం పొగాకుకు మంచి గిట్టుబాటు ధర ఉంటుందన్న ఆశతో అధికశాతం రైతులు పొగాకు ఉత్పత్తులను నిల్వ చేసుకున్నారు. నెలలు తరబడి నాణ్యమైన ధర కోసం ఎదురు చూసిన రైతులకు చివరకు నిరాశే ఎదురైంది. నాణ్యమైన పొగాకు క్వింటా రూ.14,500 మించి లేకపోవడంతో గత్యంతరం లేక దక్కిందే ధర అన్నట్లు విక్రయాలు నిర్వహించుకుంటున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గత ఏడాది దాదాపు అధిక భాగం రైతులు వైట్‌బర్లీ పొగాకును సాగుచేసుకున్నారు.

టీడీపీ కూటమి విజయోత్సవాలు



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, జూన్ 19 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించడంతో గ్రామాల్లో విజయోత్సవాలు మిన్నంటుతున్నాయి. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ గెలుపొందడంతో బుధవారం రాత్రి ఈదుమూడి గ్రామంలో టీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఎస్సీ కాలనీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మండల పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేశారు. గ్రామంలోని అంబేడ్కర్, జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కుర్రా వీరాంజనేయులు, కుంద్రగుంట రంగారావు, స్వర్ణ కిషోర్ బాబు, మెట్టు సుబ్బయ్యనాయుడు, భీమనేని స్వామి, ఏలియా, లంబు, నాగేశ్వరరావు, బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా ఉద్యోగోన్నతి

ఒంగోలు(క్రైం), జూన్19: ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్న జి.కృష్ణయ్యకు ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ఎస్పీ గరుడ్ సుమిత్‌సునీల్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందిన కృష్ణయ్యను ఎస్పీ అభినందించారు.

పలువురికి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్

మార్టూరు, జూన్ 19 : పర్చూరు నియోజకవర్గ నాయకుడు గొట్టిపాటి భరత్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు, ఒక మహిళకు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేయమని బుధవారం అద్దంకి అడిషనల్ జూనియర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్యులు జారీ చేశారు. 2016లో మార్టూరు పోలీస్ స్టేషన్ వద్ద తన పార్టీకి చెందిన వ్యక్తులకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కోరుతూ భరత్ తన అనుచరులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. దీంతో విజయవాడ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును కూడా నిలిపివేశారు. కండక్టరు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరు కావడం లేదని భరత్‌కు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసినట్లు తెలిసింది.

జగ్గయ్యపేట నుంచి తిరుమలకు పాదయాత్ర

• బీజేపీ శ్రేణుల స్వాగతం



రాఘవేంద్రకు స్వాగతం పలుకుతున్న నేతలు

అద్దంకి, జూన్19: ఎన్డీయే అధికారంలోకి రావటంతో జగ్గయ్యపేటకు చెందిన పట్టణ బీజేపీ అధ్యక్షుడు గోలి రాఘవేంద్ర తిరుమల పాదయాత్రగా వెళ్తూ బుధవారం అద్దంకి చేరారు. గోలి రాఘవేంద్ర జగ్గయ్యపేట నుంచి తిరుమల కు పాదయాత్రగా వెళ్తూ బుధవారం అద్దంకి పట్టణానికి చేరటంతో స్థానిక బీజేపీ నేతలు తమ్మన శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, సంజీవరావు, రూపాంజలి స్వాగతం పలికి సన్మానించారు.

ఎంపీ మాగుంటకు పలువురి సత్కారం



ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న మురళీకృష్ణ, నాయకులు



ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న అంకారావు

ఒంగోలు(కల్చరల్), జూన్ 19: ఒంగోలు పార్లమెంటుసభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాగుంట విజయం సాధించిన సందర్భంగా ఆయనను మురళీకృష్ణ బొకే ఇచ్చి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాని అభివృద్ధిపథంలో తీసుకువెళ్లాలని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి పశ్చిమ ప్రకాశం రైతులకు మేలు జరిగే విధంగా కృషి చేయాలని మాగుంటను కోరారు. ఆయన వెంట విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, శ్రీకృష్ణ, సూర్యప్రకాష్, పిడతల కర్ణాకర్, సాయి సురేంద్ర తదితరులు ఉన్నారు.

సంతనూతలపాడు: ఒంగోలు ఎంపీగా గెలుపొందిన మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఒంగోలులోని ఆయన కార్యాలయంలో బుధవారం సంతనూతలపాడు మాజీ సర్పంచ్ ఆర్.అంకారావు కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాగూర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

దర్శి అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి

మంత్రి స్వామి దృష్టికి తీసుకెళ్లిన ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి



మంత్రి, ఎంపీతో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, జూన్ 19 : నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన బుధవారం ఒంగోలులో జరిగిన సమావేశంలో ఆమె నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభించి మధ్యలో నిలిచిపోయిన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణ పరిశోధన కేంద్రం పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, రూ.5 కోట్లతో ఆరంభించి పునాదులతో నిలిచిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని చేట్టాలని కోరారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దర్శిలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎస్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పూడిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, కాలం చెల్లిన పైపులు పగిలిపోతూ నీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందని చెప్పారు. రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ కార్యకర్త దాడి

బల్లికురవ, జూన్ 19 : వైసీపీ పాలనలో అవినీతి పనులపై ప్రశ్నించిన టీడీపీ నాయకుడు అయిన కొప్పెరపాడుకు చెందిన బుర్రి ప్రసన్నపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కుంచాల రాంబాబు సోమవారం దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రసన్నను వారి బంధువులు ఒంగోలు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కొప్పెరపాడుకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన బుర్రి ప్రసన్న గ్రామ సెంటర్‌లో ఉండగా వైసీపీ కార్యకర్త కుంచాల రాంబాబు అక్కడకు రాగా, గతంలో చేసినట్లు ఇప్పుడు అవినీతి పనులకు పాల్పడితే తమ ప్రభుత్వం చూస్తు ఊరుకోదని ప్రసన్న అనగా, ఇద్దరి మధ్యా వాదన పెద్దది కావడంతో రాంబాబు ఒక్కసారిగా పక్కనే ఉన్న ఇటుక రాయితో దాడి చేశాడు. తలకు, గడ్డంకు తీవ్ర గాయాలైన ప్రసన్నను ఒంగోలు తరలించగా అయనకు 40కుట్లు వరకు వేసి వైద్యం అందిస్తున్నారు.

అద్దంకి - బొద్దికూరపాడుకు ఆర్టీసీ బస్సు

అద్దంకి, జూన్ 19 : అద్దంకి నుంచి బొద్దికూరపాడుకు బుధవారం నుంచి కొత్తగా ఆర్టీసీ బస్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట నుంచి అద్దంకి నుంచి బొద్దికూరపాడుకు ఆర్టీసీ బస్‌లు నడపగా జగన్‌రెడ్డి వచ్చాక నాలుగేళ్లుగా రద్దు చేశారు. తాళ్లూరు మండలంలోని పలు గ్రామాల నుంచి అద్దంకికి నేరుగా బస్ సర్వీస్ లేకుండా పోయింది. ఈక్రమంలో బస్సు సర్వీసును నుంచి పునరుద్ధరించారు. అద్దంకిలో ఉదయం 5-30 గంటలకు బయలుదేరి 7-30 గంటలకు బొద్దికూరపాడు, తిరుగు ప్రయాణంలో ఉదయం 9-30 గంటలకు అద్దంకి చేరుకుంటుంది. సాయంత్రం 5-30 గంటలకు మరలా అద్దంకి లో బయలుదేరి బొద్దికూరపాడు వెళ్లి మరలా రాత్రికి అద్దంకి చేరుతుంది.

అక్రమ రిజిస్ట్రేషన్‌తో.. హాంఫట్

రూ.15 కోట్ల ఆస్తిని కొట్టేసిన వైసీపీ నాయకులు

దొంగ పత్రాలు సృష్టించి అనధికార వారసుడితో తతంగం

బయటికి పొక్కడంతో రిజిస్ట్రేషన్ రద్దుచేసుకున్న వైనం

మార్కాపురం, జూన్ 19 : మార్కాపురం ప్రాంతంలో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ మూకలు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా అది పట్టా భూమా, ప్రభుత్వ భూమా, చెరువు తొట్టా, పంట కాలువలా అనే తేడా లేకుండా విలువైన అన్నింటినీ దర్జాగా కబ్జా చేశారు. ఐదేళ్ల రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడటంతో అన్యాయానికి గురైన వాళ్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడేలేడు. ప్రస్తుతం భూములు కోల్పోయిన బాధితులు అధికార పార్టీ నాయకులకు గోడును వెల్లబోసుకుంటున్నారు. స్థానిక ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా వైసీపీ నాయకులు వేసిన వెంచర్ అంతా అక్రమాలమయమే. అవి పట్టా భూములే అయినా విలువైనవి కావడంతో యజమానులను నయానో భయానో బెదిరించడం, లేదంటే అక్రమ కేసులు పెట్టడం తదితర చర్యల ద్వారా రూ.100 కోట్ల విలువ గల స్థలాన్ని తక్కువ ధరకే కొట్టేశారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేని వారి భూములను తప్పుడు పత్రాలు సృష్టించి బినామీలతో దొంగ రిజిస్ట్రేషనలకు కూడా తెగబడ్డారు. అంతేకాక ఆ వెంచర్‌కు అడ్డుగా ఉన్నారని ఆర్‌అండ్‌బీ మార్జిన్‌లో చిన్నపాటి గుడిసెలు వేసుకుని బతుకుతున్న వారిని సైతం వదలకుండా వారి గృహాలను కూల్చేశారు. ఆ వెంచర్‌లో జరిగిన దొంగ రిజిస్ట్రేషన్లు, పలురకాల అక్రమాలపై కొందరు బుధవారం ఒంగోలు వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రికార్డులు మార్చి.. అధికారులను ఏమార్చి దోపిడీ

స్థానిక ఎస్‌వీకేపీ కళాశాల ఎదురుగా 889 సర్వే నెంబర్‌లో 6.63 ఎకరాల భూమి ఉంది. మొత్తం పట్టా భూమే. ఆ సర్వే నెంబర్‌లో పలువురికి భూములు ఉన్నా వారసులు ఎవరూ లేకపోవడంతో వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడు మరికొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కలిసి అక్రమానికి తెరలేపారు. ఆ భూమికి ముందు ఆర్ అండ్‌బీ స్థలంలో పేదలు నివస్తుండటాన్ని అడ్డుపెట్టుకుని దారి లేకుండా చేసి బేరానికి దిగారు. పెద్దలతో మనకెందుకులే అని కొందరు సుమారు 2 ఎకరాల మేర అమ్మారు. ఆ క్రమంలోనే సర్వే నెంబర్ 889/బి2/ఎ లో 25 సెంట్ల భూమిపై దృష్టి పెట్టారు. వాస్తవానికి ఆ భూమి మద్దెల వెంకటరత్నం అనే వ్యక్తిది. ఆయన 1937వ సంవత్సరంలో ఆ సర్వే నెంబర్‌లో మొత్తం 3.09 ఎకరాలను మద్దెల వెంకటరత్నం, మిట్టపల్లి సుబ్బరాయుడులు ఇద్దరు కలిసి కొన్నారు. 1962వ సంవత్సరంలో ఇరువురు కలిసి 2.59 ఎకరాలను అమ్ముకున్నారు. ఇక ఇరువురికి చెరి 25 సెంట్ల చొప్పున భూమి ఉండేది. కాలక్రమంలో మిట్టపల్లి సుబ్బరాయుడు 25 సెంట్లను అమ్ముకున్నాడు. కానీ వెంకటరత్నం మాత్రం ఆ భూమిని ఎవరికీ విక్రయించలేదు. అంతేకాక ఆయనకు ఎవరూ వారసులు లేరు. భార్య చనిపోయింది. ఆయన కూడా 1984లో మృతిచెందారు. వారసులు ఎవరూ లేకపోవడంతో ఆ స్థలం జోలికి ఎవరూ వెళ్లలేదు. సుమారు రూ.15 కోట్ల విలువైన ఆ భూమిపై కన్నేసిన వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడు తన వ్యాపార భాగస్వామితో మద్దెల వెంకటరత్నం కుమారున్ని సృష్టించారు. పట్టణానికి చెందిన మద్దెల అంపయ్య కుమారుడు ప్రసాద్‌ను వెంకటరత్నం కుమారునిగా మార్చి అధికారం చేతిలో ఉండటంతో రికార్డులన్నీ క్షణాల్లో తయారు చేయించారు. 2020లో వెంకటరత్నం డెత్ సర్టిఫికేట్, ఆయన కుమారుడు ప్రసాద్‌గా ప్రాపర్‌పర్సన్ సర్టిఫికేట్ తయారు చేయించారు. అంతేకాక ఆధార్ కార్డును కూడా దొంగది తయారు చేయించి ముందుగా ఖాతా నెంబర్ 2843ను సృష్టించి ప్రసాద్ పేరున పాస్‌బుక్ పొందారు. మద్దెల ప్రసాద్ ద్వారా తొలుత నాయకుని వ్యాపార భాగస్వామి కుటుంబసభ్యులు ఇరువురిపై 2021 ఫిబ్రవరి 13న డాక్యుమెంటు నెంబర్‌లు 8294/2021, 8295/2021లతో రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం 2023 మార్చి 27న కుటుంబ సభ్యులు ఇరువురితో ముఖ్య నాయకుని సోదరుని వ్యాపార భాగస్వామి గొలమారి లక్ష్మీరెడ్డి డాక్యుమెంట్ నెంబర్ 2364/2023, 360/2023లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత ఈ విషయం బయటకు పొక్కి, మద్దెల వెంకటరత్నం బంధువులకు చేరింది. ఆయనకు ఎలాంటి వారసులు లేరని రెవిన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులకు తెలిపినా బుట్ట దాఖలు చేశారు. దొంగ రిజిస్ట్రేషన్ అని ప్రచారం జరగడంతో అక్కడ స్థలాలు కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో గొలమారి లక్ష్మీరెడ్డితో పాటు ముగ్గురు బంధువుల పేరున ఉన్న డాక్యుమెంట్లను 2023 డిసెంబర్ 12న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేసుకున్నారు.

రిజిస్ట్రేషన్ రద్దు సరే.. స్థలం మాటేమిటి..

అక్రమంగా చేయించుకున్న రిజిస్ట్రేషన్‌లను రద్దుచేయించుకున్న సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి లక్ష్మీరెడ్డి స్థలాన్ని మాత్రం నేటికీ ఆయన ఆధీనంలోనే పెట్టుకున్నారు. ఈ క్రమంలో మరో నూతన అక్రమానికి తెరలేపాడు. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ మున్సిపల్ నాయకునికి ఈ సైట్‌లో నుంచి వెళ్తేనే ఆయన నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌కు, ఓపెన్ సైట్‌లకు విలువ వచ్చేది. ఈ విషయంలో రెండు పార్టీల నాయకులు ఏకమయ్యారు. మద్దెల వెంకటరత్నం స్థలం మాకు కావాలంటూ ఎవరూ వచ్చే అవకాశాలు లేనందున ఆ స్థలాన్ని టీడీపీ నాయకుని అపార్ట్‌మెంట్‌కు వెళ్లే దారికి మళ్లించారు. దీంతో సదరు టీడీపీ నాయకుడు కూడా ఆరు మాసాల క్రితం సిమెంట్ రహదారి నిర్మించుకున్నారు. ఇంతా చేసినా మద్దెల వెంకటరత్నం స్థలం 25 సెంట్లు ఎవరు తేలుస్తారో ఆ దేవునికే తెలియాలి.



దొంగ రిజిస్ట్రేషన్‌లు జరిగింది ఈ భూమిలోనే..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ లీలలు అన్నీ ఇన్నీ కావు..

889 సర్వే నెంబర్‌లోని వెంచర్‌లో దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నది ఒక ఎత్తయితే. అక్కడ వైసీపీ ముఖ్య నాయకుని సోదరుడు, వారి అనుయాయులు చేసిన మోసాలు అన్నీ ఇన్నీ కావు. మార్కాపురం చుట్టుపక్కల సుమారు 5 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడా వ్యవసాయ పొలం కింద రిజిస్ట్రేషన్‌లు చేయరు. అన్నీ గజాల్లోనే జరుగుతున్నాయి. కానీ పట్టణంలో అత్యంత ఖరీదైన ఎస్‌వీకేపీ కాలేజీ రోడ్డులోని 889 సర్వే నెంబర్‌లో మాత్రం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు అధికారపార్టీ నాయకులకు స్వామిభక్తిని చాటుకొని వ్యవసాయ భూముల కింద రిజిస్ట్రేషన్ చేశారు. ఆ విధంగా కూడా సుమారు రూ.కోటి వరకు రిజిస్ట్రార్ కార్యాలయం ఆదాయం కోల్పోయినట్లు తెలుస్తోంది. అంతేకాక 889 సర్వే నెంబర్‌ను ఆనుకుని ఆర్‌అండ్‌బీ రోడ్డువైపు 207 బి 2, బి 3 సర్వే నెంబర్‌లు ఉన్నాయి. 207లో మొత్తం 60 సెంట్లు ఉండగా ఈ రెండు సబ్ డివిజన్ నెంబర్‌ల ద్వారా మరో 25 సెంట్ల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రెవిన్యూ అధికారులు 889, 207 సర్వే నెంబర్‌లలో జరిగిన అక్రమాలను క్షుణ్ణంగా పరిశీలించి వెలికితీసి అక్రమార్కులకు బుద్ధి చెప్పాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్ల నీటి సరఫరాలో అవినీతిపై విచారణ జరిపించండి

- జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టరుకు ఫిర్యాదు
- టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, జూన్ 19: ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఏళ్లుగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్ల నిర్వహణలో అవినీతి జరిగిందని, ఈ విషయంపై విచారణ జరిపించాలని జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు టీడీపీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు బుధవారం తెలిపారు. ప్రజల అవసరాలకు మించి నీటి ట్యాంకర్లు సరఫరా చేస్తున్నట్లు అధికారులే గుర్తించి 2024 ఫిబ్రవరి నెలలో నిలిపివేశారని తెలిపారు. పశువుల తొట్లకు నీటి సరఫరా చేయకుండానే ట్యాంకర్లకు లెక్కలు చూపి బిల్లులు పొందారని తెలిపారు. నీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రజల అవసరాలు తీర్చాలే తప్ప ప్రభుత్వ ధనం దుర్వినియోగం జరగకుండా చూడాలని, ఆ బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ప్రస్తుతం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ప్రజలకు అవసరమైన మేరకు ట్యాంకర్లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు.



టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు



పట్టుకున్న గోవా మద్యంతో ఎస్ఈబీ అధికారులు

40 మద్యం బాటిళ్లు స్వాధీనం

గిద్దలూరు టౌన్, జూన్ 19 : అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా మరొకరు పరారయ్యారు. ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి కథనం ప్రకారం కొమరోలు మండలం గోపానిపల్లెకు చెందిన కొమరోలు హరి 40 మద్యం బాటిళ్లను (750 ఎంఎల్) సంచిలో పెట్టుకుని వెళుతుండగా అనుమానంతో సీఐ కొండారెడ్డి సంచిని తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు కనిపించాయి. వెంటనే హరిని అదుపులోకి తీసుకుని విచారించగా 6 నెలలుగా ఇడమకల్లు గ్రామానికి చెందిన దద్దనాల తిరుమల కిశోర్ తనకు గోవా నుంచి మద్యం తెచ్చి ఇస్తున్నాడని పేర్కొన్నాడు. వెంటనే కిశోర్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా కిశోర్ పరారైనట్లు సీఐ తెలిపారు. ఈదాడుల్లో ఎస్ఈబీ ఎస్సై టి.ఫణికుమార్, సిబ్బంది వెంకటేశ్వర్లు, సాయి, ఎలీసా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

జనసేన సంబరాలు

గిద్దలూరు టౌన్, జూన్ 19 : రాచర్ల మండలంలోని అనంపల్లె క్రాస్‌రోడ్డు వద్ద మండల జనసేన అధ్యక్షులు పుట్టా బాలకృష్ణ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. జనసేన రాష్ట్ర అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు కోలా రంగసాయి, పార్లపల్లి శ్రీనివాసులు, బెల్లంకొండ సాయన్న, ఆసుల రమేష్, బత్తిన కృష్ణయ్య, ప్రభాకర్‌నాయుడుతోపాటు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాసి వెంకట రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు అబ్బిశెట్టి ఉదయ్‌శంకర్, నాయకులు ఎం.రమణ, తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం వైస్ ఎంపీపీకి ఎంపీపీ బాధ్యతలు

త్రిపురాంతకం, జూన్ 19: త్రిపురాంతకం మండల ఎంపీపీ బాధ్యతలను జడ్పీ సీఈవో వైస్ ఎంపీపీకి బాధ్యతలు అప్పగించారు.ఈ నెల 10 వ తేదీన ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయగా ఆ స్థానంలో త్రిపురాంతకం- 2 ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ గొట్టెముక్కల రిబ్కాకు ఇన్‌చార్జీ ఎంపీపీగా బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.



గొట్టెముక్కల రిబ్కా

విద్యార్థులకు కిట్లు అందజేత

పెద్దదోర్నాల, జూన్ 19: మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గానూ మంజూరయిన విద్యాకానుకల కిట్లను టీడీపీ నాయకులు బుధవారం అందజేశారు. ప్రిన్సిపాల్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లను బీఎం డిగ్రీ కళాశాల చైర్మన్ బట్టు రమణారెడ్డి, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, ఏర్వ మల్లికార్జున రెడ్డి, షేక్ మంజూర్‌బాషా, కేతు మురళి అందజేశారు.

గిరిజనులు రక్తహీనతను అధిగమించాలి

ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

పెద్ద దోర్నాల, జూన్ 19: చెంచు గిరిజనులు రక్తహీనతను అధిగమించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో చెంచు గిరిజనులకు సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీవో రవీంద్రారెడ్డి మాట్లాడుతూ సెల్ ఎనీమియా వ్యాధి గిరిజనుల్లోనే ఎక్కువ వ్యాప్తి చెందే అవకాశముందని, అందుకు రక్తహీనత ప్రధాన కారణమన్నారు. ప్రభుత్వం ఆ వ్యాధి నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలోనే గిరిజనుల్లో రక్త హీనత నివారణకు వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రక్తహీనత ఎందుకు వస్తుంది, తద్వార ఏవ్యాధులు సంక్రమిస్తాయి.., ఎలా నిర్మూలించుకోవాలి, ఏమి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యాధికారులు వివరించారు. పలువురికి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, ప్రిన్సిపాల్ పీ శ్యామూల్ జోబ్, వైద్యాధికారులు ప్రశాంతి, యాగ్నిక్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి

ఎనీమియా వ్యాధి నివారణపై అవగాహన

మార్కాపురం రూరల్ : మండలంలోని జమ్మనపల్లి గ్రామ ఎస్టీ కాలనీలో సికిల్ సెల్‌ఎనీమియా వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని వైద్య బృందం, వెలుగు అధికారులు బుధవారం నిర్వహించారు. ఎస్టీ కాలనీలోని 50 మందికి వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ మాట్లాడారు. డీఆర్‌డీఏ ఏపీఎం రమేష్ బాబు, ఎమ్మెల్ హెచ్‌పీ నవీన్, ఆశా వర్కర్లు, వీవోఏ, వైద్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గిద్దలూరులో..

గిద్దలూరు : పట్టణంలోని అర్బన్‌కాలనీ సచివాలయంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైద్యాధికారి డాక్టర్ షరీఫ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో ఈ వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. జన్యుమార్పిడి లోపం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని పేర్కొన్నారు. ఈ వ్యాధి వలన ఆక్సిజన్ తగ్గి అవయవ నష్టానికి దారి తీస్తుందని తెలిపారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధిని నిర్ధారించుకుని చికిత్సలు పొందాలని సూచించారు. అనంతరం అర్బన్‌కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వారికి చికిత్సలు చేశారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సుధారాణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కరువు పరిశీలనకు నేడు కేంద్ర బృందం రాక

మార్కాపురం రూరల్, జూన్ 19: వ్యవసాయ శాఖ మార్కాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు కరువు పరిస్థితుల పరిశీలనకు నేడు కేంద్ర బృందం వస్తున్నట్లు మార్కాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ బుధవారం తెలిపారు. కేంద్ర బృందం అధికారులు మార్కాపురం మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో ఎంఐ ట్యాంక్‌ను, పెద్దారవీడు మండలంలోని గొబ్బూరులో పీఆర్ ట్యాంక్‌ను పరిశీలిస్తుందన్నారు. కేంద్ర బృందంలో సభ్యులుగా మన్నుజి ఉపాధ్యాయ్ (ఎంఏ డైరెక్టర్ సీడబ్ల్యూసీ ఆంధ్రప్రదేశ్), ఎస్‌సీ కశ్యప్‌గ (యానిమల్ హస్బెండరీ డిప్యూటీ డైరెక్టర్ న్యూఢిల్లీ), మదన్ మోహన్ మౌర్య(డిప్యూటీ డైరెక్టర్ ఫుడ్ అండ్ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ న్యూ ఢిల్లీ), అనురాధ భట్నా(నీతి ఆయోగ్ సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ న్యూఢిల్లీ) అధికారులు ఉన్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల రైతులు అందుబాటులో ఉండి కేంద్ర బృందం అధికారులకు కరువు పరిస్థితుల గురించి వివరాలను తెలియజేయాలని వ్యవసాయ సంచాలకులు కోరారు.

బోగోలు రోడ్డుపై భారీ గుంత

వాహనదారుల ఇబ్బందులు

కంభం, జూన్ 19 : అర్ధవీడు మండలం బోగోలుకు వెళ్ళే రోడ్డు మధ్య భాగంలో భారీ గుంత పడడంతో వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నడిరోడ్డుపై ఈ భారీ గుంతను చూసి గ్రామప్రజలు అవాక్కయ్యారు. గుంత లోపలి భాగం ఓ గదిలా ఉండడంపై ఆశ్చర్యపోతున్నారు. గతంలో పూర్వీకులు ధాన్యం దాచేందుకు ఇటువంటి పెద్దగుంతలను తవ్వినట్లుగా భావిస్తున్నారు. గదిలా ఉన్న ఈ గుంతపై గ్రామప్రజలు అధికారులకు సమాచారం అందించారు. అలాగే గుంతలో పడకుండా పెద్దరాళ్ళు చుట్టూత పెట్టారు. తక్షణమే అధికారులు స్పందించి గుంతను పరిశీలించి పూడ్చి రహదారిని బాగు చేయాలని వాహనదారులు, గ్రామస్థులు కోరుతున్నారు.



రహదారిపై పెద్ద గుంతతో ఆగినలోడ్ లారీ (ఇన్‌సెట్లో) భారీ గుంత

డిగ్రీ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత

ఎర్రగొండపాలెం, జూన్ 19 : ఎర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బీఏ గ్రూపు విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ గుత్తా శ్రీధర్‌నాయుడు బుధవారం తెలిపారు.బీకాం విద్యార్థులు 85 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.

లైన్‌మన్‌కు విద్యుదాఘాతం

గిద్దలూరు, జూన్ 19 : విద్యుత్‌షాక్‌కు గురై లైన్‌మన్ తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాచర్ల మండలంలో జరిగింది. పాలకవీడు చెరువుకట్ట సమీపంలో విద్యుత్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై స్తంభం నుంచి లైన్‌మన్ సురేష్‌నాయక్ కిందపడ్డాడు. కాళ్ళకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అనంతరం క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పాఠశాల బస్సులకు జరిమానా

పొదిలి,జూన్19: సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న పలు పాఠశాల బస్సులకు దర్శి ఎంవీఐ రవికుమార్ బుధవారం రూ.40వేల జరిమానా విధించారు. తనిఖీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాల బస్సులను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్‌బస్సులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమం జరుగుతుందన్నారు. బస్సులు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగిఉండాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

ఎర్రగొండపాలెం, జూన్ 19 : గ్రంథాలయంలో పోటీ పరీక్షల నిమిత్తం అవసరమైన యోజన, కురుక్షేత్ర,విజ్ఞాన సంచిక ఫైన్ ఇండియా వివేక్ వంటి పుస్తకాలను యువత అవగాహనకోసం గ్రంథపాలకురాలు జాన్సీ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాలల విద్యార్థులు సైతం ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. పిల్లలు సెల్‌ఫోన్ వాడకం కంటే గ్రంథాలయంలో పుస్తకాలు చదివి విజ్ఞానం, వినోదం పెంచుకోవాలని తెలిపారు

మాగుంటను కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

పొదిలి, జూన్19: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని బుధవారం పొదిలికి చెందిన ఆర్యవైశ్య సంఘం నాయకులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా మాగుంటను గజమాలతో ఘనంగా సత్కరించారు. అందరి సహాయ సహకారాల వల్ల టీడీపీ విజయం సాధించిందని ఆర్యవైశ్య సంఘం నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మాజీ ఉపసర్పంచ్ ఎస్‌కె.జిలానీ బాషా, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎస్.చిరంజీవి, ఎస్.శ్రీదేవి, ఎం.అవినాష్, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మాగుంటను గజమాలతో సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

దివ్యాంగ వలంటీర్లకు న్యాయం చేయాలి



రామిరెడ్డిని కలిసిన దివ్యాంగుల సంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19: గత ప్రభుత్వ ఒత్తిడితో రాజీనామా చేసిన దివ్యాంగ వలంటీర్‌ల విషయంలో న్యాయం చేయాలని మార్కాపురం దివ్యాంగుల విభాగం పట్టణ అధ్యక్షులు సురేంద్ర టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డిని బుధవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు రెహమాన్, రమణ, మహీన్, అశోక్, పీరా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19: కాంగ్రెస్ నాయకుడు ఎంపీ రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ జావీద్ అన్వర్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో 200 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.భీమరాజ్, ఎస్.రామకృష్ణారెడ్డి, గుమ్మా బాలనాగయ్య, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని అర్బన్‌కాలనీలోకి మార్చాలి

కంభం, జూన్ 19 : కంభం అర్బన్‌కాలనీలోని సచివాలయం-4ను కంభం పట్టణంలోకి మార్చారని, తిరిగి దానికి అర్బన్‌కాలనీలోనే ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు బాబు, శ్రీను ఎంపీడీవో మస్తాన్‌వలికి వినతిపత్రం అందచేశారు. కంభం అర్బన్‌కాలనీలో సుమారు 3,500 మంది నివసిస్తున్నారని, వీరిలో వృద్ధులు, వికలాంగులు కంభం జయప్రకాశ్‌వీధిలోకి సచివాలయాన్ని మార్చడంతో అక్కడికి పోవాలంటే ఇబ్బందులు, వ్యయప్రయాసలకు లోనవుతున్నారని తెలిపారు. ఆటోలకే 200 రూపాయలు అడుగుతున్నారని, కావున సచివాలయం-4ను జయప్రకాశ్ వీధి నుంచి తిరిగి అర్బన్‌కాలనీకి మార్చాలని కోరుతున్నారు. ఎంపీడీవో స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



ఎంపీడీవో మస్తాన్‌వలికి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు రజాక్ అన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీదేవిలను కలిసి పలు సమస్యలు వివరించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఎంపీజే ఆధ్వర్యంలో నెలరోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంపీజే నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే నాయకులు రసూల్, జహీర్, నాగూర్ మీరా వలి, కాశీంసా, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలి



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 19: మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకెఎం రఫి అన్నారు. సీఐటీయూ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎంఈవో తుంబేటి శ్రీనివాసులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికుల 25 సంవత్సరాలుగా ప్రభుత్వం బిల్లులు సక్రమంగా చెల్లించకపోయినా అప్పులు చేసి నిర్వహిస్తున్నారన్నారు. కొందరు వ్యక్తులు కార్మికులను మానుకోవాలి లేక రాజీనామాలు చేయాలని బెదిరింపులకు పూనుకోవడాన్ని ఖండించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని బెదిరింపులను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు గురునాథం, కొండమ్మ, నాగిరెడ్డి, మరియమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంను పరామర్శించిన తహసీల్దార్

పొదిలి,జూన్19: నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించిన ఏఎన్ఎం విజయకుమారిని తహసీల్దార్ జియాఉల్‌హక్ వీఆర్వోలతో కలిసి బుధవారం పరామర్శించారు.ఆమె పనిచేస్తున్న సచివాలయంలో ఆశావర్కర్‌తో జరిగిన వాగ్వాదంతో మనస్తాపానికి గురైన విజయకుమారి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విజయకుమారిని పరామర్శించిన తహసీల్దార్ ఇద్దరి మధ్య జరిగిన సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ వెంట వీఆర్వోలు యాకోబు, నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు పంపిణీ

త్రిపురాంతకం, జూన్ 19: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండో విడత పుస్తకాలు, బ్యాగులు, కిట్ల పంపిణీని ఎంఈవో-2 టి.రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. దీనిలో భాగంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు స్థానిక జడ్పీ పాఠశాలలోని స్టాక్ పాయింట్ వద్ద అందజేశారు. ప్రధానోపాధ్యాయులు తక్షణమే పుస్తకాలను, ఇతర వస్తువులను విద్యార్థులకు అందజేయాలని ఎంఈవో ఆదేశించారు. త్వరలో యూనిఫాం కూడా అందజేస్తామని తెలిపారు.



ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈవో

ఏకలవ్య ప్రిన్సిపాల్‌కు సన్మానం

పెద్ద దోర్నాల, జూన్ 19: స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పీ శ్యామూల్ జోబ్ బదిలీపై అనంతపురం వెళ్తున్న సందర్భంగా ఐటీడీఏ పీవో రవీంద్రారెడ్డి, కళాశాల సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీఎంహెచ్‌వో శ్రీనివాసరావు, చింతల సర్పంచి వెంకటయ్య, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ జోబ్‌ను సన్మానిస్తున్న పీవో రవీంద్రారెడ్డి

పామూరులో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రమణయ్య

పామూరు జూన్ 19 : పామూరులో రోజురోజుకూ పెరిగిపోతున్న ఆక్రమణలను తొలగించి ప్రజల ఇక్కట్లు తొలగించాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య కోరారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు చినసుబ్బయ్య అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. పట్టణంలో ఆక్రమణలు పెరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య పెరిగి గంటల కొద్ది వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టి సెంటర్ డివైడర్, అండ్ లైటింగ్‌తో కూడిన రోడ్డు నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో మల్లికార్జున, మహేంద్ర పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చురుకుదనం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పద్మజ

పామూరు జూన్ 19 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించడం ద్వారా పిల్లల్లో నైపుణ్యాలు, చురుకుదనం పెరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి పద్మజ చెప్పారు. మండలంలోని బుక్కాపురం, అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు గార్డియన్‌డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.కార్యక్రమంలో జీఎంఎస్‌కే షేక్ షానావాజ్, ఉపాధ్యాయులు, బీ ప్రదీప్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం లక్ష్మీనారాయణమ్మ, కే భాగ్యలక్ష్మీ, టీ అమల, ఎం జ్యోతి, సుభాషిణి, అగ్రికల్చరర్ అసిస్టెంట్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సమష్టి కృషి వలనే ఉగ్రకు మెజార్టీ

పామూరు జూన్ 19 : పట్టణంలోని 18 బూత్‌లల్లో బూత్ ఇన్‌చార్జులు సమిష్టిగా కృషి చేయడంవలనే ఎమ్మెల్యే ఉగ్రకు మెజార్టీ రావడం సాధ్యమైందని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు సూచించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో టీడీపీ పట్టణ గౌరవ అధ్యక్షులు షేక్ ఖాజారహంతుల్లా బుధవారం కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, మండ్లా రమణయ్య, బూత్ ఇన్‌చార్జులు ఖాజాగౌస్, తుపాకుల వెంకటేశ్వర్లు, చల్ల కిశోర్ ఉన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

దర్శి, జూన్ 19 : దర్శి కోర్టు సముదాయంలో ఈనెల 29వ తేదిన జాతీయ లోక్ అధాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్ శివశంకర్ రెడ్డి తెలిపారు. స్థానిక కోర్టు హాలులో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా పెండిగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు నేషనల్ లీగల్ సర్వీస్ అధారిటీ ఆదేశాల మేరకు లోక్‌అధాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ జన్మదిన వేడుకలు

పామూరు జూన్ 19 : కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను రాష్ట్ర ఎస్సీసెల్ జనరల్ కార్యదర్శి గుడిపాటి రంగనాయకులు, మండల కమిటీ అధ్యక్షులు శ్యావలమౌలాలి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వేల్పుల రాజశేఖర్, పి. వెంకటేశ్వరరెడ్డి, ఎస్ మల్లికార్జునరెడ్డి, సయ్యద్ పాచ్చహుసేన్, హెచ్ఎంపాడు, సీఎస్‌పురం, పామూరు, వెలిగండ్ల వరికుంటపాడు అధ్యక్షులు బీ కోటేశ్వరరావు, షేక్ హజరత్, సుభాని, నడవ అంకయ్య, వసీం పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను పరిరక్షించాలి


సభ్యత్వ నమోదు కార్యక్రమం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కనిగిరి, జూన్ 19 : ప్రాథమిక విద్యను పరిరక్షించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో బుధవారం ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీ రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, నాయకులు హజరత్‌రెడ్డి, దండే శ్రీనివాసులు, భాస్కర్, నారాయణరెడ్డి, రాములు, కే రామ్మోహన్, పీ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి స్వామిని సన్మానించిన టీడీపీ నాయకులు

దొనకొండ, జూన్ 19 : రాష్ట్ర మంత్రి శ్రీ డోలా బాలవీరాంజనేయస్వామిని మండల టీడీపీ నాయకులు బుధవారం ఒంగోలులో కలుసుకొని సన్మానించారు. నాయకులు కామేపల్లి చెంచయ్య, వల్లపునేని ఆదినారాయణ, వైకే చౌదరి, కామేపల్లి పోలయ్య తదితరులు మంత్రి స్వామికి శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. దొనకొండ ప్రాంత అభివృద్ధికి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీకి సంపూర్ణ సహకారం అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దామచర్ల సత్యలను సన్మానించారు.

ఆ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి

పీసీపల్లి, జూన్ 19 : సికిల్‌సెల్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పీసీపల్లి వైద్యాధికారిణి మంజుల చెప్పారు. స్థానిక ప్రభుత్వ వైద్య ప్రాంగణంలో బుధవారం సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు, వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీసుజాత పాల్గొన్నారు.

చిన్నారుల జీవితానికి బడిబాట.. పూలబాట


ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

దొనకొండ, జూన్ 19 : బడి బాట కార్యక్రమం చిన్నారుల జీవితానికి పూలబాట లాంటిదని అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ సుభాషిణి చెప్పారు. మండలంలోని బాదాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త డీఎల్ నర్సమ్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యాధికారిణి సునీత వైద్యపరమైన విషయాలు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందిరాదేవి పాల్గొన్నారు.

అధిక నిధులు కేటాయించాలి

మంత్రి దృష్టికి దర్శి నియోజకవర్గ సమస్యలను తీసుకెళ్లిన టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి


మంత్రి, ఎంపీతో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్

దర్శి, జూన్ 19 : నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి విజ్ఞప్తిచేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆమె నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఆరంభించి మధ్యలో నిలిచిపోయిన జాతీయస్థాయి డ్రైవింగ్ శిక్షణా పరిశోధన కేంద్రం పునఃనిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, రూ.5 కోట్లతో ఆరంభించి పునాదులతో నిలిచిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని చేట్టాలని కోరారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. దర్శిలో 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం అస్తవ్యస్తంగా మారిందన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పూడిపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, కాలం చెల్లిన పైపులు పగిలిపోతూ నీటి సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందని చెప్పారు. రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

దర్శిలో నేడు టీడీపీ సమావేశం

దర్శి పట్టణంలో గురువారం తాళ్లూరు, ముండ్లమూరు మండలాల టీడీపీ సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ బుధవారం ఒక ప్రకటనతో తెలిపారు. తాళ్లూరు మండల సమావేశం ఉదయం 10 గంటలకు జరుగుతుందని, సాయంత్రం 2.30 గంటలకు ముండ్లమూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా మండలాల సమస్యలతో పాటు పార్టీ విషయాలు చర్చించనున్నట్లు తెలిపారు. ముండ్లమూరు నుంచి పార్టీ కార్యకర్తలు అందరూ సమావేశానికి రావాలని మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు మరో ప్రకటనలో కోరారు.

ఎమ్మెల్యే ఉగ్ర చొరవతో నష్టపరిహారం

కలెక్టర్ దృష్టికి బైపాస్ రోడ్డు బాధితుల సమస్య

రూ 13.39కోట్లు విడుదలకు ఆయన సంతకం

తిరిగి ఉగ్ర హయాంలోనే పూర్తి కానున్న రోడ్డు


ఉగ్ర అందించిన ఫైల్‌పై సంతకం చేస్తున్న కలెక్టర్

కనిగిరి, జూన్ 19 : అభివృద్ధి పనుల్లో తనదైన మార్కును కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర చూపారు. బైపాస్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేశారు. ఒంగోలులో బుధవారం జరిగిన జిల్లాస్థాయి అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యేలతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కూడా పాల్గొన్నారు. కనిగిరి ప్రాంతంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అందులో భాగంగా దశాబ్దానికి ముందు డాక్టర్ ఉగ్ర ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో నగరంలో ట్రాఫిక్ దృష్ట్యా బైపాస్ నిర్మాణానికి పూనుకున్నారు. అందుకు భూమిని గుర్తించి ఆయా రైతులకు నష్టపరిహారం అందించాల్సి ఉంది. ఆ క్రమంలో 2014లో ఎన్నికలు వచ్చాయి. ఆ తర్వాత బైపాస్ బాధితులు నష్టపరిహారం చాలదంటూ న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఆ కేసులు తేలేటప్పటికీ ఆ తర్వాత 2019 ఎన్నికలు వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బైపాస్ సమస్య మరుగున పడింది. తిరిగి 2024 ఎన్నికల్లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హయాంలోనే బైపాస్ సమస్యకు పరిష్కారం లభించింది. బైపాస్ బాధితులకు నష్టపరిహారం విడుదల చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరిందే తడవుగా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ రూ.13.39 కోట్లు విడుదల చేసేందుకు సంతకం చేశారు. త్వరలో బైపాస్ రోడ్డు నిర్మాణం కానుందని తెలిసి కనిగిరి ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలలో నీటి వసతికి రూ.1.40 లక్షలు మంజూరు చేయించిన ఉగ్ర

వెలిగండ్ల, జూన్ 19 : ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహ రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చారు. మండల పరిధిలో గోకులం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల దాహార్తిని తీర్చేందుకు రూ.1.40 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఈ నెల 15వ తేదీన వెలిగండ్ల మండలంలో సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు పీవీస్ రవికుమార్ విద్యార్థులకు మంచినీటి సౌకర్యం లేదని, మధ్యాహ్న భోజన సమయంలో ఇంటినుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. ఈ మేరకు అధికారులు ఆ నిధులతో పాఠశాలలో బోరు ఏర్పాటుతోపాటు ట్యాంక్ నిర్మాణం చేపట్టనున్నారు. త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి.

సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలి

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జూన్ 19 : కనిగిరి ప్రాంతానికి సరఫరా జరిగే మంచి నీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చెప్పారు. పొదిలి రోడ్డులోని కనిగిరి మంచినీటి పైపులను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా అధికారులను పిలిపించి కనిగిరి ప్రాంతానికి ఎంత నీరు సరఫరా జరుగుతుందో తెలుసుకున్నారు. పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని మంచినీటిని అందించాలని సూచించారు. అదేవిధంగా పైపుల లీకులను గుర్తించి శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. కనిగిరి ప్రాంతంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తరగతి గదులకు మరమ్మతులు చేయిస్తాం

శిథిలావస్థకు చేరిన పాఠశాలను పరిశీలించిన డీఈ

తాళ్లూరు, జూన్ 19 : మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిథిలావస్థకు చేరిన తరగతి గదులను ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ రమణయ్య, ఎంఈవో-2 సుధాకర్‌లు బుధవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన బొద్దికూరపాడు ఉన్నత పాఠశాల అన్న కథనం ఈ నెల 16వ తేదీ ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన పాఠశాలను సందర్శించి పరిశీలించారు. పాడైపోయిన తరగతి గదులను, కూలిన వరండా శ్లాబ్‌ను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన గదులను తక్షణమే మరమ్మతులు జరిపించాలని పాఠశాల పీసీ కమిటీ చైర్మన్, హెచ్ఎంలకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో-2 లక్కరాజు సుధాకర్, హెచ్ఎం, పీసీ కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి-బొద్దికూరపాడు ఆర్‌టీసీ బస్సు సర్వీస్ పునరుద్ధరణ

తాళ్లూరు, జూన్ 19 : అద్దంకి -బొద్దికూరపాడు ఆర్‌టీసీ బస్సు సర్వీసును బుధవారం నుంచి పునరుద్ధరించారు. బొద్దికూరపాడు వెళ్లే మార్గం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు, విద్యార్థులు పడుతున్న అవస్థలను ఈ నెల 1వ తేదీ అరకొరగా ఆర్‌టీసీ సర్వీస్‌లు' కథనాన్ని ఆంధ్రజ్యోతి ప్రచురించింది. ఆర్‌టీసీ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అద్దంకి డిపో మేనేజర్‌కు సూచించారు. ఆయన స్పందించి అద్దంకి-బొద్దికూరపాడు బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించారు.

శ్రీనివాసయాదవ్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై హర్షం

దర్శి, జూన్ 19 : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసయాదవ్‌కు రాష్ట్ర టీడీపీ అధ్యక్ష పదవి లభించటం ఆనందదాయకమని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పేర్కొన్నారు. నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ హయాం నుంచి టీడీపీ బీసీలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యత కల్పిస్తోదన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసు, యాదవ సంఘం నాయకులు మోరబోయిన మురళీకృష్ణయాదవ్, బేళ్ల శ్రీనివాసరావు, కత్తి నాగేశ్వరరావు, అంకాల రమణయ్య, పులిమి యల్లయ్య, గడ్డం బాలయ్య, తలారి కోటయ్య పాల్గొన్నారు.

కనిగిరిలో కుక్కల స్వైర విహారం

9వ వార్డులో చిన్నారులపై దాడి..మరో ఘటనలో గొర్రె మృతి

ఆందోళన చెందుతున్న వార్డు ప్రజలు

కనిగిరి, జూన్ 19 : కనిగిరి పట్టణంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరు చిన్నారులపై దాడి చేసి గాయపరచగా, కుక్కల దాడిలో గొర్రె కూడా మృతి చెందింది. పట్టణంలోని 9వ వార్డులోని మసీదు వీధిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని 9వ వార్డు మసీదుకు చెందిన బాషా మొహిద్దీన్‌కు చెందిన మేకపోతు(గొర్రెపిల్ల)కు వారి ఇంటి ప్రాంగణంలో ఉండగా కుక్కల మంద దాడి చేశాయి. ఇదే సమయంలో సమీపంలో రోడ్డుపై ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులను నడుముపై ఒకరిని, మరొక చిన్నారి కాలిపై తీవ్రంగా గాయపరిచాయి. దీంతో స్థానికులు కుక్కలను చూసి భయాందోళనలు చెందుతున్నారు.


కుక్కలు కరుస్తున్నా పట్టించుకోలేదు : జంషీర్, టీడీపీ నేత

9వ వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇప్పటికే చాలామందిని కరిచి గాయపరిచాయి. సచివాలయ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదు. తాజాగా గొర్రెపై దాడి చేసి చంపేశాయి. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలి.

లోకేష్‌ను కలిసి కోటపాటి

పామూరు జూన్ 19 : రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్ధన్‌రావు అమరావతిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌ను కలిసిన వారిలో చిత్తూరు జిల్లా విజయం కళాశాలల అధినేత తేజోమూర్తి ఉన్నారు. అలాగే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమ అఖిలప్రియను పామూరు పట్టణ టీడీపీ ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు పందిటి హరీష్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ఎంఎన్ఎం విద్యార్థుల హవా

కనిగిరి, జూన్ 19 : డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్ష ఫలితాల్లో ఎంఎన్ఎం విద్యార్థులు తమ హవా చాటారు. డిగ్రీ ఐదో సెమిస్టర్(ఫైనల్ ఇయర్) బీకాంలో షేక్ నంద్యాల ఖాశింబీ 635/700 మార్కులు, జొన్నలగడ్డ ఝాన్సీ రాణి 630 మార్కులు సాధించారు. బీఏ జాగ్రఫీలో అచ్చి అశ్వని 581 మార్కులు, పాలపర్తి శైలజ 569 మార్కులు, బీఏ పొలిటిక్స్‌లో పత్రాపురం అనూష 496/600 మార్కులు, యెదుగూరి లక్ష్మీపూజిత 488 మార్కులు సాధించి ప్రతిభను చాటారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ప్రిన్సిపాల్ వీఆర్‌వీ రెడ్డి అభినందించారు.

ప్రతిభ కనబర్చిన గౌతమి విద్యార్థులు

దొనకొండ, జూన్ 19 : ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుధవారం విడుదల చేసిన డిగ్రీ ఐదో సెమిస్టార్ ఫలితాల్లో దొనకొండ గౌతమీ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కాలేజీ అడ్మిన్ ఎగ్రాయిం తెలిపారు. బీకాం కంప్యూటర్స్ విభాగంలో పోటు పాలంకవీరయ్య 552/700, మోడి పూజిత 550/700, ఉస్తాల పెద్దక్క 537/700, బీఏ విభాగంలో ఎం బాలకాశయ్య 482/600, వై ప్రవళిక 467/600, టీ ప్రియాంక 459/600 మార్కులను సాధించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మెన్ గుండారెడ్డి, ప్రిన్స్‌పల్ గోపి, వైస్ ప్రిన్స్‌పల్ రామయోగి అభినందించారు.

ఎనిమియా వ్యాధిగ్రస్తుల సర్వే

కురిచేడు, జూన్ 19 : మండలంలోని సికిల్ సెల్ ఎనిమియా వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం స్థాని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అనంతరం రక్త పరీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఏపీ పైపులైన్‌కు లీకులు



ముండ్లమూరు మండలం పసుపుగల్లు సమీపంలోని చిలకలేరు వాగుపై నుంచి వెళ్తున్న ఎన్ఏపీ నీటి పైపులైన్‌కు పలు చోట్ల లీకులు ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో ఐదు గ్రామాలకు రెండు నెలల నుంచి అరకొరగా నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పట్టించుకోవాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆ వైపు కూడా కన్నెత్తి కూడా చూడటం లేదు. ఎన్ఏపీ రిజర్వాయర్ నుంచి మండలంలోని 40 గ్రామాలకు పైగా నీరు సరఫరా అవుతుంది. వారానికి ఒకసారి వచ్చే నీరు కూడా పలుచోట్ల లీకులు పడి నీరు వృథాగా పోతోందని పసుపుగల్లు, చింతలపూడి, వేములబండ, రమణారెడ్డిపాలెం, ఈదర, అయోధ్యనగర్ వాసులు చెబుతున్నారు. అలాగే తమ్మలూరు, ఉమామహేశ్వరఅగ్రహారంతో పాటు పూరిమెట్ల, భీమవరం గ్రామాలకు కూడా వారం నుంచి నీరు నిలిచిపోయింది.


-ముండ్లమూరు

సాగర్ జలాలు సరఫరా చేయాలంటూ వినతి

పీసీపల్లి, జూన్ 19 : వెంగళాయపల్లి పంచాయతీలోని గ్రామాలకు సాగర్ జలాలను సరఫరా చేయాలని ఆ గ్రామ సర్పంచ్ కరణం తిరుపతయ్య ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. కనిగిరిలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో బుధవారం డీఈ విశ్వనాథ్ రెడ్డి, ఏఈ మోహన్‌రావులను కలిశారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ దివాకరపల్లి, మిట్టమీదపల్లి, వెంగళాయపల్లి, వెంగళాయపల్లి కాలనీల్లో ప్రజలు తాగుతున్న నీటిలో విషతుల్య రసాయనాలైన ఫ్లోరిన్, క్లోమియం అధిక మోతాదులో ఉన్నాయన్నారు. ఈ నీటిని తాగడం ద్వారా ప్రజలు మూత్రపిండాల వ్యాధికి గురవుతున్నారని వివరించారు. సాగర్‌నీరు సరఫరా చేసే పైపులైను ఉన్నప్పటికీ ఐదేళ్లుగా గ్రామాల్లోకి నీరు సరఫరా కాలేదన్నారు. స్పందించి డీఈ మాట్లాడుతూ రెండు రోజుల్లో పైపులు ట్రయిల్ వేసి త్వరలో పంచాయతీకి సాగర్‌నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
గురువారం 20 జూన్ 2024







- పంచాయతీ శాఖ మంత్రి పవన్‌పైనే సర్పంచ్‌ల ఆశలు
- జగన్ సర్కార్‌పై పోరాటం చేసి అలసిపోయారు
- కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో నిధులపై చిగురిస్తున్న ఆశలు
- 1172 పంచాయతీలకు రూ.42 కోట్లు విడుదల చేయాలంటున్న సర్పంచ్‌లు

పంచాయతీల.. దశ మారేనా?

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పంచాయతీలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా జగన్ ప్రభుత్వం పనిచేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను కాజేసింది. పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా ముప్పుతిప్పలు పెట్టింది. నిధుల కోసం వివిధ రూపాల్లో సర్పంచ్‌లు పోరాటాలు చేసి అలసిపోయారు. ఉద్యమాలకు ఏ మాత్రం లెక్క చేయకుండా సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాల్లా మార్చేసింది. వైసీపీ ఓటమిలో సర్పంచ్‌లు కీలకపాత్ర పోషించారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో పంచాయతీలకు స్వేచ్ఛ వచ్చినట్లయింది. ఐదేళ్ల పంచాయతీలపై జగన్ కక్షగట్టి నిధులు లేకుండా చేశారు. దీంతో పంచాయతీలలో కనీస వసతుల కల్పన కుంటుపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలకు నిధుల విడుదలపై ఆశలు చిగురించాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టడంతో ఆయనపైనే నిధుల విషయంతో ఆశలు పెట్టుకున్నారు. మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేసింది. అప్పటి జగన్ ప్రభుత్వం ఈ నిధులను పంచాయతీల ఖాతాలకు జమ చేయకుండా దారి మళ్లించుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని 1172 పంచాయతీలకు రూ 42 కోట్లు నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేయాలి. వీటి కోసం సర్పంచ్‌లు ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం కాజేసింది. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం మార్చిలో విడుదల చేసింది. ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు జమ చేసుకుంది. కేంద్ర నిధులు మార్చి నెలలో విడుదల చేసినా నేటివరకు ఒక్క రూపాయి కూడా పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయలేదు. నిధుల కోసం పంచాయతీల పాలక వర్గాలు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో కేంద్రం పంచాయతీలకు విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేస్తుందని పాలక వర్గాలు ఆశిస్తున్నాయి.

పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్వీర్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలకు మళ్ళించుకుంటూ ఆర్థికంగా దెబ్బతీసింది. పల్లెల్లో ప్రగతి పనులను అడ్డుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్రం విడుదల చేసిన వెనువెంటనే పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి. ఈ ప్రక్రియను గత ప్రభుత్వం తుంగలో తొక్కేసింది. ఐదేళ్లు నిధుల్లేక కనీసం పారిశుధ్య పనులను పల్లెల్లో నిర్వహించలేని దుస్థితిని పంచాయతీలు ఎదుర్కొన్నాయి. పంచాయతీలకు నిధులు జమ చేయాలని సర్పంచ్‌ల సంఘాలు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించినా పట్టించుకోకపోగా సర్పంచ్‌లను అణచివేసింది. వారే ఉద్యమించి మిన్నకుంటారే తప్ప వారు చేసేది ఏమి లేదన్న విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు వ్యవహరించింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని 1172 పంచాయతీలకు రూ.42 కోట్లకు పైగా పంచాయతీలకు జమచేయాల్సి ఉంది.


గ్రామ స్వరాజ్యం తీసుకొస్తున్నామని ఉదరగొట్టిన జగన్ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించారు. పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించివేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీ అధికారాలకు గండికొట్టింది. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభ్వుతం పీడీ ఖాతాకు బదిలీ చేసుకుంది. పంచాయతీల సర్పంచ్‌లు ఆందోళనను లక్ష్యపెట్టలేదు. సచివాలయాల నిర్వహణకు అయ్యే ఖర్చును స్థానిక సంస్థల నుంచి ముక్కుపిండి వసూలు చేసింది. ఇంతటితో ఆగక కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధుల విషయంలోనూ దుర్మార్గంగా వ్యవహరించిందని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కుల అమలు నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను తుంగలో తొక్కింది. మార్చిలో కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులు పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమ చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు బదిలీ చేసుకుంది. స్థానిక సంస్థల్లో ప్రజల మౌలిక వసతులకు సంబంధించిన పనులను చేపట్టాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగానికి మార్గదర్శకాలను నిర్దేశించింది. జలవనరులను పెంపొందించే కొనేందుకు చెరువులు, కుంటలు అభివృద్ధి, చెక్‌డ్యాంల నిర్మాణం, ఇంకుడు గుంతలు ఏర్పాటు, తాగునీటి పథకాల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగుదల, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ తదితర పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించింది. ఇందుకు విరుద్ధంగా ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం లాగేసుకుంది.

సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు అమల్లోకి తీసుకొచ్చిన వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల అధికారాలను హరించివేసింది. పంచాయతీ సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లా మార్చేసింది. రాజ్యాంగం ప్రకారం పంచాయతీలకు అన్ని హక్కులు కల్పించాలని ఆందోళన చేసిన సర్పంచ్‌లను ఉక్కుపాదంతో అణిచివేసింది. ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా ఓట్లు వేయించి సర్పంచ్‌లు కసి తీర్చుకున్నారు. ఆర్థిక సంఘం నిధులను వెను వెంటనే పంచాయతీల ఖాతాలకు జమ చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వ కొలువు దీరడంతో నిధులు విడుదల జరుగుతుందని సర్పంచ్‌లు ఆశిస్తున్నారు. కొత్త ప్రభుత్వం పంచాయతీల ఆర్థిక సంఘం నిధులపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

నేడు అమరావతికి చంద్రబాబు

- సీఎం హోదాలో నిర్మాణాల పరిశీలన
- వైసీపీ విధ్వంస ప్రజావేదిక నుంచే పర్యటన ప్రారంభం
- రాజధాని భవనాల స్థితిగతులను పరిశీలించనున్న ముఖ్యమంత్రి
- చంద్రబాబు భరోసా కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్న రైతులు



గుంటూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అమరావతి రూప శిల్పి చంద్రబాబు తన కలల రాజధానిని వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడుబెట్టిన తీరును గురువారం పరిశీలించనున్నారు. అత్యద్భుతంగా అమరావతిని నిర్మించేందుకు నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా నాడు చంద్రబాబు ప్రణాళికలు రూపొందించగా 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ దానిని పాడుపెట్టారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చంద్రబాబు తన రెండో పర్యటలో భాగంగా రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. రాష్ట్రానికి రెండు కళ్లగా ఉన్న పోలవరం, అమరావతిపై చంద్రబాబు దృష్టి సారించారు. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో అభివృద్ధికి నోచుకోక, అంధకారంలో మిగిలిపోయిన రాష్ట్ర రాజధాని దుస్థితిని పరిశీలించనున్నారు. జూన్ 12న ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ఆయన బాధ్యతలు తీసుకునేందుకు ఈ నెల 13న అమరావతిలోని సచివాలయానికి వచ్చారు. అమరావతిలో చంద్రబాబు అడుగుపెట్టినప్పటికీ, ఆ రోజు కేవలం బాధ్యతల స్వీకరణకు మాత్రమే పరిమితమయ్యారు. కాగా గురువారం అధికారిక హోదాలో అమరావతిలో పర్యటించనున్నారు. జూన్ 13న సచివాలయానికి వస్తున్న ఆయనకు అమరావతిలో రైతులు, మహిళల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. మంగళ హారతులు ఇస్తూ, పూల వర్షం కురిపిస్తూ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, ఆయనపై తన విశ్వాసాన్ని చాటుకున్నారు. ఈ పరిస్థితుల్లో గురువారం రాజధాని ప్రాంతంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన నష్టాన్ని పరిశీలించి చంద్రబాబు ఎలాంటి హామీ ఇస్తారోనని రైతులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అమరావతి పర్యటన అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.


నీటిలో మునిగివున్న పిల్లర్లు

పర్యటన ఇలా..

- ఉండవల్లిలోని ప్రజావేదిక పరిశీలన
- ఉద్దండరాయునిపాలెంలో శంకు స్థాపన ప్రాంతం
- సీడ్ యాక్సిస్ రోడ్డు దుస్థితి
- అధికారుల భవనాలు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాల పరిశీలన
- ఐకానిక్ టవర్స్ నిర్మాణ ప్రాంతం

● ప్రజావేదిక సాక్షిగా పర్యటన

ఐదేళ్లుగా ఆగిపోయిన అమరావతి నిర్మాణాన్ని, నిలిచిపోయిన పనులను ఆయన పరిశీలించనున్నారు. గత ప్రభుత్వ విధ్వంసానికి నాందీ ప్రస్థానంగా ఉన్న ఉండవల్లిలోని ప్రజావేదిక నుంచే చంద్రబాబు పర్యటన ప్రారంభమవుతోంది. అక్కడి నుంచి బయలుదేరి 2015 అక్టోబరు 22న ఉద్దండరాయునిపాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రాంతాన్ని చంద్రబాబు తొలుత సందర్శిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన మ్యూజియంను పరిశీలిస్తారు. ఆ తర్వాత సీడ్ యాక్సిస్ రోడ్డు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల భవనాలు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలను పరిశీలిస్తారు. ఐకానిక్ టవర్స్ నిర్మాణం కోసం పనులు మొదలు పెట్టిన ప్రాంతాన్ని చంద్రబాబు పరిశీలిస్తారు. వాటితోపాటు అమరావతిలో ఐదేళ్లుగా నిలిచిపోయిన ఇతర ప్రభుత్వ భవన సముదాయాలను చంద్రబాబు పరిశీలిస్తారు.

● ఘోరంగా దెబ్బతిన్న ప్రభుత్వ భవనాలు

ఐదేళ్ల వైసీపీ పాలనలో అమరావతి అడవిలా మారిపోయింది. రోడ్లు మొదలు, ప్రభుత్వ భవనాలు, రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ వాణిజ్య, నివాస ప్లాట్లు మొత్తం 20 అడుగుల ఎత్తున చిల్లకంపలతో నిండిపోయాయి. రాజధానిలో ప్రతి ప్రాంతాన్ని, ప్రతి కార్యాలయాన్ని కలుపుతూ సీడ్ యాక్సిస్ రోడ్డుతో పాటు ఉన్న డజన్ల కొద్దీ అంతర్గత రహదారులు ఘోరంగా దెబ్బతినిపోయాయి. రోడ్లు కుంగిపోయి, నెర్రెలు విచ్చి శిథిలమైపోయాయి. పలు ప్రభుత్వ భవనాలు పాకుడుపట్టి శిథిలమైపోయాయి. ఇనుము తుప్పు పట్టి పాడైపోయింది. దొంగల పాలైంది. ఐకానిక్ టవర్స్ కోసం 72 గంటల పాటు వేసిన పునాదులు నీటిపాలయ్యాయి. ఈ నేపథ్యంలో వాటిని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు ఎలాంటి మాస్టర్ ప్లాన్ వేస్తారు అనేది సర్వత్రా ఆసక్తిదాయకంగా ఉంది.

● రైతుల ఆశలు..

వైసీపీ ప్రభుత్వ పాలనలో రైతులు, మహిళలు నిత్య నరకం అనుభవించారు. అవమానాల పాలయ్యారు. వైసీపీ పాలన పోయి, కూటమి పాలన రావడంతో వారికి ఊరట లభించింది. అయితే గత ప్రభుత్వం తాలూకూ ఇబ్బందులు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. రైతులకు రావాల్సిన కౌలు ఇవ్వడం కోసం, వారికి న్యాయంగా దక్కాల్సిన రిటర్నబుల్ ఇళ్ల స్థలాలు, వాణిజ్య సముదాయాల స్థలాలు తమకు ఇవ్వడానికి సంబంధించి సీఎం చంద్రబాబు ఎలాంటి హామీ ఇవ్వబోతున్నారన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

● ప్రమాణానికి ముందు నుంచే పనులు పరుగులు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయక ముందు నుంచే అమరావతిలో పనులు పరుగులు మొదలు పెట్టాయి. జూన్ 4న కూటమి అద్వితీయ విజయాన్ని సొంతం చేసుకోవడం, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఖాయమవడంతో అమరావతిలో పనులు చకచకా ముందుకు సాగాయి. జంగిల్ క్లియరెన్స్ కోసం వందల కొద్దీ ఎక్స్‌కవేటర్లు, ట్రక్కులు రంగంలోకి దిగాయి. విద్యుత్ దీపాల వెలుగులతో సీడ్ యాక్సిస్ రోడ్డు సహా అమరావతి ధగధగలు ప్రపంచాన్ని తాకాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు పర్యటన తమ జీవితాల్లో ఎలాంటి వెలుగులు తేబోతోందోనన్న ఆశతో రైతులు, మహిళలు, రాజధానివాసులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.


జగన్ ప్రభుత్వ హయాంలో కూల్చివేసిన ప్రజావేదిక


రాజధాని ప్రాంతంలో దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం


కంపచెట్ల మధ్య నిర్మాణ దశలో నిలిచిపోయిన భవన సముదాయం

ఘనంగా పట్టభద్రుల వేడుక

- ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ 56వ స్నాతకోత్సవం
- 1576 మంది విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లు అందజేత

బాపట్లరూరల్, జూన్19: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 56వ వ్యవసాయ స్నాతకోత్సవం బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలోని బీవీ నాథ్ ఆడిటోరియంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి అధ్యక్షత వహించిన ఈ సభకు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యఅతిథి డాక్టర్ ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ సెక్రటరి డాక్టర్ హిమాన్షు పాఠక్ హాజరై పట్టభద్రులకు పట్టాలను అందజేశారు. సభకు అధ్యక్షత వహించిన శారదా జయలక్ష్మీదేవి మాట్లాడుతూ శాస్త్రవేత్తల పరిశోధనలు, విస్తరణ సేవలు, విద్యార్థుల ప్రతిభకుగాను ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలో 20వ స్థానంలో నిలిచిందన్నారు. ఏఎన్‌జీఆర్ఏయు పీజీ స్కాలర్‌షిప్ అవార్డును అందుకుందన్నారు. ఏఎన్‌జీఆర్ఏయు వ్యవసాయ డ్రోన్ పైలెట్ శిక్షణ సంస్థగా డీజీసీఏ సర్టిఫికెట్ పొందిన మొదటి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయమన్నారు. ఇప్పటివరకు 20బ్యాచ్‌ల డ్రోన్‌పైలెట్ శిక్షణ పూర్తయింది. 361 డీజీసీఏ అధీకృత వ్యవసాయ డ్రోన్ పైలెట్‌లను తయారు చేయటం జరిగిందని తెలిపారు. డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ రైతు సమాజానికి ఎనలేని సేవలందించిన ఈ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని సందర్శించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో అభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాలలో కూడా మంచి పేరొందని తెలిపారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే బోధన సిబ్బందిని, శాస్త్రవేత్తలను అభినందించారు.


ప్రసంగిస్తున్న ముఖ్యఅతిథి డాక్టర్ ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డేర్ సెక్రటరి డాక్టర్ హిమాన్షు పాఠక్

1576మందికి డిగ్రీ పట్టాలు

స్నాతకోత్సవంలో భాగంగా మొత్తం 1576 మంది విద్యార్థు డిగ్రీ పట్టాలు అందుకున్నారు. వీరిలో 895 ప్రత్యక్షంగా, 681 పరోక్షంగాను అందుకున్నారు. తాము పడ్డ కష్టానికి ఫలితంగా పట్టాలు అందుకోవటంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఏజీ కళాశాల ఆవరణం మొత్తం పట్టాలు అందుకోవటానికి వచ్చిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు రావటంతో సందడి వాతావరణం నెలకొని ఉంది.




పట్టభద్రులైన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

పాల వెల్లువకు.. చెక్

- అమూల్ స్కీమ్‌ను ఆపేసిన ప్రభుత్వం
- ప్రభుత్వ ఆదేశాలపై పాడి రైతుల హర్షం



బాపట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ప్రయోజనాలను తాకట్టుపెట్టి వైసీపీ ప్రభుత్వం ప్రమోట్ చేసిన అమూల్ పాల వెల్లువ పథకాన్ని కూటమి ప్రభుత్వం ఆపేసింది. జగనన్న పాల వెల్లువ అనే పథకాన్ని ఆ సంస్థ ప్రయోజనాల కోసమే రూపొందించి సహకార డెయిరీలను జగన్ ప్రభుత్వం చావుదెబ్బ కొట్టిందన్న విమర్శలున్నాయి. పాడి రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను కూడా బేఖాతరు చేస్తూ పాలవెల్లువ పథకాన్ని జగన్ ప్రభుత్వం కొనసాగించింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో అమూల్ పాలవెల్లువ పథకాన్ని ఆపేస్తున్నట్లు ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలపై పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

ఎన్నో ప్రగల్భాలతో ప్రజాధనం దుర్వినియోగం

జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అరచేతిలో వైకుంఠాన్ని వైసీపీ ప్రభుత్వం చూపించింది. జిల్లాలో 38 కేంద్రాలను పాల సేకరణ కోసం అమూల్‌తో కలిసి వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. దీనిలో 20 కేంద్రాలు నెలల వ్యవధిలోనే మూతపడగా 18 మాత్రం అరకొరగా కొనసాగుతున్నాయి. వీటి ద్వారా సేకరిస్తున్న పాలు 1200 లీటర్లలోపే కావడం గమనార్హం. దీని కోసం వైసీపీ ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. ఓ వైపు ఉన్న కేంద్రాలకే రైతుల నుంచే స్పందన లేక పోతే కొత్తగా మరో 90 కేంద్రాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామనే ప్రగల్భాలకు ఆరు నెలల క్రితం వైసీపీ తెరలేపింది. ఈ క్రమంలో బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు పేరిట కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వైసీపీ దుర్వినియోగం చేసింది. రైతులకు బిల్లులు చెల్లించడం మొదలు సిబ్బందికి జీతాల వరకు అడుగడుగునా నిర్లక్ష్యాన్ని గత ప్రభుత్వం ప్రదర్శించింది. సహకార డెయిరీల ద్వారా సజావుగా సాగుతున్న పాల సేకరణను అమూల్ రాకతో అస్తవ్యస్తం చేసిన ఘనత గత పాలకులకే దక్కింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో పాలసేకరణను తిరిగి గాడిన పెట్టడంతో పాటు పాడి రైతుల మేలు కోసం అమూల్ పాలవెల్లువ పథకాన్ని క్లోజ్ చేస్తున్నట్లు ఉత్తర్వులిచ్చింది. ఎక్కడైనా కేంద్రం నడుస్తుంటే మాత్రం అభ్యంతరం తెలపబోమని కానీ ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి సహకారం ఉండబోదనేది ఆదేశాల సారాంశం.

మద్దతు.. మొక్కుబడే

- వరికి క్వింటాకు రూ.117 పెంపు
- కేంద్రం మద్దతు ధరపై రైతుల్లో ఆగ్రహం
- సాగు వ్యయానికి పొంతన లేకుండా నిర్ణయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గిట్టు బాటు ధర లేదు.. కనీసం మద్దతు ధర అయినా సాగు వ్యయానికి తగ్గట్లుగా ఉంటుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. ధాన్యం క్వింటా మద్దతు ధరను రూ.117 మాత్రమే పెంచి కేంద్ర ప్రభుత్వం చేతులు దులుపుకుంది. డీజిల్, ఎరువులు, పురుగుమందులు, కూలీ ధరలు పెరిగిన స్థాయిలో మద్దతు ధర పెంచకపోవడంపై అన్నదాతల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది. సాగు వ్యయం ఆధారంగా మద్దతు ధర పెరుగుతుందని ఆశ పడిన వారికి నిరాశే మిగిలింది. వ్యవసాయ అవసరమైన డీజిల్ నుంచి ఎరువుల వరకు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని ఎంతో కాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నా పాలకులు పట్టించుకోలేదని తాజా మద్దతు ధరలతో అర్థమవుతుంది. గత ఖరీఫ్‌లో క్వింటా ధాన్యం మద్దతు ధర రూ.2183 ఉండగా ప్రస్తుతం దానిని రూ.2300కి పెంచారు. రూ.500 నుంచి 600 వరకు పెంచి ఉంటే మేలు జరిగి ఉండేదని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధరపై కేంద్రం పునరాలోచన చేయాలని రైతులు కోరుతున్నారు.

కందులు, పత్తికి పర్వాలేదు..

కందులకు మద్దతు ధర క్వింటాకు రూ.7000 నుంచి రూ.7550, పత్తికి క్వింటాకు రూ.6620 నుంచి రూ.7121కి పెరిగింది. కందులు క్వింటాకు రూ.550, పత్తికి క్వింటాకు రూ.501 మద్దతు ధర పెంచడం పర్వాలేదని రైతులు అంటున్నారు. మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.2090 నుంచి 2225కి పెంచారు. అంటే క్వింటాకు రూ.135 నామమాత్రంగా పెంచారని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న, పత్తి, కందికి కూడా ఇంకా మద్దతు ధర పెంచాలని రైతులు కోరుతున్నారు. ఎరువుల సబ్సిడీని పెంచాలని, పురుగు మందుల ధరలు తగ్గించాలని రైతులు కోరుతున్నారు.

కష్టంగా కౌలు సాగు..

పంటల సాగు గిట్టుబాటు కాకపోవడంతో పొలాలు కౌలుకు తీసుకునేందుకు కూడా రైతులు ముందుకు రావడంలేదు. ఇబ్బడిముబ్బడిగా సాగు వ్యయం పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. పంటల సాగుకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీలను ప్రభుత్వం ఎత్తివేసింది. గతంలో జింక్, బోరాన్ తదితర పోషకాలను ఉచితంగా పంపిణీ చేసేవారు. వీటిని ఎత్తివేశారు. సాగుకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను నిలిపివేశారు. వ్యవసాయానికి ఉన్న సబ్సిడీలను అన్నింటినీ తగ్గించి వేశారు. ఈ కారణాలతో వరి సాగు వ్యయం భారీగా పెరిగింది. గిట్టుబాటు ధర కల్పించలేని ప్రభుత్వం కనీసం మద్దతు ధరనైనా పెంచితే రైతులకు మేలు జరిగి ఉండేది.



అద్దంకిలో.. నకిలీ పట్టాలు

- పేదలకు అంటగట్టి సొమ్ము చేసుకున్న వైసీపీ నేతలు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు టీడీపీ సిద్ధం

అద్దంకి, జూన్ 19: అద్దంకిలో నకిలీ పట్టాలు కలకలం రేపుతున్నాయి. అద్దంకిలోని ఎన్టీఆర్ నగర్, టైలర్స్ కాలనీ, కలవకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. అయితే వాటి సంరక్షణపై రెవెన్యూ అధికారులు పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో కొందరు వైసీపీ నేతలకు వరంగా మారింది. ఈ క్రమంలో ఆ స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి ఒక్కో ప్లాటు లక్షన్నర నుంచి రూ2 లక్షల వరకు అమ్మకాలు చేసినట్లు తెలుస్తుంది. సుమారు 50కిపైగా ఇళ్ల స్థలాల పట్టాలు సృష్టించి అమ్మకాలు చేసినట్లు సమాచారం. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయించాలన్న ఉద్దేశంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలపై ఆరా తీయడం ప్రారంభించారు. దీంతో నకిలీ పట్టాలతో వైసీపీ నాయకుల వద్ద స్థలాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులు పరుగులు తీశారు. వారి వద్ద ఉన్న ఇళ్ళ స్థలాల పట్టాల జిరాక్స్‌లను తీసుకుని పరిశీలించగా అవి నకిలీ పట్టాలుగా తేలింది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులకు నకిలీ పట్టాలపై ఫిర్యాదు చేసేందుకు టీడీపీ నేతలు సిద్ధం అవుతున్నారు. నకిలీ పట్టాలు సృష్టించిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తే నకిలీ పట్టాల బాగోతం మరింత వెలుగు చూసే అవకాశం ఉంది.

విధుల బాధ్యత మీది.. నిధుల బాధ్యత మాది

నెలలో నియోజకవర్గంలో నాలుగు విద్యుత్ స్టేషన్లకు శ్రీకారం : ఎమ్మెల్యే కొండయ్య


చంద్రబాబుతో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 19 : సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే కొండయ్య మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. చీరాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం పలు శాఖల అధికారులతో కొండయ్య సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఆ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ విధులను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత మీది. అందుకు అవసరమైన నిధులను సమకూర్చే బాధ్యత మాది. సమిష్టి కృషితో మెరుగైన పాలన ప్రజలకు అందిద్దామని స్పష్టం చేశారు. ప్రధానంగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో నాణ్యమైన విద్యుత్, నిరంతరాయంగా అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. విద్యుత్‌శాఖ సీఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ క్రమంలో నెలలోపు నియోజకవర్గంలో నాలుగు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు అనుమతి లభించించినట్లు చెప్పారు. వేటపాలెం మండలం రామాపురంలో ఒకటి, విఘ్నేశ్వరకాలనీలో ఒకటి, చీరాల మండలం గవినివారిపాలెంలో ఒకటి, చీరాల మున్సిపల్ పరిధిలో మరో సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన కార్యాచరణకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ఇరిగేషన్, డ్రైయినేజీ, వ్యవసాయశాఖల అధికారులు కూడా రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. టెక్స్‌టైల్, హ్యాండ్లూమ్ అధికారులతో మాట్లాడి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

సింథైట్ ఫ్యాక్టరీ పరిశీలన

కోరు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారుల ఆదేశం


ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న చీరాల ఆర్‌డీవో

వేదరమెట్ల జూన్ 19 : ప్రజలకు ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలను తీసుకొని ఫ్యాక్టరీని నడుపుకోవాలని ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మేదరమెట్లలో సింథైట్ ఫ్యాక్టరీని ఆర్‌డీవో, పొల్యూషన్ కంట్రోలు బోర్డు ఈఈ రాఘవరెడ్డి తహసీల్దారు బీ సుశీల తదితరులు పరిశీలించారు. మిరప కాయల నుంచి ఆయిల్ రంగు తీసే యంత్రపరికరాలను బాయిలర్స్‌ను అధికారులు పరిశీలించారు. ఫ్యాక్టరీకి సంబంధించిన అన్ని అనుమతి పత్రాలను ఆర్‌డీవో పరిశీలించారు. ఫ్యాక్టరీలో కోరు రాకుండా చేపట్టిన చర్యలు గురించి ఫ్యాక్టరీలో పని చేసే ఉద్యోగులు వారికి వివరించారు. గతంలో కోరు ఎక్కువగా వచ్చేదని సుమారు కోటిన్నర రూపాయలతో స్క్రబ్బర్స్ బిగించామని వివరించారు. కోరు రాకుండా ప్రజలు ఇక్కడకు ఎందుకు వస్తారని వారు ప్రశ్నించారు. మీరు ఇన్నిరోజులు నడుపుతున్నా ప్రజలు ఫ్యాక్టరీ వద్దకు రాలేదు కదా, వారికి ఇబ్బంది కలిగితేనే కదా ఇక్కడకు వచ్చిందన్నారు. అందువలన అన్ని జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా ఫ్యాక్టరీలను నడుపుకోవాలని సూచించారు. బాయిలర్‌లో వాడుతున్న మిరప వ్యర్థాలను వాడవద్దని రాఘవరెడ్డి వారికి చెప్పారు. దీనిపై వారికి నోటీసు కూడా ఇచ్చారు. వరి పొట్టుతోనే బాయిలర్లు నడపాలన్నారు. కారప్పొడి గాలిలో కలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంకోసారి ఇలాంటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వారి వెంట సర్వేయర్ మహేష్ బాబు, ఆర్ఐ పోతురాజు, వీఆర్వో రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.


గ్రామస్థుల అదుపులో యువకులు

చోరీలకు పాల్పడుతూ చిక్కిన వైనం


వెంపరాలలో గ్రామస్థులు అదుపులోకి తీసుకున్న దొంగలు

అద్దంకి, జూన్ 19 : చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు యువకులను వెంపరాల గ్రామస్థులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంపరాలలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో నిర్మాణంలో ఉన్న కోళ్లఫారం షెడ్‌ల వద్ద దొంగలు తమతో తీసుకువచ్చిన ఆటో లోకి నిర్మాణ సామగ్రిని దొంగిలించి ఎత్తుతున్నారు. ఆ సమయంలో ఉప్పలపాడు నుంచి వెంపరాల వస్తున్న గ్రామస్థులు చోరీకి పాల్పడుతున్న యువకులను గమనించారు. అనుమానంతో ఆటోలో పరిశీలించగా కోళ్ల ఫారం షెడ్‌కు వినియోగించే సామగ్రి ఉన్నాయి. ఆరుగురు యువకులు చోరీకి వచ్చినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా చినకొత్తపల్లి ఎస్సీ కాలనీకి చెందినవారుగా తెలిపారు. వెంటనే ఆటోను కూడా అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారం అందించారు.యువకులను, ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల షైలవరంలో వెంపరాలకు చెందిన యువకులు ఎత్తిపోతల పథకం మోటార్‌లను చోరీ చేసి వినుకొండకు ఆటో లో తరలిస్తుండగా షైలవరం గ్రామస్థులు అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. గ్రామాలలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికి తీరిందా!



పంటలు లేని సమయంలో పరిశీలన

నేడు కేంద్ర బృందం పర్యటన

ఖరీఫ్ ప్రారంభమయ్యాక గత రబీ నష్టాలు చూసేందుకు అధికారులు

ఎన్నికల హడావుడిలో కరువు గోడు పట్టించుకోని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు

అపారనష్టం జరిగినా కరువు జాబితా ప్రకటనలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

నివేదికలతోపాటు ముఖాముఖికి యంత్రాంగం ఏర్పాట్లు

ఒంగోలు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరువు కోరల్లో చిక్కుకొని పంటలు పండక, తాగేందుకు నీరు లేక ప్రజలు, పశువులు గగ్గోలుపెట్టగా తక్షణ చర్యలు తీసుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. గత రబీ సీజన్ కరువు కష్టాలు, నష్టాల పరిశీలనకు ఇప్పుడు కేంద్ర అధికారుల బృందం జిల్లాకు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌హెచ్ సందీప్‌శర్మ నేతృత్వంలోని నలుగురు సభ్యులతో కూడిన బృందం బుధవారం రాత్రికి ఒంగోలుకు చేరుకుంది. ఆ బృందం సభ్యులు గురువారం ఉదయం ప్రకాశం భవన్‌లో కలెక్టర్, ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి కరువు తీవ్రతను తెలియజేస్తూ ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తారు. అనంతరం బయలుదేరి పశ్చిమప్రాంతానికి వెళ్తారు. తర్లుపాడు, మార్కాపురం, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడి కరువు సమయంలో వారు పడిన ఇక్కట్లను అడిగి తెలుసుకుంటారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..

నిండు వర్షాల కాలమైన రబీ సీజన్‌లో 70 హ్యాబిటేషన్లలో ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాల్సి రాగా ప్రస్తుతం కూడా పశ్చిమప్రాంతంలోని 92 హ్యాబిటేషన్లలో నీటిని తోలుతున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో రబీ సీజన్ కరువు పరిస్థితులు పరిశీలన పేరుతో కేంద్రప్రభుత్వ అధికారుల బృందం జిల్లాకు వస్తున్నారు. నిజానికి ఈ బృందం మార్చిలోనే రావాలి. అలా రావాలంటే ఫిబ్రవరిలోనే రాష్ట్రప్రభుత్వం కరువు స్థితిని కేంద్రానికి నివేదించాలి. అయితే నాటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎన్నికలకు ముందు హడావుడిగా మార్చి 7న కరువు మండలాలను ప్రకటించింది. ఆ తర్వాత ఎన్నికల హడావుడిలో కేంద్రం నుంచి బృందాలు రాష్ట్రానికి రాలేదు. ఆ ప్రక్రియ ముగిశాక ప్రస్తుతం వచ్చాయి. కాగా మార్చి 7న ప్రకటించిన జాబితాలో జిల్లాలోని 38కిగాను 31 కరువు మండలాలుగా ప్రకటించారు. వాటిలో 22 మండలాల్లో 36,147 మంది రైతులకు చెందిన 29,713 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు నివేదించారు. అలాగే ఇరిగేషన్, తాగునీరు, ఉపాధి పనుల కల్పన తదితర అంశాలపై కేంద్ర బృందానికి నివేదించనున్నారు. ఆ నివేదికలను పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలతో బృందం అధికారులు ముఖాముఖీ మాట్లాడేలా అధికారులు కార్యక్రమాన్ని రూపొందించారు.

సీజనంతా లోటు వర్షపాతం

వాస్తవానికి గతేడాది (2023-24) ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ సకాలంలో వర్షాలు కురవక పంటల సాగు ముందుకు సాగలేదు. ప్రత్యేకించి రబీ సీజన్ పూర్తి ప్రతికూలంగా సాగింది. పంటలు సాధారణంగా అక్టోబరు నుంచి డిసెంబరు వరకు వేస్తారు. జిల్లాలో సాధారణ వార్షిక వర్షపాతం 751.50 మి.మీ కాగా రబీ సీజన్ ఉండే మూడు నెలల్లో 384.8 మి.మీ కురుస్తుంది. అయితే గత రబీ సీజన్‌లో 44.36శాతం లోటుతో కేవలం 214.10 మి.మీ మాత్రమే కురిసింది. ప్రత్యేకించి ఏడాది మొత్తం మీద అత్యధికంగా వర్షం కురిసే అక్టోబరులో 94శాతం లోటు ఏర్పడింది. ఆ నెలలో సాధారణ వర్షపాతం 205 మి.మీ కాగా కేవలం 12.10 మి.మీ మాత్రమే కురిసింది. ఫలితంగా జిల్లాలో ఎక్కడా ఒక్క చెరువులోకి కూడా నీరు చేరకపోగా చాలాచోట్ల భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండిపోయాయి. మరోవైపు సాగర్ నీరు కూడా రాలేదు. దీంతో ముమ్మరంగా పంటలు సాగు కావాల్సిన సమయంలో వర్షాలు లేక, సాగర నీరు రాక, చెరువుల్లో నీరు లేక సాగు ముందుకు సాగలేదు.

రబీ సీజన్ పూర్తయి మూడు నెలలు దాటింది.. వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు అరకొర పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకున్నారు.. వచ్చినకాడికి అమ్ముకున్నారు. తీరా ఇప్పుడు అధికారులకు కరువు గుర్తొచ్చింది. తీరికగా మళ్లీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న వేళ పరిశీలనకు బయలుదేరారు. నిజానికి కరువు బృందాలు తొలి ప్రాధాన్యత పంట నష్టాలు పరిశీలన చేయాలి. అయితే కరువు జాబితా ప్రకటించడంలో గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యంతో ఖరీఫ్ సీజన్ పంటల సాగు సమయంలో ఒక్కచోట కూడా పంట లేని రబీ నష్టాల పరిశీలనకు కేంద్రప్రభుత్వ బృందం రావాల్సి వచ్చింది. మరి వారు ఏం చూస్తారో.. ఏ మేరకు సాయం చేస్తారో అని రైతులు వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు.

రూ.350 కోట్ల మేర రాబడి పోయింది

రబీలో లక్షా 72వేల హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా లక్షా 23వేల హెక్టార్లలో మాత్రమే సాగైంది. ప్రధాన పంటలలో ఒక్క పొగాకు మాత్రం కాస్తంత అధికంగా వేయగలిగినా కీలకమైన శనగ, మినుము, వరి, మిర్చి వంటి పంటలను సగం విస్తీర్ణంలో కూడా సాగు చేయలేకపోగా వేసిన పంటలు కూడా వర్షాలు లేక దిగుబడులు తగ్గాయి. అలా వేలాది హెక్టార్లలో పంటలు సాగు కాక సాగైన పంటలు దిగుబడులు సరిలేక జిల్లా రైతాంగం రబీ సీజన్‌లో దాదాపు రూ.350 కోట్ల మేర రాబడిని కోల్పోయారు. ఇక నీటి వనరుల పరిస్థితి పరిశీలిస్తే జిల్లాలో ప్రధాన సాగు, తాగునీటి వనరైన సాగర్ కాలువలో సాగుకు ఒక్క చుక్క నీరు రాలేదు. మోపాడు, కంభం చెరువుల, మధ్యతరహా వనరులుగా ఉండగా ఆ రెండింటి నీటి సామర్థ్యం 5.10 టీఎంసీలు కాగా కేవలం 0.60 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇక సుమారు 9.30 టీఎంసీల నీటి సామర్థ్యం ఉన్న 799 చెరువులు ఉండగా వాటిలో పట్టుమని పదిశాతం చెరువుల్లో కూడా నీరు లేదు. అలా వర్షాలు లేక, చెరువుల్లో నీరు లేక, సాగర్ కాలువలు రాక భూగర్భజలాలు అడుగంటి తాగునీటికే కాక సాధారణ వాడకానికి కూడా నీరు లేక ప్రజానీకం అల్లాడిపోయారు.

కదిలిన పొగాకు మార్కెట్

కిలో రూ.343 పలికిన గరిష్ఠ ధర

మీడియం, మేలురకం తేడా లేకుండా కొనుగోలు, బ్రౌన్‌కు డిమాండ్

ఇప్పటివరకు 70 మిలియన్లు కొనుగోలు

కిలో రూ.254 లభించిన సగటు ధర

ఒంగోలు, జూన 19(ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్లో మరోసారి కదలిక వచ్చింది. గరిష్ఠ ధర బుధవారం కిలో రూ.343 పలికింది. ఒంగోలు-1 కేంద్రంలో ఈ ధర లభించగా ఇతర కేంద్రాల్లోనూ రూ.240కి అటుఇటుగా లభించాయి. పక్షంరోజుల క్రితం ఏకంగా కిలో రూ.360కిపైగా పలికింది. అనంతరం కీలకమైన వ్యాపారులు అప్రమత్తమై కూటమి కట్టి ధరలు తగ్గించి వేశారు. అలా గడిచిన పక్షంరోజులుగా కిలో గరిష్ఠ ధర రూ.330గా ఉంటూ వస్తోంది. ఒకటి, రెండు బేళ్లకు ఎక్కడైనా రూ.332 పడుతున్న సీలింగ్ పెట్టినట్లు అధిక బేళ్లను రూ.330కే కొనుగోలు చేస్తున్నారు. అయితే బుధవారం నాటి మార్కెట్లో వ్యాపారులు సిండికేట్ సడలింది. పలు గ్రేడ్‌ల బేళ్ల కోసం వివిధ కంపెనీల బయ్యర్లు పోటీపడ్డారు. ఈ క్రమంలో గరిష్ఠ ధర తొలుత కిలో రూ.335 తర్వాత రూ.340 పలికి చివరకు రూ.343కు చేరింది. పలువురు డీలర్లు, ఒకటి రెండు ఎక్స్‌పోర్టు కంపెనీలు ఇలా ధరలు పెంచగా మార్కెట్‌ను శాసించే ఐటీసీ కూడా వారిని అనుసరించక తప్పలేదు. ఆ కంపెనీ కూడా కిలో రూ.340 వరకు ధర ఇచ్చింది. మేలు రకంతోపాటు మీడియం బేళ్లను కూడా అదే ధరలకు పలువురు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అలాగే లోగ్రేడ్‌లో నాణ్యతగా భావించే బ్రౌన్ రకానికి మంచి డిమాండ్ కనిపిస్తోంది. నాలుగైదు రోజుల క్రితం ఆ రకాన్ని రూ.285 నుంచి రూ.290 వరకు కొన్నారు. కాగా ఇప్పటివరకు దక్షిణాదిలోని 11 వేలంకేంద్రాల్లో సుమారు 70 మిలియన్ కిలోలు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.254 ధర లభించింది. ప్రస్తుతం మార్కెట్ తీరు చూస్తే సగటు ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

రేపు ఒంగోలు-2లో ఏరువాక

ఏటా సంప్రదాయంగా పొగాకు రైతులు నిర్వహించే ఏరువాక కార్యక్రమం ఈనెల 21న నిర్వహిస్తున్నారు. ఆ రోజున ఉదయం 9 గంటలకు ఒంగోలు-2 వేలం కేంద్రం వద్ద ఈ కార్యక్రమం జరగనుంది. పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్, వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు పాల్గొనున్నారు.

బెదిరింపుపై ఫిర్యాదు

చీరాలటౌన్, జూన్ 19 : ప్లే స్కూల్ యాజమన్యాన్ని గుర్తుతెలియని పీడీఎఫ్ విలేకరులు బెదిరించడంపై యాజమాన్యం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఉదంతం బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం... గత ఐదేళ్లుగా పట్టణంలో ఓ వ్యక్తి నర్సరీ నుంచి యూకేజీ వరకు సుమారు 25 మందితో ప్లే స్కూల్‌ను నడుపుతున్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం పలుమార్లు యాజమాన్యానికి ఓ వ్యక్తి నేను పీడీఎఫ్ విలేకరినంటూ, మీ లొసుగులన్నీ తెలిసని ఫోన్ చేసి బెదిరించాడు. అంతేకాకుండా వాట్సాప్‌కు స్కానర్‌ను పోస్ట్ చేసి నగదు పంపాలని బెదిస్తున్నారు. దీంతో చేసేదేమీలేక బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు విచారణ ప్రారంభించారు.

వాడరేవు రోడ్డులో ఆటో బోల్తా

మత్స్యకారుడు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం

చికిత్స పొందుతున్న విద్యార్థిని, మహిళ


మస్తాన్ (ఫైల్)

వాడరేవు(చీరాలటౌన్), జూన్ 19 : బుధవారం మధ్యాహ్నం చీరాల - వాడరేవు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వాడరేవుకు చెందిన కొక్కిలిగడ్డ చిన మస్తాన్ (65) మత్స్యకారుడు, డ్వాక్రా గ్రూపు లీడర్ ఓసిపిల్లి దేవి, రోజు కూలీ సిరిపిల్లి లావుతల్లి, విద్యార్థినులు కుమారి, రాజేశ్వరి, ఉమ వాడరేవుకు వెళ్లేందుకు గ్రామానికి చెందిన సంగడి ఇమ్మానియేల్ ఆటో ఎక్కారు. ఆటో మండల పరిధిలోని బుర్లవారిపాలెం అడ్డరోడ్డు దగ్గరకు వచ్చేసరికి ఒక్కసారిగా టైర్ పగిలింది. దీంతో డ్రైవర్ ఆటోను అదుపు చేయలేక పోయాడు. ఈనేపథ్యంలో రోడ్డు పక్కన ఉన్న బుర్లవారి పాలెం బస్ షెల్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో మస్తాన్(65) అక్కడికక్కడే మృతిచెందగా, ఆటోడ్రైవర్ ఇమ్మానియేల్, లావుతల్లి, దేవి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే విద్యార్థుల్లో కుమారి తలకు రక్త గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వీరిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం లావుతల్లిని ఒంగోలు రిమ్స్‌కు, ఇమ్మానియేల్, కుమారిను చీరాలలోని వేర్వేరు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. డ్వాక్రా గ్రూప్ లీడర్ దేవి ముక్కుకు దెబ్బ తగలడంతో శస్త్ర చికత్స అనంతనం ఒంగోలుకు తరలించారు. విషయం తెలసుకున్న వాడరేవ గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాస్పిటళ్ల వద్దకు చేరి బోరున విలపించారు. టూటౌన్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి మస్తాన్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.


చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ ఇమ్మానియేల్

వైసీపీ ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలూ సర్వనాశనం


మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన ఎంపీ మాగుంట, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ సునీల్, ఎమ్మెల్యేలు దామచర్ల, ఉగ్ర

ప్రజలను మభ్యపెట్టేందుకే వెలిగొండ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం

మల్లవరం ప్రాజెక్టుకు జీవోలతోనే సరిపెట్టిన జగన్‌రెడ్డి సర్కారు

తాగునీటి సరఫరాలోనూ అవినీతి, అక్రమాలు

సమీక్షలో బయటపడిన అధికారుల డొల్లతనం

స్నేహపూరిత వాతావరణంలో పనిచేద్దాం

బాబు లక్ష్యాలకు అనుగుణంగా ముందుకెళ్దాం

అధికారులతో మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 19: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలను నాశనం చేయడమే కాకుండా ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలోనూ పూర్తిగా విఫలమైందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ధ్వజమెత్తారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో మంత్రి, ఎమ్మెల్యేలకు జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం జరిగింది. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వైద్య, విద్యా, వ్యవసాయశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గత ప్రభుత్వ హయంలో చేపట్టిన వివిధ రకాల పనుల డొల్లతనాన్ని సంబంధిత అధికారులే ప్రస్తావించడంతో మంత్రి స్వామితోపాటు ఎమ్మెల్యేలు కూడా అవాక్కయ్యారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జిల్లా ప్రజలను మభ్యపెట్టేందుకు హడావుడిగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రారంభోత్సవం చేశారని మండిపడ్డారు. ఒకవైపు లైనింగ్ పనులు జరుగుతుండగా, ఇంకొకవైపు పునరావాసానికి అవసరమైన నిధులు కూడా మంజూరు చేయలేదని తెలిపారు. 2020లో మల్లవరం ఒక గేటు కొట్టుకొని పోగా ఆ పనిని చేపట్టకముందే మరో గేటు కూడా కొట్టుకుపోయిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సాగు, తాగునీటికి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రాజెక్టుకు గేట్ల బాగుతోపాటు నిర్వహణ కోసం రూ.15కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు చేయలేదన్నారు. సత్వరమే ఆ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదటి ప్రాధాన్యతగాను, రెండోదిగా వెలిగొండ ప్రాజెక్టుకు తీసుకున్నారన్నారు. త్వరలోనే సీఎం సమీక్ష నిర్వహిస్తారని అలోపు సమగ్ర నివేదికను తయారుచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్య కూడా తీవ్రంగా ఉన్నందున ప్రజలకు అవసరమైన మేరకు నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చంద్రబాబు ప్రభుత్వంలో జరిగే అభివృద్ధి, సంక్షేమం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. మరోవైపు వైద్యశాఖ సమీక్షలో కూడా డొల్లతనం బయటపడింది. సీజనల్ వ్యాధులపై జరుగుతున్న సర్వే ఎక్కడ నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులు, వైద్యశాఖల మధ్య సమన్వయం లేకపోతే ఎలా అని మంత్రి ప్రశ్నించారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అయా అంశాలపై తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ జిల్లాలో పోలీస్‌శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

15 రోజుల నుంచి తాగునీరు ఇవ్వక పోతే ఎలా?

ఒంగోలు రూరల్ మండల గ్రామాల్లో మోటార్లు పాడై 15రోజుల నుంచి నీరు రాకపోవడంతో ప్రజానీకం అల్లాడిపోతున్నారని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీరు సరఫరా చేయాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. మరోవైపు ఒంగోలులో గుడిసెవాసులు నివాసముంటున్న రైల్వే స్థలాల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికశాఖలో పనిచేసే ఒక ఉద్యోగిపై చనిపోయిన వ్యక్తి ఫిర్యాదు చేస్తే ఏ విధంగా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు ఎన్నికల సమయంలో సస్పెండ్ చేసే అధికారం ఉందా? అని ప్రశ్నించారు. ఆ ఉద్యోగిని అద్దంకిలో నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికశాఖ అధికారిని ఆదేశించారు.

ఈ ఏడాది మెడికల్ కాలేజీ ప్రారంభించాలి

ఈ ఏడాది మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట అధికారులను ఆదేశించారు. ప్రారంభించకపోతే వంద మెడికల్ సీట్లు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. మరోవైపు గిద్దలూరు, సూరారెడ్డిపాలెం, టంగుటూరులలో రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలతోపాటు ఒంగోలులో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రిపుల్‌ఐటీ ఏర్పాటు విషయంలోనూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పునరావాస ప్యాకేజీలో భారీ అక్రమాలు

వెలిగొండ ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీలో భారీ అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి కోరారు. కన్ని గ్రామాల్లో అనేకమందిని ఈ ప్యాకేజీలో చేర్చారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటి తోలకంలోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. తోలకుండానే బిల్లులు మంజూరు చేశారన్నారు. వీటన్నింటిని సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

మెయింటినెన్స్ బిల్లులకే ప్రాధాన్యత

ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైను లేకపోయినా మెయింటినెన్స్ బిల్లులు మంజూరుచేసేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని కనిగిరి ఎమ్మెల్యేఉగ్రనరసింహారెడ్డి మండిపడ్డారు. పైపులైన్ ద్వారా ఏ గ్రామానికైనా తాగునీరు ఇచ్చారా? అని ప్రశ్నించారు. నిర్మాణం పూర్తయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని ప్రజలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

3వేలమంది దొంగ పింఛన్‌దారులు ఉన్నారు

గిద్దలూరు నియోజకవర్గంలో దొంగ సర్టిఫికెట్లు తెచ్చుకొని పింఛన్లు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. ఒక్కొక్కరు రూ.50వేలు ఖర్చుపెట్టి దివ్యాంగ ధ్రువీకరణపత్రం తెచ్చుకుంటున్నారని వివరించారు.వీటిపై సమగ్ర విచారణ చేసి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలా తన నియోజకవర్గంలో 3వేల సర్టిఫికెట్లు ఉన్నాయని తెలిపారు. అనంతరం పలు అంశాలను ప్రస్తావించారు.

ట్రిపుల్‌ఐటీని సంతనూతలపాడులో కొనసాగించాలి

ట్రిపుల్ ఐటీని ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ కోరారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు జరిగితే ఆ జిల్లాకు విద్యాసంస్థలతో పాటు వెలిగొండ, మెడికల్ కాలేజీ ఉంటుంది. అందువల్ల ప్రకాశం జిల్లాలో ఏమి ఉండదని, అందువల్ల ట్రిపుల్‌ఐటీని కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దర్శి, వైపాలెం ఇన్‌చార్జీలు గొట్టిపాటి లక్ష్మీ, ఎరిక్షన్‌బాబులు వారి నియోజకవర్గాల సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అప్పులఊబిలో ఎంపీడీవో కార్యాలయం

- ఎన్నికలకు ముందు వైసీపీ నేతలు ఇష్టానుసారంగా గ్రామాలలో మట్టి రోడ్ల నిర్మాణం
- నిధులు లేకున్నా మండల పరిషత్ ద్వారా రూ.1.22 కోట్లతో పనులు
- మరో రూ.72లక్షలకు వర్కు అర్డర్లు
- నాసిరకంగా చేపట్టిన రహదారులు
- ఖజానా ఖాళీ అయిందని తెలిసి ప్రజల విస్మయం




వల్లాపల్లిలో రోలర్ తిప్పకుండానే నాసిరకంగా వేసిన మట్టి రోడ్డు

బల్లికురవ, జూన్ 19 : వైసీపీ నేతల హడావుడితో మండల అభివృద్ధికి సంబంధించిన ప్రజా పరిషత్ కార్యాలయం అప్పులఊబిలోకి కురుకుపోయింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీకి చెందిన గ్రామ నేతలు కొందరు మండల పరిషత్‌లో నిధులు లేకున్నా ఇష్టానుసారంగా మట్టి రోడ్లు వేశారు. దీంతో సుమారు రూ.1.22 కోట్ల నిధులతో చేపట్టిన పనులకు మండల పరిషత్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. నిధులు లేకుండానే పనులు చేపట్టడం ఏమిటని పలువురు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నేతలు చేసిన హడావుడికి ఇప్పుడు చిల్లి గవ్వ కూడా లేదని ఇలా అయితే అభివృద్ధి పనులు ఎలా చేపడతారని ప్రజలు అంటున్నారు. ఇంకా చేయాల్సిన పనులకు సంబంధించి కూడా సుమారు రూ.72 లక్షలకు వర్కు అర్డర్లు తయారు చేసి ఇచ్చారని అసలు నిధులు లేకుండా వర్కు అర్డర్లు ఎలా ఇచ్చారని వైసీపీ మద్దతు దారులకు ఎన్నికల కోసమే ఇచ్చారనే ఆరోపణలున్నాయి.

బల్లికురవ మండల ప్రజాపరిషత్ కార్యాలయం ద్వారా గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులకు, ఎంపీడీవో కార్యాలయ మెయింటెన్స్‌కు, తాగునీటి అవసరాలకు ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను వినియెగించాల్సి ఉంది. ఏడాదికి సుమారు రూ.2కోట్ల మేర నిధులు సీనరేజ్ ద్వారా ప్రభుత్వం నుంచి కార్యాలయానికి వస్తుంటాయి. గతంలో నిధులతో కళకళలాడిన కార్యాలయం నేడు చిల్లి గవ్వ లేకుండా బోసిపోయింది. దీనికి కారణం వైసీపీ పాలనలో పార్టీ నేతలు, అధికారులు నిధులకు సరిపడా పనులకు అనుమతులు ఇవ్వాల్సి ఉండగా ఎన్నికలలో వైసీపీకి మద్దతు ఇచ్చే నేతలకు ఇష్టానుసారంగా నిబంధనలను తుంగలోకి తొక్కి కోట్ల నిధులన మట్టి రోడ్ల అభివృద్ధికి పెట్టారు. సుమారు రూ.కోట్ల మేర నిధులు డ్రా చేసుకోగా, ఇంకా మట్టి రోడ్లు వేసిన వైసీపీ నేతలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ద్వారా రూ.1.22 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటికి తోడు ఇంకా రూ.72లక్షల పనులకు వర్కు అర్డర్లు కూడా ఇచ్చి ఉన్నారు. అధికారులు కూడా వైసీపీ నేతలతో కుమ్మక్కై నిధులు లేకున్నా పనులు చేయించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రూ.3కోట్ల మేర నిధులు ఉన్న మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో స గం నిధులు డ్రా చేశారని ఇంకా సీనరేజ్ నిధులు వచ్చి ఉంటే వెంటనే మిగిలిపోయిన వాటిని కూడా డ్రా చేసి ఉండేవారని గ్రామాలలో కొందరు వైసీపీ నేతలు గత మూడు మాసాల కిందట వైసీపీ ఇన్‌చార్జిగా ఉన్న హనిమిరెడ్డిపై ఒత్తిడి తెచ్చి మరి మట్టిరోడ్లు వేసేలా నిధులు పెట్టించుకొన్నారని కొన్ని గ్రామాలలో ప్రతిపాదనలు ఎక్కువ చూసి తక్కువ నిధులతో పనులు చేపట్టి పెద్ద మెత్తంలో ఎంపీడీవో కార్యాలయ నిధులు డ్రా చేసుకున్నారని వెంటనే క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ జరిపితే ఎన్నికలకు ముందు వేసిన నాసిర రోడ్ల సంగతి తేలుతుందని టీడీపీ నేతలు అంటున్నారు. వైసీపీ నేతలు కావాలనే కార్యాలయంలో నిధులు లేకుండా చేయాలనే ఇలా మట్టి రోడ్లకు పెద్ద ఎత్తున నిధులు మంజురు చేయించుకున్నారని ఇందుకు బాధ్యత వహించిన అధికారులపై కూడా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిధులు లేక ఇప్పుడు చిన్న చిన్న అభివృద్ధి పనులకు కూడా నిధులు చెల్లించే పరిస్థితి లేదని వైసీపీ నేతల ఘనకార్యం వలనే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు వెంటనే గత నాలుగు నెలల వ్యవధిలో చేపట్టిన మట్టి రోడ్ల పనులు, వినియెగించిన నిధుల వివరాలపై విచారణ చేపట్టాలని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరుతున్నారు.

సీఎం బాబుతో ఏలూరి భేటీ

- హ్యాట్రిక్ విజేతకు ప్రశంసల జల్లు
- నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా నిలపాలని సూచన


ఏలూరిని అభినందిస్తున్న చంద్రబాబు

పర్చూరు, జూన్ 19 : ముఖ్యమంత్రి, చంద్రబాబుతో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భేటీ అయ్యారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని సీఎం చాంబర్‌లో ఎమ్మెల్యే ఏలూరి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించడంతో ఏలూరిపై చంద్రబాబు ప్రశంసల జల్లు కురిపించారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షునిగా పార్టీకి విశేష కృషి చేసి సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించి 7శాసన సభ స్థానాలతోపాటు, ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకొని విజయ కేతనం ఎగువ వేయడం పట్ల సీఎం ప్రత్యేకంగా అభినందించారు. టీడీపీకి బాపట్ల జిల్లాను కంచుకోటగా మార్చారని కితాబిచ్చారు. పర్చూరు నియోజకవర్గాన్ని రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలపాలని ఎమ్మెల్యే ఏలూరికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎమ్మెల్యే ఏలూరితోపాటు పలువురు మంత్రులు సీఎంను కలిశారు.

అద్దంకి - బొద్దికూరపాడుకు ఆర్టీసీ బస్సు


బొద్దికూరపాడుకు వచ్చిన బస్సు

అద్దంకి, జూన్ 19 : అద్దంకి నుండి బొద్దికూరపాడుకు బుధవారం నుంచి కొత్తగా ఆర్టీసీ బస్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట నుంచి అద్దంకి నుంచి బొద్దికూరపాడుకు ఆర్టీసీ బస్‌లు నడపగా జగన్‌రెడ్డి వచ్చాక నాలుగేళ్లుగా రద్దు చేశారు. తాళ్లూరు మండలంలోని పలు గ్రామాల నుంచి అద్దంకికి నేరుగా బస్ సర్వీస్ లేకుండా పో యింది. సమస్యను ప్రజలు ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం నుంచి పునరుద్ధరించారు. అద్దంకిలో ఉదయం 5-30 గంటలకు బయలుదేరి ముండ్లమూరు, తాళ్ళూరు, తూర్పుగంగవరం మీదుగా 7-30 గంటలకు బొద్దికూరపాడు కు చేరుకొని తిరుగు ప్రయాణం లో అదే రూట్ లో ఉదయం 9-30 గంటలకు అద్దంకి చేరుకుంటుంది. సాయం త్రం 5-30 గంటలకు మరలా అద్దంకి లో బయలుదేరి బొద్దికూరపాడు వెళ్లి మరలా రా త్రి కి అద్దంకి చేరుతుంది. బస్ ఏర్పాటు పట్ల ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రస్తుతం నడుపుతున్న ముండ్లమూరు మీదు గా కాకుండా మోదేపల్లి మీదుగా బస్ సర్వీసు నడిపితే మరింత ప్రయోజనంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అభి ప్రాయపడుతున్నారు.

కూటమి నాయకుల సంబరాలు


కేకు కట్ చేస్తున్న శ్రేణులు

చినగంజాం, జూన్ 19 : మండలంలోని సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో టీడీపీ కూటమి నాయకులు బుధవారం రాత్రి సంబరాలు నిర్వహించారు. జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టీడీపీ కూటమి నాయకులు కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు టీ.జయరావు, చెరుకూరి రాఘవయ్య, సందు శ్రీనివాసరావు, కట్టిబోయిన సుబ్బారావ, శ్రీనివాసరావు(జనసేన), ఉలిచి ఏసుబాబు, సందు శ్రీరామ్, కుర్రి వాసుదేవరావు, పల్లపోలు లక్ష్మీనారాయణ, ధర్మవరపు ఏసునారాయణ, నరహరి గోపీనాథ్, శిఖరం సూరిబాబు, గంటా వెంకటనారాయణ, మెట్టు వెంకటసుబ్బారావు, షేక్ బాజీ, పర్వత రెడ్డి, పద్మనాభ్య, వెంకటేశ్వరావు, పీ.బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గెలిస్తే తన గొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా..?

- జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలి
- మంత్రి గొట్టిపాటి


హనుమంతరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి

సంతమాగులూరు, జూన్ 19 : గెలిస్తే తన గొప్ప.. ఓడితే ఈవీఎంల తప్పా..? దీనిపై జగన్‌రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. వరుసగా 5సార్లు విజయం సాధించి మంత్రి పదవి చేపట్టాక మొదటిసారిగా సంతమాగులూరు మండల కేంద్రానికి వచ్చిన రవికుమార్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అడ్డరోడ్డులోని స్వర్గీయ శ్రీ గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పుట్టవారిపాలెంలోని మంత్రి అతిథి గృహంలో తెలుగుదేశంపార్టీ నేతలు కార్యకర్తలతో సమావేశమైన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్. ఈ సందర్భం గా నిరుద్యోగ యువత కోసం నాడు చెప్పిన ప్రకారం మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేశారని, పెన్షన్ల పెంపు అమలు, రాష్ట్రానికి జీవనాడి అయినటువంటి పోలవరం, రాజధాని నిర్మాణం, అభివృద్ధి విషయంలో ఒక ప్రణాళికతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు వె ళ్తారని, అద్దంకి నియోజకవర్గ అభివృద్ధి తన ధ్యేయమని అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా కూ టమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహించాలన్న జగన్‌రెడ్డిపై గొట్టిపాటి తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల షాక్ నుంచి జగన్‌రెడ్డి అండ్ కో కోలుకోలేదన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ గెలిచినప్పుడు ఈవీఎంల గురించి తనేమి మాట్లాడాడో ఓసారి గుర్తు చేసుకోవాలని, పరనింద, ఆత్మస్తుతి మాని ఆత్మవిమర్శ చేసుకోవాలని గొట్టిపాటి హితవు పలికారు.


మంత్రికి శుభాకాంక్షలు చెప్తున్న పీడీసీసీబీ మాజీ చైర్మన్

గొట్టిపాటికి శుభాకాంక్షలు

అద్దంకి : మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను బుధవారం పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి సంతమాగులూరు గెస్ట్‌హౌస్ వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్, 19వ వార్డు కౌన్సిలర్ వేజెండ్ల నాగరాజు, ఇక్కుర్తి కొండలు తదితరులు ఉన్నారు.

పదేళ్ల సమస్యను పరిష్కరిస్తాం.. సాగునీరందిస్తాం

ఎమ్మెల్యే కొండయ్య


నీటిపారుదలశాఖ అధికారులు, రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 19 : రైతులు అధైర్యపడొద్దని, సమస్యల పరిషారమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. మండల పరిధిలోని బోయినవారిపాలెం శివారులో కొమ్మమూరు కాలువ నుంచి సాగునీరు ప్రవహించే స్టువర్టుపురం చానల్‌ను ఎమ్మెల్యే కొండయ్య, నీటిపారుదల, మురుగునీటిపారుదల, వ్యవసాయశాఖల అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. 27 గ్రామాలలో సాగునీటి పారుదల సమస్య ప్రధానంగా ఉందన్నారు. 10 సంవత్సరాల నుంచి రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోను పరిష్కరించి రైతులు వారి పంటలకు ఖరీఫ్, రబీలలో సాగునీరు అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలుచేపడతామని ఎమ్మెల్యే కొండయ్య రైతులకు భరోసా కల్పించారు. రైతులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కొండయ్య దృష్టికి తెచ్చారు. తమ బాధను కళ్లకు కట్టినట్లు వివరించారు. దీంతో కొండయ్య ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల అధికారులతో సమస్యపై అక్కడే సమీక్షించారు. ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఎస్టిమేషన్స్ వెంటనే వేయాలని చెప్పారు. ఖరీఫ్ పంటలసాగు మొదలయ్యే నాటికి ప్రాథమిక పనులు పూర్తిచేసి రైతులకు సాఫీగా సాగునీటిని విడుదల చేయాలని చెప్పారు.

పూజలు చేసి.. గెలిపించుకున్నాం

అయ్యా మీ గెలుపు కోసం పూజలు చేశాం. గెలిపించుకున్నాం. గ్రామాన్ని అభివృద్ధి చేయండని బోయినవారిపాలెం గ్రామస్థులు పెద్దసంఖ్యలో ఎమ్మెల్యే కొండయ్యను కలసి ఒక వైపు శుభాకాంక్షలు తెలుపుతూ, మరోవైపు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామ మొదట్లో రోడ్డు పై నిలుస్తున్న వర్షపునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంటనే ఎమ్మెల్యే పంచాయతీ రాజ్ డీఈ శేషయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. ఆ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని చెప్పారు.

ప్రమాణ స్వీకారం అనంతరం

అందరినీ కలుస్తా..

సుమారు 27 గ్రామాలకు చెందిన రైతుల సమస్యను పరిష్కరించేందుకు, పరిశీలన నిమిత్తం స్టువర్టుపురం చానల్‌కు వెళ్లిన ఎమ్మెల్యే కొండయ్యను కలిసేందుకు పలు గ్రామాల రైతులు వచ్చారు. ఆ క్రమంలో తమ గ్రామానికి రావాలని ఎవరికి వారు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం అనంతరం బోయినవారిపాలెం నుంచి గడియార స్తంభం వరకు, దేవినూతల నుంచి గడియార స్తంభం వరకు, పందిళ్లపల్లి నుంచి గడియార స్తంభం వరకు ఒక్కో రూటులో ఒక్కో రోజు పూర్తి స్థాయిలో అన్ని గ్రామాలను సందర్శించి అందరినీ కలుస్తానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నీటిపారుదలశాఖ జేఈ పవన్, డ్రైనేజీ డీఈ సుబ్బారావు, ఏడీఏ ఎఫ్రాయమ్, ఏఓలు సుమతి, కాశీ విశ్వనాథ్, వీఏఏలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారి ఆదాయం లెక్కింపు

స్వర్ణ(పర్చూరు), జూన్ 19 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని స్వ ర్ణమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా అమ్మవారికి భక్తులు రూ.2,51,680 నగదును కానుకలు, హుండీ ద్వారా సమర్పించుకున్నట్లు ఆలయ కార్యదర్శి చెన్నారెడ్డి వేణుగోపాలరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.వేణుగోపాలరావు, పి.శ్రీనివాసరావు, వై.సంజీవి, జేఏ పర్యవేక్షించారు.

జగ్గయ్యపేట నుంచి తిరుమలకు పాదయాత్ర

అద్దంకి చేరిన నేతకు

బీజేపీ శ్రేణుల స్వాగతం


రాఘవేంద్రకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

అద్దంకి, జూన్19: ఎన్డీయే అధికారంలోకి రావటంతో జగ్గయ్యపేట కు చెందిన పట్టణ బీజేపీ అధ్యక్షుడు గోలి రాఘవేం ద్ర తిరుమల పాదయా త్ర గా వెళ్తూ బుధవారం అద్దంకి చేరారు. గోలి రాఘవేం ద్ర జగ్గయ్యపేట నుండి తిరుమల కు పాదయా త్ర గా వెళ్తూ బుధవారం అద్దంకి పట్టణం కు చేరటం తో అద్దంకి పట్టణం కు చెందిన బీజేపీ నేతలు తమ్మన శ్రీనివాసరావు, మంగమూరి సురేష్, సంజీవరావు, రూపాంజలి స్వాగతం పలికి సన్మానించారు.

పలువురికి నాన్‌బెయిలబుల్ వారెంట్

మార్టూరు, జూన్ 19 : పర్చూరు నియోజకవర్గ నాయకుడు గొట్టిపాటి భరత్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు, ఒక మహిళకు నాన్ బెయిలబుల్ వా రెంట్‌ను జారీ చేయమని బుధవారం అద్దంకి అడిషనల్ జూనియర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు జారీ చేశారు. 2016లో మార్టూరు పోలీస్ స్టేషన్ వద్ద తన పార్టీకి చెందిన వ్యక్తులకు అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని కోరుతూ భరత్ తన అనుచరులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. దీంతో విజయవాడ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సును కూడా నిలిపివేశారు. బస్సు కండక్టరు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావడం లేదని భరత్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసినట్లు తెలిసింది.


అమ్మకానికి సిద్ధం చేస్తున్న వైట్‌బర్లీ పొగాకు

జోరుగా వైట్ బర్లీ పొగాకు విక్రయాలు

పర్చూరు, జూన్ 19 : వైట్ బర్లీ పొగాకు విక్రయాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సాగుకు సమయం ఆసన్నం కావడం, తిరిగి ఈఏడాది సాగుచేసుకునేందుకు పెట్టుబడుల నేపథ్యంలో రైతులు తమ వద్ద నిల్వ చేసుకున్న వైట్ బర్లీని విక్రయాలు నిర్వహిస్తున్నారు. పంట చేతికి అంది వస్తున్న తరుణంలో నానాశిరకం పొగాకు క్వింటా రూ.14వేల పైచిలుకు ధరతో విక్రయాలు నిర్వహించుకున్నారు. నాణ్యమైన మేలుకరం పొగాకుకు మంచి గిట్టుబాటు ధర ఉంటుందన్న ఆశతో అధికశాతం రైతులు పొగాకు ఉత్పత్తులను నిల్వ చేసుకున్నారు. నెలలు తరబడి నాణ్యమైన ధర కోసం ఎదురు చూసిన రైతులకు చివరకు నిరాశే ఎదురైంది. నాణ్యమైన పొగాకు క్వింటా రూ.14,500 మించి లేకపోవడంతో గత్యంతరం లేక దక్కిందే ధర అన్నట్టు విక్రయాలు నిర్వహించుకుంటున్నారు. పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో గత ఏడాది దాదాపు అధిక భాగం రైతులు వైట్‌బర్లీ పొగాకును సాగుచేసుకున్నారు.

నేడు బస్సు షెల్టర్ ప్రారంభం

కార్యక్రమానికి హాజరు కానున్న ఎమ్మెల్యే ఏలూరి


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బస్సు షెల్టర్

ఇనగల్లు(పర్చూరు), జూన్ 19 : పర్చూరు మండలం ఇనగల్లు గ్రామంలో కీర్తి శేషులు పోపూరి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం వారి కుమారులు తెలుగుదేశం పార్టీ నాయకులు పోపూరి శ్రీనివాసరావు, రమేష్‌బాబు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్‌ను గురువారం ప్రారంభోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరు కానున్నట్లు కుమారులు తెలిపారు. ప్రయాణికులు సౌకర్యార్థం బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేసినట్లు పోపూరి తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్త దాడి


చికిత్స చేస్తున్న వైద్యులు

బల్లికురవ, జూన్ 19 : వైసీపీ పాలనలో అవినీతి పనులపై ప్రశ్నించిన టీ డీపీ కార్యకర్త అయిన కొప్పెరపాడుకు చెందిన బుర్రి ప్రసన్నపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త కుంచాల రాంబాబు సోమవారం దాడి చేయడం తో తీవ్రగాయాలయ్యాయి. ప్రసన్నను వారి బంధువులు ఒంగోలు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అందిన సమాచారం మేరకు.. మండలంలోని కొప్పెరపాడుకు చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన బుర్రి ప్రసన్న గ్రామ సెంటర్‌లో ఉండగా వైసీపీ కార్యకర్త కుంచాల రాంబాబు అక్కడకు రాగా, గతంలో చేసినట్లు ఇప్పుడు అవినీతి పనులకు పాల్పడితే తమ ప్రభుత్వం చూస్తు ఊరుకోదని ప్రసన్న అనగా, ఇద్దరి మధ్యా వాదన పెద్దది కావడంతో వైసీపీ కార్యకర్త అయిన రాంబాబు ఒక్కసారిగా పక్కనే ఉన్న ఇటుక రాయితో దాడి చేశాడు. తలకు, గడ్డంకు తీవ్ర గాయాలైన ప్రసన్నను ఒంగోలు తరలించగా అయనకు 40కుట్లు వరకు వేసి వైద్యం అందిస్తున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

అద్దంకి, జూన్ 19 : కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం అద్దంకిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అడుసుమల్లి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి కోరే సురేంద్రనాథ్, కాంగ్రెస్‌పార్టీ నేతలు సుబ్రహ్మణ్యం, పీవీ సురేష్‌బాబు, శ్రీనివాసయాదవ్, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ గోడౌన్‌లో తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

అద్దంకి, జూన్ 19 : అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డులో సివిల్ సప్లయీస్ గోడౌన్‌ను బుధవారం చీరాల ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. తూకాలను చూశారు. ఆయన వెంట తహసీల్దార్ మహబూబ్ సుభాని, సివిల్ సప్లయీస్ డీటీ సత్యనారాయణ, ఆర్‌ఐ శంకర్ తదితరులు ఉన్నారు.

పంచాయతీ భవనం పరిశీలన


భవనాన్ని పరిశీలించిన పీఆర్ డీఈ


ఇంకొల్లు, జూన్ 19 : శిథిలావస్థలో ఉన్న ఇంకొల్లు కార్యాలయ భవనాన్ని బుధవారం పంచాయతీ రాజ్ డీఈ విభూషణం పరిశీలించారు. భవనంలోపల పెచ్చులు ఊడుతున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. బాపట్ల జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి అనుమతులు పొందాలని, ఫొటోలతో సహా పంపాలని గ్రామపంచాయతీ కార్యదర్శి కోటి నాగయ్యను ఆదేశించారు.

విద్యార్థులు పథకాలను వినియోగించుకోవాలి



కిట్లను అందజేస్తున్న హెచ్‌ఎం

ఇంకొల్లు, జూన్ 19 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సంక్షేమ పథకాలను వినియోగించుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.





వైసీపీ నేతలు ఆక్రమించిన అటవీ పోరంబోకు భూమి

వైసీపీ నేతల భూకబ్జా!

- కంటేపల్లిలో అటవీ స్థలం ఆక్రమణ
- ప్లాట్లు వేసి విక్రయించేందుకు సన్నద్ధం
- గ్రామస్థుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ
- ఆక్రమణల తొలగింపు.. హెచ్చరిక బోర్డు ఏర్పాటు

వెంకటాచలం, జూన్ 19 : మండ లంలోని కంటేపల్లిలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి వెలుబోయిన వెంకటేశ్వర్లు, మరికొందరు నాయ కులు సర్వే నెం.287 లోని సుమారు 5 ఎక రాల అటవీ పోరంబోకు భూమిని ఆక్రమించారు. సదరు భూమి చుట్టూ ఫెన్సిం గ్ ఏర్పాటు చేయడంపై గ్రామంలో పెద్ద దుమారమే రేగింది. ఆక్రమణకు గురైన భూమి గొలగమూడికి సమీపంలోని టూరిజం (ఐటీటీఎం) కళాశాలకు ఆనుకుని ఉండటంతో దాని విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఆక్రమణకు గురైన అటవీ పోరంబోకు భూమిలో కొంత స్థలంలో వైసీపీ నేత వెలుబోయిన వెంకటేశ్వర్లు అనధికారికంగా సిమెంటు బ్రిక్స్ కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన భూమిని వైసీపీ నేతలు అనధికారికంగా లే అవుట్‌గా మార్చి ప్లాట్లు వేసి అమ్మేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు కనుగొని తహసీల్దారు పూర్ణచంద్రరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో విచారించి వీఆర్వో వినోద్ ఆధ్వర్యంలో పోలీసుల సహాయంతో జేసీబీ ద్వారా బుధవారం ఫెన్సింగ్, సిమెంట్ బ్రిక్స్ కర్మాగారాన్ని తొలగించారు. అంతేగాక హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు అందినకాడికి అందినట్లుగా దోచుకోవడమే కాకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించారని, కంటేపల్లిలో చెరువులను, ప్రభుత్వ భూములను సైతం గ్రావెల్ కోసం కొల్లగొట్టి రూ.కోట్లలో దోచుకున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ నేతలు దోచుకున్న రూ.కోట్ల ప్రభుత్వ సొత్తును తిరిగి కక్కించాలని వారు కోరుతున్నారు.



రెవెన్యూ శాఖ తొలగించిన ఆక్రమణలు

వైసీపీ నేత మైనింగ్ పరిశ్రమ సీజ్

- ఎస్‌ఎల్‌వీ స్టోన్‌క్రషర్స్‌కు రూ.1.32 కోట్ల జరిమానా
- 42,634 క్యూబిక్‌మీటర్ల మెటల్ సీజ్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 19 : గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమ మైనింగ్‌పై సంబంధిత అధికారులు జిల్లాలో వరుస దాడులు చేస్తున్నారు. వైసీపీ ముఖ్యనాయకుడు వైవీ రామిరెడ్డికి చెందిన ఎస్‌ఎల్‌వీ స్టోన్‌క్రషర్స్ మైన్స్‌పై అధికారులు దాడులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఎస్‌ఎల్‌వీ మైనింగ్ క్వారీలో అనుమతులకు మించి అక్రమంగా తవ్వకాలు జరిపినందుకు సుమారు రూ.75 కోట్ల జరిమానా విధించారు. తాజాగా రాపూరు మండలం పులిగిలపాడు వద్ద ఉన్న ఎస్‌ఎల్‌వీ స్టోన్‌క్రషర్స్ పరిశ్రమను, అందులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.కోట్లు విలువైన మెటీరియల్‌ను మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ సీజ్ చేశారు. దాదాపు 42,634 క్యూబిక్‌మీటర్ల మెటల్ సీజ్ చేయడంతోపాటు రూ.1.32 కోట్ల జరిమానా విధించారు. ఇలా వరుస దాడులతో అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు చేసిన వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుడుతోంది.



సీజ్ చేసిన క్రషర్ వద్ద మైనింగ్ అధికారులు

ఆదుకోండయా!

- కరువు బృందానికి అన్నదాతల మొర
- కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటన
- దెబ్బతిన్న పంటల పరిశీలన, రైతులతో ముఖాముఖి

కలిగిరి/కొండాపురం, జూన్ 19 : తీవ్ర దుర్భిక్షంతో పంటలు ఎండిపోయి పూర్తిగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కేంద్ర కరువు బృందానికి విజ్ఞప్తి చేశారు. గత రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర కరువు బృందం బుధవారం సాయంత్రం కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటించింది. తొలుత కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు గ్రామాల్లో దెబ్బతిన్న మినుము పంటను బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాల్లో రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు కేంద్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఏడాది విత్తనాల కోసం పడుతున్న ఇబ్బందులు, నాసిరకం విత్తనాలతో నష్టపోయిన వైనాన్ని వివరించారు. గంగిరెడ్డిపాలెం పంచాయతీలో భూగర్భ జలం అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయని పేర్కొన్నారు. తెల్లపాడు పంచాయతీలోని రైతులు తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే, పంట నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, ఈ విషయంపై అధికారులు రికార్డులు పరిశీలించాలని కోరారు. మెట్ట పైర్లే తమకు ఆధారమని, కరువు ప్రభావంతో తీవ్రంగా నష్టపోయామని, తాము పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలను సావధానంగా విన్న బృందం సభ్యులు పూర్తినివేదికను కేంద్రానికి అందజేసి ఆదుకుంటామని తెలియజేశారు.

● ఇక కొండాపురం మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో దెబ్బతిన్న దాదాపు 80 ఎకరాల్లోని మినుము, మిరప పంటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. ఈ పర్యట నలో కేంద్ర కరువు బృందం సభ్యులు మన్నుజి ఉపాధ్యాయ్, మదన్‌మోహన్‌మౌర్య, అనురాధ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, జిల్లా పౌరసరఫరాలాధికారి వెంకటరమణ, ఉద్యానశాఖాధికారి దీపిక, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ వీరశేఖర్, కలిగిరి, కొండాపురం తహసీల్దార్లు బాలకృష్ణ, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం: గొట్టిగుండాల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కరువు బృందం



● ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన

జిల్లాలో కరువు పరిస్థితులను వివరిస్తూ సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్థక శాఖలకు సంబంధించిన జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు ఫొటోలతో బృంద సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ లవన్న, జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, పశుసంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు, నుడా వీసీ బాపిరెడ్డి, సీపీఓ రాజు, ఇరిగేషన్ డీఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ తిరుమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరువు ఉంది.. కనికరించండి!

- పది మండలాల్లో తీవ్ర దుర్భిక్షం
- 9053.21 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- పశుసంపదకూ అపార నష్టం
- ఆర్థిక సాయం చేసి ఆదుకోండి
- కేంద్ర కరువు బృందాన్ని కోరిన కలెక్టర్



కేంద్ర బృందం సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం), జూన్ 19 : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేయాలని కేంద్ర కరువు బృంద సభ్యులను కలెక్టర్ హరినారాయణన్ కోరారు. జిల్లాలో కరువు పరిస్థితులను అంచనా వేయడానికి విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు మన్నుజి ఉపాధ్యాయ్, ఎస్‌సి కష్యప్, మదన్ మోహన్ మౌర్య, బి. అనురాధ బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సీతారామపురం, వలేటివారిపాలెం, కందుకూరు, లింగసముద్రం, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు, మర్రిపాడు, వరికుంటపాడు, కలువాయి మండలాలను జాతీయ విపత్తుల సంస్థ కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఈ పది మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. సీతారామపురంలో 50 శాతానికిపైగా, మిగిలిన 9 మండలాల్లో 30 నుంచి 40 శాతం మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. ఈ పది మండలాల్లో 7,156 మంది రైతులకు చెందిన 9053.21 హెక్టార్లలో వరి, శనగ, వేరుశనగ, మినుములు, చిరుధాన్యాలు తదితర పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని వివరించారు. బాధితులను ఆదుకునేందుకు రూ.8.49 కోట్లతో ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలను కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. సీతారామపురంలో అత్యధికంగా 148 మంది రైతులు 69 హెక్టార్లలో పంటలు నష్టపోయారని వీరికి 9.25 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అంచనా వేసినట్లు చెప్పారు. పశుసంవర్థక శాఖ పరిధిలో 7,42,306 చిన్న, పెద్ద పశునష్టం జరిగిందని, అయితే, ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం 5302 పశువులకు నష్టపరిహారం చెల్లించే అవకాశం ఉందన్నారు. ఈ మండలాల్లో పశుదాణా, మందుల కోసం రూ.2.91 కోట్ల బడ్జెట్ అవసరమని అంచనా వేసినట్లు వివరించారు. ఇక కరువు మండలాల్లో నీటి ఎద్దడిని అధిగమించేందుకు బోర్‌వెల్స్, సీపీడబ్ల్యూఎస్ స్కీమ్స్, వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లాలో 10 కరువు మండలాల్లో వ్యవసాయం, రూరల్ వాటర్ సప్లయ్, పశు సంవర్థక శాఖలకు సంబంధించి రైతులను ఆదుకునేందుక రూ.13.35 కోట్లు మేర నిధులు అవసరమని వివరించారు. జిల్లాలో వర్షాలు చెదురుమదురుగానే కురుస్తున్నాయని, రానున్న రెండు నెలలు ఇదే పరిస్థితి ఉంటే మెట్ట ప్రాంతల్లో తాగు, సాగునీటికి ఇబ్బంది కలుగుతుందని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వస్తుందని వివరించారు. ఈ పరిస్థితులను దృష్ట్యా జిల్లాకు నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని బృందాన్ని కలెక్టర్ కోరారు.



కలిగిరి : గంగిరెడ్డిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

కార్పొరేటర్‌పై కేసు నమోదు

● బలవంతపు రాజీనామాలపై వలంటీర్ల ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), జూన్ 19: నెల్లూరు నగరంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ కోవాకొల్లు విజయలక్ష్మి, మధుసూదన్‌రావుతోపాటు పలువురు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వార్డు వలంటీర్ ఉద్యోగాలకు తమతో బలవంతంగా రాజీనామా చేయించారని పెనుబల్లి సంధ్యతోపాటు పలువురు వలంటీర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాల మేరకు చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కాగా, ఎన్నికల సమయంలో వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు తమపై దాడి చేసి, బెదిరించి, కులం పేరుతో దూషించి వలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేయించారని నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో బుధవారం ఫిర్యాదులు అందాయి. 19/1 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేసిన శశికాంత్, మరికొందరు ఆ డివిజన్ వైసీపీ నాయకులపై బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు ముడియాల రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, పచ్చా రవి, బుల్లి కుమార్ తనను బెదిరించి బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేవిధంగా 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి, శరత్‌చంద్ర తమను ఎన్నికల సమయంలో బెదిరించి ఉద్యోగాలకు రాజీనామా చేయించారని దర్గామిట్ట పోలీసులకు పలువురు మాజీ వలంటీర్లు ఫిర్యాదు చేశారు.



బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

10 టీఎంసీలకు చేరువలో 'సోమశిల'

అనంతసాగరం : ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహం కొనసాగుతుండటంతో సోమశిల జలాశయం నీటిమట్టం 10 టీఎంసీలకు చేరువైంది. మంగళవారం ఇన్‌ఫ్లో 891 క్యూసెక్కులు రాగా బుధవారం 4,433 క్యూసెక్కులకు పెరిగింది. నైరుతి రుతుపవనాలతో రాయలసీమ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు డ్యాంకు వచ్చే ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గులుగా కొనసాగుతోంది. ఈక్రమంలో మరికొన్ని రోజులపాటు డ్యాంకు ప్రవాహం కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.373 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బడి ఈడు పిల్లల కోసం
'నేను బడికిపోతా'!

- నెలరోజులపాటు జిల్లాలో నూతన కార్యక్రమం
- పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంపుదలే లక్ష్యం

నెల్లూరు (విద్య), జూన్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే యోచనతో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం 'నేను బడికిపోతా' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్పించేలా సోమవారం నుంచి జులై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గతంలో 14 ఏళ్ల లోపు వయసు కలిగిన బాలలను మాత్రమే నమోదు చేస్తుండగా ప్రస్తుతం 18 ఏళ్లలోపు వారి వరకు కూడా బడిఈడు పిల్లలుగానే గుర్తించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా 6-14 లోపు చిన్నారులు బడుల్లో చేరాల్సిన వారు బడి బయటే ఉంటున్నారు. తల్లిదండ్రుల్లో అవగాహనలోపం, చుట్టూ ఉన్న పరిస్థితుల కారణంగా చదువుపై పిల్లలు ఆసక్తి చూపడంలేదని వివిధ సర్వేల ద్వారా వెల్లడైంది. దీంతో టీడీపీ ప్రభుత్వం కొత్తదనంతో ఈ నెల రోజులపాటు చైతన్య కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించి బడిబయట పిల్లలను బడికి రప్పించనున్నారు.

● మూడుస్థాయిల్లో నిర్వహణ

మూడు స్థాయిల్లో 'బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేం దుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రధానంగా జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో కమిటీలు ఏర్పడ్డాయి. జిల్లాస్థాయిలో డీఈఓ చైర్మన్‌గా, 13 మంది జిల్లాస్థాయి అధికా రులు సభ్యులుగా ఉంటారు. అలాగే, మండల, గ్రామస్థాయిలోనూ కమిటీ లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మూడు స్థాయిల్లో సమన్వయ సమావేశాల నిర్వహణ, పాఠశాలల్లో విద్యార్థులు అందుతున్న వసతులు, సంక్షేమ పథకాలు వివరణ, గోడపత్రికలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం, ర్యాలీలు నిర్వహించడం, అమ్మఒడి, గోరుముద్ద, మధ్యాహ్న భోజనం, ఇతర సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరిస్తారు. చివరి రోజున గుర్తించిన పిల్లలను యూడైస్‌లో నమోదు చేయడంతోపాటు పిల్లల సమగ్ర సమాచారాన్ని సేకరించి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటారు.



వింజమూరు : బడిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

● జిల్లాలో 10వేల మందికి పైగానే..

జిల్లాలో ప్రతి ఏడాది పాఠశాలలు తెరిచే నాటికి వివిధ కారణాలతో పిల్లలు బడులకు రావడంపై ఆసక్తి చూపడం లేదని వివిధ సర్వేల ద్వారా తెలుస్తోంది. ప్రధానంగా ఐదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు ఆరోతరగతి ప్రవేశాలకు వెళ్లకపోవడం, ఆరేడు తరగతుల తరువాత ఇంటికే పరిమితవుతున్నారు. ఇలా జిల్లాలో దాదాపు 10వేల మందికి పైగానే బడిబయట పిల్లలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం!

ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో గ్రామాల్లోని ఆవాస ప్రాంతాల్లో ప్రతి ఇంటిని సర్వే చేయించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేలా నేను బడికిపోతా ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ జరుగుతోంది. ప్రతిరోజూ దీనికి సంబంధించిన నివేదికలను జిల్లా కేంద్రానికి, జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి అందచేస్తాము. వంద శాతం కార్యక్రమం విజయవంతం చేసేందుకు పని చేస్తున్నాం.

- సీహెచ్.ఉషారాణి, ఎస్ఎస్ఏ ఏపీసీ

ఊరూరా వైభవంగా ఉత్సవాలు, జాతరలు



ఉదయగిరి రూరల్ : మేళతాళాలతో అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకెళుతున్న ఆలయ ధర్మకర్తలు, భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు



ఉదయగిరి : విశేష అలంకరణలో అడవిపేరంటాలమ్మ

జ్యేష్ఠమాసం సందర్భంగా పలు మండలాల్లోని గ్రామాల్లో వివిధ దేవతామూర్తుల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. రోజుకో అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామదేవతలకు కూడా గ్రామస్థులు జాతరలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని కానుకలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఉత్సవాలు, తిరునాళ్లు ఈ వారంలోనే ప్రారంభం కానున్నాయి. ఆ వివరాలు..

వైభవంగా పసుపు, కుంకుమ ఉత్సవం

ఉదయగిరి రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో వెలసి ఉన్న సంతానలక్ష్మి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పసుపు, కుంకుమ, ప్రదానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పిన్నెబోయిన వెంకటయ్య, రమణమ్మ ఇంటి నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలను మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఆలయం వద్దకు చేర్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతానంలేని మహిళలు ఆలయంలో వరపడ్డారు. రాత్రికి అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి, వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

కోదండరాముడి ఆలయ వార్షికోత్సవం

ఉదయగిరి పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న కోదండరామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లకు గణపతి పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు.

22 నుంచి గంగాభవాని ఉత్సవాలు

ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డిపల్లిలో వెలసి ఉన్న అనంతపూరి గంగాభవాని ఉత్సవాలు ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 22న సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం, 23 ఉదయం వసంతోత్సవం, రాత్రికి గంగాభవాని నిలుపు, గ్రామోత్సవం, 24న అమ్మవారికి కుంకుమపూజ, గ్రామోత్సవ నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదానం ఉంటుందన్నారు.

అడవి పేరంటాలమ్మకు పసుపు, కుంకుమ

ఉదయగిరి : మండలంలోని గన్నేపల్లిలో బుధవారం అడవిపేరంటాలమ్మకు పసుపు, కుంకుమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీలోని గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీల నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. సంతానం కోసం మహిళలు వరపడ్డారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆత్మారామస్వామికి వైభవంగా వ్యాలీ వాహనసేవ

సంగం : మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఆత్మారామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున స్వామివారు వ్యాలీ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామిని వ్యాలీ వాహనంపై ఉంచి గజపూలమాలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా ధ్వజారోహణ

సంగం మండలం దువ్వూరులో వెలసి ఉన్న గంగా,పార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. ధ్వజారోహణలో ప్రసాదంగా అందచేసే కొడిముద్ద కోసం భక్తులు ఎగపడ్డారు.

మాతాపరమేశ్వరికి డ్రైఫ్రూట్స్‌తో అలంకారం

సంగం తూర్పు దళితవాడలో జరుగుతున్న మాతాపరమేశ్వరి జాతరలో భాగంగా బుధవారం అమ్మవారికి డ్రై ఫ్రూట్స్‌తో అలంకరణ చేశారు. అలాగే ఆలయం ముందు ముగ్గుతో మాతాపరమేశ్వరి చిత్రాన్ని వేశారు. మూలవిరాట్‌ను పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

కలువాయి: సోమశిల పరమానంద ఆశ్రమంలోని లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈనెల 26వతేదీ వరకు నిర్వహించనున్నట్లు అర్చక స్వాములు ఈదూరు రామాచార్యులు తెలిపారు. 20న అంకురార్పణ, 21న ధ్వజారోహణం, 22న హనుమంతసేవ, 23న గరుడ సేవ, 24న కల్యాణం, 25న వసంతోత్సవం, 26న ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.



సంగం : వ్యాలీ వాహనంపై ఆత్మారామస్వామి గ్రామోత్సవం



కోటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజారోహణ



డ్రై ఫ్రూట్స్‌తో మాతాపరమేశ్వరికి అలంకారం



కలువాయి : బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన లక్ష్మీనృసింహుడి ఆలయం

మంత్రి ఆనంకు శుభాకాంక్షలు



మంత్రి ఆనంను కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న వెంకటేష్‌నాయుడు

సంగం, జూన్ 19: సంగం గ్రామవాసి, చెన్నై టీడీపీ ఫోరం, తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ విభాగం నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు నూతలపాటి వెంకటేష్ నాయుడు బుధవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని సంతపేటలో ఆయన ఇంట్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగం మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఆత్మకూరు, జూన్ 19 : పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలకు అతీతంగా ఆత్మకూరు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు, యోగసాధకులు పాల్గొనాలని ఆయన కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరు, జూన్ 19 : పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం కరిముల్నీషా తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు డిపో నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డన్ టెంపుల్, అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, దర్శనం ఉంటుందన్నారు. వెళ్లాలనుకునే భక్తులు రూ. 1400 చెల్లించి రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99592 25645, 99660 09395, 73828 83299 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

భూఆక్రమణను అడ్డుకున్న అధికారులు

ఉదయగిరి రూరల్, జూన్ 19: మండలంలోని శకునాలపల్లి సచివాలయం వెనుక వైపు ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తుండగా, బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. 39, 40 సర్వేనెంబర్లలోని సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ వాగు పోరంబోకు భూమిని కొందరు మట్టి తోలి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో అనూష సర్వేయరుతో వెళ్లి అడ్డుకున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

వరికుంటపాడు, జూన్ 19: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, జడ్పీటీసీ సభ్యులు రావిళ్ల నాగేంద్ర చేతుల మీదుగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో షావుద్దీన్, హెచ్‌ఎం. చలపతి, వీరభద్రయ్య, సర్పంచులు మహేష్, దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సికిలి సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం, జూన్ 19 : ప్రపంచ సికిలిసెల్ అనీమియా డే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారి డాక్టర్ ఏ స్వప్న ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సికిలి సెల్ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయాసం, గుండెదడ, గుండె పెరుగుదల, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. కావున మండలంలోని గిరిజనులంతా రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, ఎంపీహెచ్‌ఈవో మజీద్, ఎంపీహెచ్‌ఎస్ రియాజ్, ఎంపీఎస్ క్రిష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో హిందూ సామ్రాజ్య దినోత్సవం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

వింజమూరు, జూన్ 19: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పట్టణంలో బుధవారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి బీసీ కాలనీలోని చౌడమ్మ గుడి వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు వాసు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు అర్పిస్తూ ఈ బైక్ ర్యాలీని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ఇంటింటా ప్రచారం

వింజమూరు, జూన్ 19 : మండలంలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కలిసి బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కమిటీ ఛైర్‌పర్సన్ సుభాషిణి మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీ చేసిన పాఠశాలల విలీనం జీవోను 117ను రద్దు చేసి, ఆయా పాఠశాలలను తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

అనంతసాగరం/ఉదయగిరి రూరల్, జూన్ 19: స్థానిక దిగువూరికి చెందిన ఉపాధ్యాయుడు చింతగుంట మధుసూదన్‌రెడ్డి (50) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేసేవారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.ఆయన మృతికి సంతాప సూచికంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు.

తూర్పుబోయమడగలలో టీడీపీ సంబరాలు

వరికుంటపాడు, జూన్ 19: మండలంలోని తూర్పుబోయమడగల సచివాలయంలో బుధవారం టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించి సంబరాలు చేసు కున్నారు. తూర్పుబోయమడ గల, అలివేలుమంగాపురం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ స్వంత నగదు వెచ్చించి చిత్రప టాలను ఏర్పాటు చేయడంతో పాటు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుంద ని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్కూటీని ఢీకొన్న ఆటో : ఇద్దరికి తీవ్ర గాయాలు. ఒకరి పరిస్థితి విషమం

ఏఎస్ పేట,జూన్19: మండలంలోని మదారాబాదు వద్ద బుధవారం సాయంత్రం స్కూటీని ఆటో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల కథనం మేరకు, అనుమసముద్రంకి చెందిన మామాఅల్లుళ్లు మహమ్మద్ హనీఫ్, నాసార్‌లు మదారాబాదులో టైల్స్ పనికి వెళ్లి సాయంత్రం స్కూటీపై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఆ సమయంలో మదారాబాదుకి చెందిన శ్రీను ఆటోలో ఎదురుగా వచ్చి వారిని ఢీ కొట్టాడు.దీంతో మహమ్మద్ హనీఫ్, నాసార్‌లకు తీవ్ర గాయలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హనీఫ్ పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్స కోసం ఆయన్ను నెల్లూరుకి తరలించారు.ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నిరాశపరుస్తున్న నైరుతి!

- మోస్తరు వర్షంతో మొహం చాటేసిన మేఘాలు
- మళ్లీ భానుడి విశ్వరూపం ● ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన

కందుకూరు, జూన్ 19: ఈ ఏడాది సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలతో ఆనందించిన రైతులను నైరుతి రుతు పవనాలు నిరాశపరుస్తోన్నాయి. గత కొన్నేళ్లతో పోలిస్తే ఈ ఏడాది రుతు పవనాలు పది రోజులు ముందుగానే వచ్చినప్పటికీ ఆశించిన వర్షాలు కురవలేదు. ఈ నెల 8, 9 తేదీలలో రుతుపవనాల ప్రభావంతో ఓ మోస్తరు వర్షం కురిసి వాతావరణం చల్లబడినప్పటికీ భూములు పదునయ్యే వర్షం కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. దీంతో పాటు గత నాలుగు రోజులుగా వేసవిని తలపిస్తూ భానుడు విశ్వరూపం చూపిస్తుండగా ఎండవేడికి తోడు వడగాలులు (పడమరగాలి) తోడవటంతో మలమలలాడుతున్న పరిస్థితి నెలకొంది. నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించటంతో మంచి వర్షాలు కురిస్తే ఖరీఫ్ పైర్లు సాగుకు మంచి అదను అవుతుందని రైతులు ఆశగా ఎదురుచూశారు. పచ్చిరొట్ట పైర్లుతో పాటు నువ్వు, పెసర, మినుము, సజ్జ, జొన్న తదితర ఖరీఫ్ పైర్లు సాగు చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే అనూహ్యంగా వర్షాలు మొహం చాటేసి ఎండలు మండిపోతుండటంతో భూమిలో ఉన్న పదును కూడా పూర్తిగా ఆరిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఖరీఫ్ పైర్లు సాగు చేసేందుకు రైతులు వెనుకంజ వేశారు. వాతావరణం ఇలాగే ఉంటే విత్తనం మొలకెత్తడం కూడా అనుమానమేనని ఒకవేళ మొలిచినా వారం తిరగకుండానే మొలకలు ఎండిపోతాయని భావిస్తున్న రైతులు పైర్లు సాగు ఆలోచనను విరమించుకుంటున్నారు. అలాగే జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలన్నా భూమిలో ఉన్న పదును చాలదని రైతులు ఆలోచిస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించేందుకు సిద్ధం చేసినప్పటికీ వాతావరణ అనుకూల పరిస్థితుల్లో రైతులు వాటిని తీసుకునేందుకు తటపటాయిస్తున్నారు. మరోవైపు మే నెలలో కురిసిన ఓ మోస్తరు వర్షంతో నీటి ఆధారంగా సాగు చేసిన వేరుశనగ, పొద్దుతిరుగుడు లాంటి నూనెగింజల పైర్లు కూడా ఎండలధాటికి మలమలలాడుతుండటంతో ఆ పైర్లు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం మరో వారం పది రోజులు ఇలాగే కొనసాగితే ఇక ఖరీఫ్ పైర్లు సాగుపై ఆశలు వదులుకోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆతర్వాత వర్షాలు కురిసినా అదను దాటుతుందని వాపోతున్నారు.

మందాడి చెరువులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

- బోర్డులతో సరిపెడుతున్న అధికారులు

కావలి, జూన్ 19: కావలి పట్టణం మందాడి చెరువు లోతట్టు ప్రాంతంలో ఉన్న రాళ్లగుట్ట పోరంబోకు స్థలంను పలువురు ఆక్రమించి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోకుండా ఎవరైనా ఫిర్యాదు చేసిన రోజు అధికారులు హడావుడి చేసి అక్కడ ఇది ప్రభుత్వ స్థలమని బోర్డులు పెడుతున్నారు. గతంలో అనేక పర్యాయాలు బోర్డులు పెట్టినా అవి కొన్ని రోజులకు మాయమవడం.. ఆ తర్వాత నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారింది. ఇదే క్రమంలో ఆ చెరువులో మళ్లీ నిర్మాణాలు జరుగుతుండగా తాజాగా అక్కడ ప్రభుత్వ భూమి అని, దీనిలోఎవరూ ప్రవేశించరాదని ఆక్రమించరాదని, ఆక్రమించిన చో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు పేరుతో బుధవారం ఒక బోర్డు ప్రత్యక్షమైంది. అయితే ఇప్పటి వరకు ఆ స్థలాలను వైసీపీ ప్రభుత్వంలో కొందరు వ్యక్తులకు, కొన్ని సంస్థలకు అనధికారికంగా అప్పచెప్పారనే ప్రచారం జరిగింది. అప్పట్లో అక్కడ నిర్మాణాలు ప్రారంభించగా ఎన్నికల సమయంలో అధికారులు వాటి నిర్మాణాలను నిలిపి వేశారు. ప్రస్తుతం అది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టడంతో చెరువులో నిర్మాణం జరిగేవి అక్రమ నిర్మాణాలని తేలిపోయింది. అయినా ఒక నిర్మాణం వద్ద ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టి ఉన్నా సమీపంలో మరొక నిర్మాణం చేసిన రేకుల షెడ్డు గోడలకు ప్లాస్టింగ్ చేస్తూనే ఉన్నారు. కేవలం అధికారులు కాలయాపనతో సరిపెడుతున్నారే కానీ ప్రభుత్వ భూమని చెప్పినా అక్కడ నిర్మాణలను మున్సిపల్ అధికారులు తొలగించకుండా వదిలి వేస్తుండటంతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.



మందాడి చెరువులో నిర్మిస్తున్న భవనాల వద్ద ప్రభుత్వ స్థలమని ఏర్పాటు చేసిన బోర్డు

ఇంటూరికి అభినందనల వెల్లువ



ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కందుకూరు, జూన్ 19: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావును బుధవారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. కందుకూరు బ్రాహ్మణ సంఘం ప్రతి నిధులు ఐవీ నాగరాజారావు ఆధ్వర్యంలో బడేవారిపాలెం వెళ్లి నాగేశ్వరరావును కలిసి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, నాగరాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం కార్యాలయంలో ప్రజలు, కందుకూరు నియోజకవర్గంలో పోస్టింగ్‌లు ఆశిస్తున్న వివిధశాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇంటూరి నాగేశ్వరరావు కావలికి వెళ్లి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



కొండబిట్రగుంటలో నిర్వహిస్తున్న ర్యాలీ

బిట్రగుంట, జూన్ 19: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు పునః ప్రారంభించడంతో ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలు చేర్పిం చేందుకు విద్యార్థులచే చేపట్టిన ర్యాలీలో ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11 మంది బడిఈడు పిల్లలను బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని విజిత, పెరుమాళ్లు, అంకారావు, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికిపోతా'పై నేడు సమీక్ష

అల్లూరు : నేను బడికిపోతా కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరరంలో గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థులను బడికి పంపించే అంశంపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, రూరల్, అర్బన్ పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ముమ్మర సర్వే

- బయట పడుతున్న ప్రభుత్వ భూములు



రోడ్డుకు అడ్డంగా వచ్చిన పంట కాలువకు మార్కింగ్ చేస్తున్న సర్వే టీం సభ్యులు

కావలి, జూన్ 19: కావలి పట్టణంలో వేసిన అక్రమ లేఅవుట్లలో తవ్వే కొద్దీ అవినీతి బయట పడుతోంది. కావలి పట్టణం వెంగాయగారి ప్రాంతంలో బుధవారం మూడు టీమ్‌లు అక్రమ లేఅవుట్లలో సర్వే చేపట్టారు. వాటిలో రెండు టీమ్‌లు సుమారు 15 సర్వే నెంబర్లలో 35 ఎకరాల వరకు సర్వే పూర్తి చేశారు. వీటిలో మూడు సర్వే నెంబర్లలో 4.33 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి మార్కింగ్ చేశారు. వాటిలో 52 సెంట్లు ప్రభుత్వ కాలువ, 3.81 ఎకరాలు రెండు నీటి గుంటలను గుర్తించారు. 4.33 ఎకరాలు ప్రభుత్వ స్థలంగా గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు. మరొక టీమ్ చేసిన సర్వే వివరాలు తెలియరాలేదు. మొత్తం మీద అక్రమ లేఅవుట్లలో తవ్వే కొద్దీ ప్రభుత్వ ఆస్తులు బయటపడుతుండటంతో వాటిల్లో ప్లాట్లు కొన్న వారు ఆందోళన చెందుతున్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కావలిటౌన్, జూన్ 19: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వక్తలు మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం కల్పించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచి వెంకటేశ్వర్లు, వీరబ్రహ్మం, రవిబాబు, గురవయ్య, యువజన నాయకులు నితీష్ పాల్గొన్నారు.

ఫ్యాను, లైట్లు వితరణ

బిట్రగుంట, జూన్ 19: బోగోలు మండల హౌసింగ్ కార్యాలయంలో గత కొన్ని నెలలగా ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు కాలిపోయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో బుధవారం రాగాల పావని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫ్యాను, లైట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బోగిరి ప్రభాకర్, ట్రస్ట్ సభ్యులు గండే మధు, ముల్లా పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, జూన్ 19: డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో పట్టణంలోని శ్రీగాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ విభాగంలో మేడిద శిరీష 91శాతం, కొత్తమాసు గీతికాలక్ష్మి, కమలాశ్రీలు 89శాతం, బికాం (కంప్యూట ర్స్)లో కుంచాల సుష్మ 89 శాతం, షేక్ ఆసియా 88శాతం, బీకాంలో తలతోటి దివ్య 73శాతం, బిఏలో బిల్లా మహేష్ 80శాతం మార్కులు సాధించాచారని తెలిపారు. బీకాం (కంప్యూటర్స్)లో 96శాతం, బీకాంలో 95, బీసీఏలో 90, బీఏలో 94 ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

నాట్యకారిణులకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అభినందనలు

కావలిటౌన్, జూన్ 19: మహారాష్ట్ర పూణెలోని జగన్నాథ ఆలయంలో నాట్య ప్రదర్శన ఇచ్చి తిరిగి వచ్చిన కావలికి చెందిన ఉమామహేశ్వరరావు శిష్య బృందాన్ని బుధవారం ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అభినందించారు. పూణెలో ఉత్తమ ప్రదర్శన అందించిన చిన్నారులకు అక్కడి నిర్వాహకులు అందించిన ప్రశంసాపత్రాలు షీల్డులను ఎమ్మెల్యేకు చూపించి ఆయన ఆశీర్వాదం అందుకున్నారు. కావలి చిన్నారులు ఇతర రాష్ట్రాల్లో ఉత్తమ ప్రదర్శన అందించి ప్రశంసలందుకోవడంతోపాటు కావలికి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని చిన్నారులకు కళామతల్లి ఆశీర్వాదం కలగాలని అభిలషించారు.

ఎమ్మెల్యేకు పలువురి సత్కారం

ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని బుధవారం పలువురు అధికారులు, వైశ్యప్రముఖులు, పట్టణ ప్రజలు కలిసి సత్కరించారు. అటవీశాఖ అధికారులు, పలు ప్రైవేట్ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, నవోదయ, శుభోదయ క్లాత్‌మార్కెట్ వ్యాపారులు ఇంకా పలువురు పట్టణ ప్రజలు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సాయం

కందుకూరు, జూన్ 19: కందుకూరు పట్టణంలోని పోతురాజుమిట్టసెంటర్‌కు చెందిన మూడేళ్ల చిన్నారి అరుదైన వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం దాతల సహకారం అర్థించిన నేపథ్యంలో పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రం అధికారులు, సిబ్బంది, రైతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వేలం నిర్వహణాధికారి రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో బోర్డు సిబ్బంది, బయ్యర్లు, పలువురు రైతులు కలిసి రూ.51,111 ఆర్థికసహాయం అందించారు. నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో ప్రతి ఒక్కరూ మానవతను చాటుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు గుమ్మా వెంకటరావు, కేశవ, పోలయ్య, రమేష్, ఇంటూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గుడ్లూరు, జూన్ 19 : మండలంలోని సాలిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కర్లపాలెం గ్రామ సర్పంచు చాపల రమణయ్య ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, ప్యాడ్, పెన్నులు, పలకలతో కలిపిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గంగాభవాని, ఎం.గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

కావలి, జూన్ 19: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) నెల్లూరు జిల్లా సమన్వయకర్త జీ వెంకటరమేష్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ మాసోత్సవాల్లో భాగంగా కావలి రూరల్ మండలం రామచంద్రాపురం పాఠశాలలో బుధవారం విద్యార్థులచే మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణం మనందరి బాధ్యత అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు మొక్కలు, సైన్సు పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.సుధాకర్, ఉపాధ్యాయులు పువ్వాడి వెంకటేశ్వర్లు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

కందుకూరు కేవీకేలో ఆరుగురు శాస్త్రవేత్తల నియామకం

కందుకూరు, జూన్ 19: కందుకూరు సీటీఆర్ఐకు అనుబంధంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు శాశ్వత ప్రాతిపదికన ఆరుగురు శాస్త్రవేత్తలను నియమించారు. న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన మండలి ఈ మేరకు ఒకేసారి వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు శాస్త్రవేత్తలను నియమించటంతో వారంతా బాధ్యతలు స్వీకరించారు. సస్య ఉత్పత్తి విభాగంలో డాక్టరు జ్యోతి, సస్యరక్షణ విభాగంలో డాక్టరు వెంకటేష్, ఉద్యానవన విభాగంలో డాక్టరు మయాంక్, పశువిజ్ఞాన విభాగంలో డాక్టరు శ్రీరంగ, గృహ విజ్ఞాన విభాగంలో డాక్టరు నిహారిక, వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో వివేక్ కామత్‌లు బాధ్యతలు స్వీకరించారని కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి.ప్రసాద్‌బాబు తెలిపారు.



కేవీకే హెడ్‌తో బాధ్యతలు చేపట్టిన శాస్త్రవేత్తలు